veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ శనివారం 17.10.2026

సంపుటి : 9 సంచిక : 125

www. veluturu.com

## గజ్వేల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

12





## దిల్లీలో మరోసారి ఉద్రిక్తత

### పోలీసుల అదుపులో అభిజీత్

- తిరంగా యాత్రకు బయలుదేరిన సీజేపీ వ్యవస్థాపుకుడు దీప్కే అడ్డగింత
- విద్యార్థి నాయకురాలు నేహా బోరాను కూడా పోలీసుల అదుపులోకి..

న్యూఢిల్లీ, వెలుతురు:



దేశ రాజధాని దిల్లీలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. కన్నాట్ ప్లేస్ వద్ద 'లెహ్రా దో తిరంగా' పేరుతో ఆందోళన చేపట్టేందుకు సీజేపీ పిలుపుని చ్చింది. ఈ క్రమంలో ఝండేవాలన్‌లోని తన నివాసం నుంచి బయలుదేరిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీకి అనుమతి లేనందునే అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అయితే పోలీసులు తనను అదుపులోకి తీసుకోవడంపై దీప్కే తీవ్రంగా స్పందించారు. తాను ఏ చట్టాన్ని ఉల్లంఘించానో చెప్పాలంటూ పోలీసులను ప్రశ్నించారు. మరోవైపు, ఈ ర్యాలీలో పాల్గొనేందుకు మండి హౌస్ వద్దకు

- మిగతా 2 లో..

## రాష్ట్రంలో తయారీ రంగాన్ని

# ప్రోత్సహిస్తాం

### హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయండి

- సంస్థ యాజమాన్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్అండ్‌డీ కేంద్రం
- త్వరలోనే భూమిపూజకు సిద్ధం..
- పెండింగ్ అనుమతులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (HMIE) మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు.**

హైదరాబాద్, వెలుతురు:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫాక్చరింగ్ జోన్ (NIMZ)లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి... అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు మద్దతునిస్తూ

- మిగతా 2 లో..



పినరయి విజయన్‌కు

## ఈడీ సమన్లు

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేరళ మాజీ సీఎం

న్యూఢిల్లీ, వెలుతురు:

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. సీఎంఆర్ఎల్ మనీ లాండరింగ్ కేసులో భాగంగా అక్టోబర్ 23న కొచ్చిలోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది. 'ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్' (పీఎంఎల్ఏ) కింద ఈ సమన్లు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ చట్టం కిందనే రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ కేసును నమోదు చేసింది.

### సుప్రీం కోర్టును ఆశ్రయించిన విజయన్

మరోవైపు సీఎంఆర్ఎల్ లంచం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు చేపట్టాలని విజయన్ తరపున వాదిస్తున్న సిద్ధార్థ్ లుథ్రా కోరారు. అంతేకాకుండా, తన క్లయింట్ విజయన్‌కు కఠిన చర్యల నుంచి రక్షణ కల్పించాలని సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ అంశంపై దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 26న విచారణకు చేపడతామని తెలిపారు. న్యాయమూర్తులు అందుబాటులో ఉంటే, వచ్చే వారం సెలవు దినాల్లో కూడా ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని అప్పుడు పరిశీలిస్తామని వివరించారు.



## చదువుల తల్లి

## సరస్వతీదేవి దివ్యదర్శనం!

- కరీంనగర్ మహాశక్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- భారీగా తరలివచ్చిన విద్యార్థులు, భవానీ భక్తులు
- సాయంత్రం అంగరంగ వైభవంగా అమ్మవారి పల్లకీ సేవ
- సరస్వతి దేవిని కీర్తిస్తూ నాట్యంతో ఆకట్టుకున్న మహిళలు
- ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో అద్భుతంగా కొనసాగుతున్న 'దాండియా'

12

## ఓట్ల చోరీ జరగలేదు.. దొంగలకు

# ప్రజలే ఓట్లేయడం లేదు



### మోదీకి వ్యతిరేకంగా అంతర్జాతీయ డీప్ స్టేట్, విద్రోహ శక్తుల కుట్రలు..

**శ్రీలంకలో అలజడి సృష్టించి ప్రభుత్వాన్ని కూల్చిన మాదిరిగానే భారతదేశంలోనూ ఎన్డీయే ప్రభుత్వాన్ని కూల్చేస్తామని రాహుల్ గాంధీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకుంటున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిం చిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "రాహుల్ గాంధీ.. నీకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రజాదరణతో ఎన్నికైన మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూడు" అంటూ తీవ్రంగా హెచ్చరించారు. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల నిర్వహణ యావత్ ప్రపంచానికే ఆదర్శమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.** - వెలుతురు, హైదరాబాద్

- ప్రపంచ శక్తులు ఏకమైనా మోదీ ప్రభుత్వాన్ని ఏమీ చేయలేవు
- రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, న్యాయస్థానాలను బ్లాక్‌మెయిల్ చేసే దిగజారుడు రాజకీయం కాంగ్రెస్‌ది
- దేశ భద్రత కోసం పనిచేసే అజిత్ దోవల్ వంటి వ్యక్తులను రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గం
- నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియపై రాహుల్‌కు సోయిలేదు
- తెలంగాణలో బీజేపీ నేతలను అరెస్టులు చేయిస్తూ.. ఢిల్లీకి పోయి రేవంత్ రెడ్డి రాజ్యాంగ పరిరక్షణ కబుర్లు చెప్పడం సిగ్గుచేటు

11 లో

## మూడు నెలల్లో రోహిత్ వేముల తెలంగాణ బిల్లు

# ముసాయిదా సిద్ధం చేయాలి

- అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు
- విద్యార్థుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- న్యాయ, విద్యా, హోంశాఖలు, యూజీసీ భాగస్వామ్యంతో కసరత్తు
- సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం
- సమావేశానికి హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్



హైదరాబాద్, వెలుతురు:

విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు'కు సంబంధించిన ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ (సీఎస్‌సీ)కి సమర్పించాలని స్పష్టం చేశారు. కమిటీ ఏర్పాటు నుంచి వివిధ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యానికి తావివ్వరాదని సూచించారు.

తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన రోహిత్ వేముల తెలంగాణ బిల్లుపై సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ రెండో సమావేశం జరిగింది. ప్రతిపాదిత బిల్లు రూపకల్పనకు అనుసరించాల్సిన విధానం, కమిటీ కూర్పు, న్యాయపరమైన అంశాలు, వివిధ వర్గాలతో సంప్రదింపుల ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల హక్కులకు సమర్థవంతమైన రక్షణ కల్పించేలా చట్టాన్ని రూపొందించేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి అదికారులకు దిశానిర్దేశం చేశారు.

- మిగతా 2 లో..



## అందరం కలిసి ప్రకృతి విపత్తును ఎదుర్కొందాం

- ప్రజా ప్రభుత్వం సలహాలు సూచనలు రైతులు పాటించాలి
- ప్రజలకు స్పీకర్, వికారాబాద్ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్ పిలుపు
- 97 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

12

## దసరాకు.. ప్రయాణికుల కోసం

# 7 వేల ప్రత్యేక బస్సులు

### టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి

- జూబ్లీ బస్ స్టేషన్‌లో ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎండీ



హైదరాబాద్, వెలుతురు:

దసరా పండుగను పురస్కరించుకుని సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) 7వేల ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ వీసీ & ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు సుమారు 95 శాతం బస్సులను విజయవంతంగా నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చామని వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) సిహెచ్. వెంకన్న, ఏ.శ్రీధర్‌లతో

- మిగతా 2 లో..

## బొగ్గు నుంచి బుల్లెట్ వేగం వరకు

# రాష్ట్ర ప్రయోజనాలపై 8 ప్రతిపాదనలు

- కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు కోరిన మంత్రి వినతులపై కిషన్‌రెడ్డి సానుకూల స్పందన..
- కోల్ ఇండియా ఎండీకి అప్పటికప్పుడే ఫోన్



హైదరాబాద్, వెలుతురు:

రాష్ట్ర అభివృద్ధి.. రైతుల సంక్షేమం.. పారిశ్రామిక ప్రగతి.. గిరిజన ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు.. విద్య, పరిశోధన రంగాల బలోపేతమే లక్ష్యంగా తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ వేదికగా కీలక ప్రయత్నాలు చేశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని శుక్రవారం కలిసి రాష్ట్రానికి సంబంధించిన ఎనిమిది ప్రధాన అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలని, కీలక ప్రాజెక్టులకు వేగం పెంచాలని కోరారు. ముఖ్యంగా కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించడంతో పాటు కోల్ ఇండియా ఎండీతో అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

### యాదాద్రి విద్యుత్ కేంద్రానికి బొగ్గు భరోసా

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవసం మైన బొగ్గును ముఖ్యమంత్రి కోరిన విధంగా మహా నది బొగ్గు క్షేత్రాల నుంచి కేటాయించాలని తుమ్మల కోరారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలకమైన ఈ కేంద్రానికి నిరంతరాయంగా బొగ్గు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### సింగరేణికి సత్తుపల్లి బ్లాక్-III

సత్తుపల్లి బ్లాక్-III బొగ్గు గనిని సింగరేణి కాలరీస్‌కు కేటాయించాలని ప్రతిపాదించారు. ఇప్పటికే సింగరేణి నిర్వహిస్తున్న గనులకు సమీపంలో ఈ బ్లాక్ ఉండటంతో అందుబాటులోని మౌలిక వసతులను వినియోగించుకోవచ్చని వివరించారు. తద్వారా తవ్వకాలు త్వరగా ప్రారంభించడంతోపాటు అదనపు భూసేకరణ అవసరాన్ని, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించే అవకాశముంటుందని పేర్కొన్నారు.

### ఆర్ఎఫ్‌సీఎల్ సమస్యకు శాశ్వత పరిష్కారం

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో సాంకేతిక సమస్యలతో ఉత్పత్తి నిలిచిపోతుండటంతో రాష్ట్రంలో యూరియా సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని మంత్రి వివరించారు. ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎదురైన అంతరాయాలు రబీ సీజన్‌లో రైతులకు ఎరువుల లభ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జె.పి. నడ్డాతో చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా యూరియా కేటాయింపులు ఉండేలా చూడాలని కోరారు.

### వర్సిటీకి రూ.100 కోట్ల సీఎస్ఆర్ నిధులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయి విద్యా, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100కోట్లు మంజూరు చేయాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఎర్త్ సైన్సెస్, మైనింగ్, జియాలజీ, పర్యావరణ అధ్యయనాల్లో ఉన్నత ప్రమాణాలతో పరిశోధనలు చేపట్టేందుకు ఆధునిక ప్రయోగశాలలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఈ నిధులు అందుబాటులోకి వస్తే విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని వివరించారు.

### కొత్తగూడెంలో విమానాశ్రయానికి అనుమతులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే గిరిజన ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపడటంతోపాటు పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విమానాశ్రయాల ప్రాధికార సంస్థ పరిశీలించిన స్థలాలపై సాంకేతిక నివేదికను త్వరగా ఖరారు చేసి, పౌర విమానయాన శాఖతో సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వే లైన్లకు వేగం పెంచాలి

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కీలక రైల్వే ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా రైల్వే శాఖతో సమన్వయం చేయాలని తుమ్మల కోరారు. సత్తుపల్లి-కొవ్వూరు, పెనుబల్లి-కొండపల్లి కొత్త రైల్వే లైన్లకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ మార్గాలు అందుబాటులోకి వస్తే వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక సరుకుల రవాణా సులభమవుతుందని, ఖమ్మం ప్రాంతానికి ఆంధ్రప్రదేశ్‌తో రైలు అనుసంధానం మెరుగుపడి వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

### పుష్కరాల నాటికి సారపాక వరకు రైలు

ఇప్పటికే మంజూరైన పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వే లైన్ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది భద్రాచలంలో జరగనున్న గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా భద్రాచలం సమీపంలోని సారపాక వరకు రైల్వే సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ మార్గం పూర్తయితే గిరిజన, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు, శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు.

### సానుకూలంగా స్పందించిన కిషన్‌రెడ్డి

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా తుమ్మల సమర్పించిన వినతులపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల మంత్రులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి సీఎస్ఆర్ నిధుల మంజూరు అంశంపై తక్షణమే స్పందిస్తూ కోల్ ఇండియా ఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రానికి అవసరమైన కేంద్ర సహకారం, కీలక ప్రాజెక్టుల పురోగతిపై జరిగిన ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్-2026 అవార్డుల ప్రదానోత్సవానికి

# సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

### టీజీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు నేతృత్వంలో ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధి బృందం



హైదరాబాద్ వెలుతురు:

తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో అక్టోబర్ 17న హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో నిర్వహించనున్న బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్-2026 అవార్డుల ప్రదానోత్సవానికి హాజరుకావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీజీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి ఆహ్వానించింది.

ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి, ఐ అండ్ పీఆర్ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ, జ్యూరీ కమిటీ చైర్మన్, దర్శకుడు హరీష్ శంకర్, పి.జి. విందా, చరణ్ అర్జున్, నల్గొండ గద్దర్, అనిల్ జీలా, బుల్లెట్ బండి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ వేడుకలకు గవర్నర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, వెలుతురు:

హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై అక్టోబర్ 18న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా కోరుతూ.. పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేడు లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

గవర్నర్‌ను కలిసిన వారిలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, ఇతర అధికారులు ఉన్నారు.



# విద్యాభివృద్ధికి ప్రభుత్వ సహకారం అందిస్తాం



- నందిగామలో గౌడ హాస్టల్ నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి రాణించాలి
- విద్యార్థుల వసతి గృహాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి
- గౌడ సత్రాలు, హాస్టళ్ల నిర్మాణం ద్వారా విద్యార్థులకు అండగా నిలవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



నందిగామ వెలుతురు:

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజక వర్గంలోని నందిగామలో నూతనంగా నిర్మించిన గౌడ హాస్టల్ భవనాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్మాణానికి సహకరించిన దాతలకు మంత్రి అభినందనలు తెలిపారు. గౌడ హాస్టల్ నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వాహకులకు, గౌడ సంఘం ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, గౌడ హాస్టల్ అధ్యక్షుడు చక్రవర్తి గౌడ్, తుళ్ల వీరేందర్ గౌడ్, కాట శ్రీనివాస్ గౌడ్, గీతా కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ తదితర ముఖ్య నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధి, వారి ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి, పోటీ ప్రపంచంలో రాణించాలని సూచించారు.

మన సామాజిక వర్గం నుంచి ఎక్కువ మంది సివిల్ సర్వెంట్లు తయారయ్యేలా ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు కృషి చేయాలని, ఈ దిశగా ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థుల కోసం హాస్టళ్లు, వసతి గృహాలు, సత్రాలు నిర్మించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఆర్థికంగా స్థిరపడిన వారు పేద విద్యార్థుల చదువుకు, పోటీ పరీక్షల కోచింగ్‌కు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, దాతలు, సంఘాల సమష్టి కృషితో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు.

గతంలో పెద్దలు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని, వారి కృషిని మరింత ముందుకు తీసుకెళ్లేలా కొత్త కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి పొన్నం పిలుపునిచ్చారు. విద్యార్థుల విద్యా భివృద్ధి, వసతి సౌకర్యాల కల్పన, యువతకు శిక్షణ వంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతతో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

## 7 వేల ప్రత్యేక బస్సులు..

(మొదటిపేజీ తరువాయి)

కలిసి ఎండీ నాగిరెడ్డి స్వయంగా పరిశీలించారు. జెబిఎస్ లో ప్రత్యేక విధులు నిర్వర్తిస్తున్న సికింద్రాబాద్ ఆర్ఎం సుచరిత, కరీంనగర్ ఆర్ఎం రాజు లతో బస్సుల నిర్వహణ, ట్రాఫిక్ కు సంబంధించి సమీక్షించారు. గంటకు పైగా బస్ స్టేషన్‌లో పర్యటించిన ఆయన ప్రయాణికులతో నేరుగా ముచ్చటించి, వారికి కల్పిస్తున్న ఏర్పాట్లు, సౌకర్యాలు మరియు మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్ స్టేషన్‌లో ప్రయాణికుల కోసం చేసిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎండీ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 17, 18 తేదీల్లో ప్రయాణికుల రద్దీ చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, రద్దీకి అనుగుణంగా అవసరమైన ప్రాంతాల్లో అదనపు బస్సులను నడపాలని అధికారులను ఆదేశించారు. దసరా ప్రత్యేక బస్సుల నిర్వహణలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్ర స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పండుగ ముగిసిన అనంతరం తిరిగి నగరాలకు చేరుకునే ప్రయాణికుల కోసం కూడా ఇదే తరహాలో ప్రత్యేక బస్సు సర్వీసులను సిద్ధం చేయాలని ఆదేశించారు.

బస్ స్టేషన్లలో తాగునీరు, విశ్రాంతి వసతులు, పారిశుధ్యం మరియు భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

కీలక ఆర్అండ్‌డీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ ఆర్అండ్‌డీ, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.

దేశంలో తెలంగాణ భౌగోళికంగా మధ్యలో ఉందని, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కలిగిన నగరమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఆరు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ సురక్షితమైన, జీవించడానికి అనుకూలమైన కాస్మోపాలిటన్ నగరంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలతో పాటు భవిష్యత్తులో ఓడరేవులకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు.

ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధితో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పెరి-అర్బన్ రీజియన్ (PURE) వంటి



ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అనువైన వేదికగా నిలుస్తుందని సీఎం వివరించారు.

తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం 2025 జూన్‌లో హ్యుందాయ్ ఆర్అండ్‌డీ కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం హ్యుందాయ్ ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ, రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందాయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్--2047 విజన్‌కు అనుగుణంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ముసాయిదా సిద్ధం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

'రోహిత్ వేముల చట్ట రూపకల్పన ప్రక్రియకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్‌సీడీడీ) నాయకత్వం వహించాలని సూచించారు. అవసరమైన సంబంధిత శాఖలు, సంస్థలకు కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని, న్యాయశాఖను భాగస్వామిగా చేర్చాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, యూజీసీ తదితర సంస్థల భాగస్వామ్యంపై పరిశీలన జరపాలని సూచించారు. కమిటీని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి, ముసాయిదా తయారీకి అవసరమైన కార్యాచరణను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

రోహిత్ వేముల తెలంగాణ బిల్లు విషయంలో సమాజంలోని వివిధ వర్గాల నుంచి సమగ్ర సంప్రదింపుల ప్రక్రియ చేపట్టాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ సంస్థలు, విద్యా రంగ నిపుణులు, ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపేందుకు ముందుగా జాబితా రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు సంబంధించిన అంశాలు, చట్ట అమలులో ఎదురయ్యే సవాళ్లను పరిగణనలోకి తీసుకొని ముసాయిదా సిద్ధం చేయాలని చెప్పారు. ప్రభుత్వ అధికారులతోపాటు నిపుణుల సంస్థల ప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై చర్చించిన అనంతరం న్యాయశాఖను కమిటీలో సభ్య శాఖగా చేర్చాలని, అయితే కమిటీకి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నాయకత్వం వహించాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి ఇతర శాఖలు, నిపుణులు, సంబంధిత సంస్థలతో సంప్రదింపులు జరపాలని సూచించారు.

రోహిత్ వేముల తెలంగాణ బిల్లుకు అవసరమైన న్యాయపరమైన, సాంకేతిక అంశాల్లో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. నిబంధనల రూపకల్పనలో సహకరించేందుకు నల్సార్ విశ్వవిద్యాలయం అంగీకరించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. విశ్వవిద్యాలయం నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ, సంబంధిత శాఖలు, నిపుణుల సూచనలతో సమగ్ర ముసాయిదాను రూపొందించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, వివక్షను నిరోధించడం, విద్యాసంస్థల్లో న్యాయబద్ధమైన వాతావరణాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రతిపాదిత చట్టంలో ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశం అభిప్రాయపడింది. చట్టంలోని నిబంధనలు ఆచరణ సాధ్యంగా ఉండటంతోపాటు, వాటి అమలుకు అవసరమైన వ్యవస్థలపై కూడా స్పష్టత ఉండాలని పేర్కొన్నారు.

మూడు నెలల్లోగా ప్రాథమిక ముసాయిదాను సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీకి సమర్పించి, తదుపరి పరిశీలనకు వీలుగా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్పెషల్ చీఫ్ సెక్రెటరి సవ్యసాచి ఘోష్, సీనియర్ ఐపీఎస్ అధికారి దేవేంద్ర సింగ్ చౌహాన్, ఐఏఎస్ అధికారులు యోగితా రాణా, విజయేంద్ర బోయి, , న్యాయవాది దిశా వడేకర్ తదితరులు పాల్గొన్నారు.

# దిల్లీలో మరోసారి ఉద్రిక్తత..

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన విద్యార్థి నాయకురాలు నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కన్నాట్‌ప్లేస్‌లో భారీగా పోలీసుల బలగాలు మోహరించాయి.

### సీజేపీ, విద్యార్థి సంఘాల ఆకస్మిక నిరసనలు

సెంట్రల్ దిల్లీలోని కన్నాట్ ప్లేస్, మండి హౌస్‌లో సీజేపీ మద్దతుదారులు, విద్యార్థి సంఘాల సభ్యులు ఆకస్మిక నిరసనలు చేపట్టారు. వందలాదిమంది గుంపుగా చేరి చేతిలో జాతీయ జెండాలు పట్టుకొని నిరసన తెలిపారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో అక్కడ నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది.

### ఇంటికెళ్లి నోటీసులిచ్చిన పోలీసులు

అంతకుముందు తిరంగా ర్యాలీ నేపథ్యంలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు దిల్లీ పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. 20మంది పోలీసులు దిల్లీలోని దీప్కే నివాసానికి వెళ్లి కనాట్



ప్లేస్‌లో ఆందోళన నిర్వహించకూడదని ఆంక్షలతో కూడిన నోటీసులిచ్చారు. ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేసిన పోలీసులు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం ఆంక్షలు అమలులో ఉన్నాయని దీప్కేకు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దిల్లీ పరిధిలో 6 వేల మందికి పైగా పోలీసులు, 220 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలను రంగంలోకి దించారు.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు దిల్లీ కనాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ వద్ద 'లహరా దో తిరంగా' పేరిట ర్యాలీకి అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. కానీ ఈ ర్యాలీ అనుమతి లేదని చెప్పిన పోలీసులు, జాతీయ జెండాను ఎగురవేసేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని కేటాయిస్తామని ప్రతిపాదించారు. దీంతోపాటు పరిపాలనాపరమైన కారణాలతో సెంట్రల్ పార్క్‌ను శుక్ర, శనివారం మూసివేస్తున్నట్లు దిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ప్రకటించింది.

### మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యాపారులు

ఓవైపు సీజేపీ దిల్లీలో నిరసనలు చేస్తుంటే, మరోవైపు స్థానిక వ్యాపారులు మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. కన్నాట్‌ప్లేస్ ఓ ప్రాంతంలో గుమికూడిన వ్యాపారులు, కేంద్రానికి, దిల్లీ పోలీసులకు మద్దతుగా నినాదాలు చేశారు.

## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు

# ప్రజలు, రైతులు సహకరించాలి

- వచ్చే జూన్ వరకు వర్షాభావ పరిస్థితులు ఉండే అవకాశం
- నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి
- దుబ్బాకలో 2,111 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలు
- 179 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి




**సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 16:** కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొన్నట్లే.. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపుతో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు ప్రభుత్వానికి సహకరించాలని శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని దుబ్బాక, భూంపల్లి--అక్బర్‌పేట, మిరుదొడ్డి, రాయపోల్, దౌల్తాబాద్, తొగుట మండలాలకు చెందిన 2,111 మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. మరో 179 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. 1.79 కోట్ల విలువైన చెక్కులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి అందజేశారు. రాష్ట్రంలో పేదలు గుడిసెల్లో నివసించకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నారని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 12 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మరో 3 వేల ఇళ్లను కేటాయిస్తున్నామని చెప్పారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గతంలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. గృహజ్యోతి, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పేద కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. సిద్దిపేట జిల్లాలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు రూ. 414 కోట్ల విలువైన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, త్వరలో కొత్త ఆసరా పింఛన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఉపశమనం కలిగించేలా తెలంగాణ ప్రభుత్వం రూ. 23 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిందని మంత్రి పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం తెలంగాణకే పరిమితం కాదని, దేశంలోని ఇతర ప్రాంతాలతోపాటు ప్రపంచంలోని పలు దేశాలపై కూడా ప్రభావం చూపుతోందని మంత్రి తెలిపారు. వచ్చే జూన్ వరకు వర్షాభావ పరిస్థితులు ఉండే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో సాగునీరు, తాగునీటి వినియోగంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని, వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సబ్‌కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులకు, ప్రజలకు సూచించారు. గత ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 15 వేల మెగావాట్లుగా ఉండగా, ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 20 వేల మెగావాట్లకు చేరిందని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల బోర్లు ఉన్నాయని, రైతులకు విద్యుత్ సరఫరా విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట కలెక్టర్ హైమావతి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## భక్తులకు టీజీఎస్ ఆర్టీసీ శుభవార్త

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16:** హైదరాబాద్ నగరంలోని ప్రముఖ అమ్మవారి ఆలయాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ ( గ్రేటర్ హైదరాబాద్ జోన్) ప్రత్యేక 'టెంపుల్స్ దర్శన్ టూర్' బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి గుడి, సికింద్రాబాద్ బాట మహంకాళి ఆలయం, బల్కంపేట ఎల్లమ్మ టెంపుల్, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాల దర్శనార్థం ఈ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. ఈనెల 17,18,19,20 తేదీల్లో నాలుగు రోజులపాటు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. భక్తులందరూ ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**బస్సు సర్వీసుల వివరాలు :**

ఈ ప్రత్యేక దర్శన్ టూర్స్ రెండు ప్రధాన మార్గాల నుండి వేర్వేరు ట్రిప్పులలో ప్రారంభమవుతాయి.

రూట్ 1: రాణిగంజ్ డిపో --సికింద్రాబాద్ మీదుగా
రాణిగంజ్ డిపో నుండి ప్రారంభం: ఉదయం 6:50 , 7:50 , 8:50
సికింద్రాబాద్ స్టేషన్: ఉదయం 7:00 , 8:00 ,9:00
బల్కంపేట ఎల్లమ్మ టెంపుల్: ఉదయం 7:25 నుండి 7:30
పెద్దమ్మ తల్లి టెంపుల్ (జూబ్లీహిల్స్): ఉదయం 8:00 నుండి 8:15
చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్: ఉదయం 9:05 నుండి 9:10
బాట - మహంకాళి టెంపుల్ (సికింద్రాబాద్): ఉదయం 9:50 నుండి 9:55
సికింద్రాబాద్ స్టేషన్: ఉదయం 10:10 నుండి 10:15
బల్కంపేట ఎల్లమ్మ టెంపుల్ (2వ రౌండ్): ఉదయం 10:40 నుండి 10:45
పెద్దమ్మ తల్లి టెంపుల్ (2వ రౌండ్): ఉదయం 11:15 నుండి 11:20
చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్ (2వ రౌండ్): మధ్యాహ్నం 12:10 నుండి 12:25
బాట - మహంకాళి టెంపుల్ (2వ రౌండ్): మధ్యాహ్నం 1:15 నుండి 1:20
సికింద్రాబాద్ స్టేషన్: మధ్యాహ్నం 1:35 నుండి 1:40
బల్కంపేట ఎల్లమ్మ టెంపుల్ (3వ రౌండ్): మధ్యాహ్నం 2:05 నుండి 2:10
పెద్దమ్మ తల్లి టెంపుల్ (3వ రౌండ్): మధ్యాహ్నం 2:40 నుండి 2:45
చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్ (3వ రౌండ్): సాయంత్రం 3:45 నుండి 4:00
బాట మహంకాళి టెంపుల్ (3వ రౌండ్): సాయంత్రం 4:40 నుండి 4:45
సికింద్రాబాద్ స్టేషన్ చేరుకొను సమయం: సాయంత్రం 5:00 , 6:00 , 7:00
రాణిగంజ్ డిపో చేరుకొను సమయం: సాయంత్రం 5:10 , 6:10 ,7:10.

రూట్ 2: కాచిగూడ (ఖజ+) డిపో --
అఫ్జల్‌గంజ్ మీదుగా
కాచిగూడ డిపో నుండి ప్రారంభం: ఉదయం 7:20, 8:20 , 9:20.
అఫ్జల్‌గంజ్: ఉదయం 7:30 , 8:30 , 9:30
చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్: ఉదయం 7:40 నుండి 7:45
పెద్దమ్మ తల్లి టెంపుల్ (జూబ్లీహిల్స్): ఉదయం 8:35 నుండి 8:40
బల్కంపేట ఎల్లమ్మ టెంపుల్: ఉదయం 9:10 నుండి 9:25
బాట - మహంకాళి టెంపుల్ (సికింద్రాబాద్): ఉదయం 9:55 నుండి 10:00
సికింద్రాబాద్ స్టేషన్: ఉదయం 10:15 నుండి 10:20
అఫ్జల్‌గంజ్: ఉదయం 10:55 నుండి 11:00
చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్ (2వ రౌండ్): ఉదయం 11:10 నుండి 11:15
పెద్దమ్మ తల్లి టెంపుల్ (2వ రౌండ్): మధ్యాహ్నం 12:05 నుండి 12:10
బల్కంపేట ఎల్లమ్మ టెంపుల్ (2వ రౌండ్): మధ్యాహ్నం 12:40 నుండి 12:55
బాట మహంకాళి టెంపుల్ (2వ రౌండ్): మధ్యాహ్నం 1:25 నుండి 1:30
సికింద్రాబాద్ స్టేషన్: మధ్యాహ్నం 1:45 నుండి 1:50
అఫ్జల్‌గంజ్: మధ్యాహ్నం 2:25 నుండి 2:30వరకు

## ప్రసాద్ ల్యాబ్స్‌లో
## 'పండుగ సాయన్న' ఆడియో ఆవిష్కరణ




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16:** హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించిన 'పండుగ సాయన్న' ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొని పండుగ సాయన్న ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చరిత్రను, ఆయన ధైర్యసాహసాలను, పోరాట పటిమను, ప్రజల కోసం చేసిన సేవలను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు పేర్కొన్నారు. పండుగ సాయన్న జీవిత విశేషాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఆయన స్ఫూర్తిని యువతకు అందించాలని ఆకాంక్షించారు. తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన పండుగ సాయన్న వీరగాథను విస్తృతంగా ప్రచారం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న విగ్రహ కమిటీ సభ్యులు, ముదిరాజ్ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# కార్మికశాఖలో 200 కోట్ల కుంభకోణం

- మరో వెయ్యి కోట్ల కుంభకోణానికి ప్లాన్
- అక్రమంగా ట్రయల్ బ్లైజర్ దళారి సంస్థకు 346 కోట్లు
- రెవంత్ రెడ్డిపై వెంటనే క్రిమినల్ కేసులు పెట్టాలి
- బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16 :** కార్మికుల సమక్షంలో టి అంజయ్య కార్మిక సంక్షేమ భవన్ లో జరిగిన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మిక శాఖలో పేద ప్రజలకు చెందిన భీమా సొమ్ము రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు దోచుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల భీమా పథకం కింద కేవలం రూ. 436 ప్రీమియం వసూలు చేస్తే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా ప్రజల నుండి ఒక్కొక్కరి పేరు మీద 1666 ప్రీమియం వసూలు చేస్తున్నారు.

436 బదులు 1666 ఎందుకు వసూలు చేస్తున్నారు? కార్మిక శాఖలో ఉండే సంక్షేమ బోర్డును పక్కన పెట్టి దళారి సంస్థలకు భీమా చెల్లింపుల బాధ్యతలు అప్పగించారు. పంజాబ్,కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఇలా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు సంక్షేమ బోర్డు ద్వారానే భీమా చెల్లిస్తున్నారు. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ట్రయల్ బ్లైజర్ అనే దళారి సంస్థకు అప్పగించింది. తెలంగాణలో మొత్తం 15 లక్షల మంది కార్మికులు ఉన్నారు. ఇందులో ప్రతి ఏడాది 7 వేల మంది మరణిస్తే. అందులో 700 మంది ప్రమాదవశాత్తు జరిగే మరణాల కింద ఉండగా, మిగిలిన మరణాలు సహజంగా జరుగుతున్నాయి. ఈ బాధితులందరికీ భీమా చెల్లింపులకు కేవలం 216 కోట్లు అవసరమైతే, ప్రభుత్వం మాత్రం దళారీ కంపెనీకి ఏటా 346 కోట్లు చెల్లిస్తున్నది. అంటే సుమారు 130 కోట్లు అదనంగా చెల్లిస్తున్నది. గతంలో కేసిఆర్ గారు ఎలాంటి అవినీతి లేకుండా కార్మికులకు పారదర్శకంగా భీమా అమలు చేస్తే.. రేవంత్ రెడ్డి వచ్చాక ప్రమాద బీమా 10 లక్షలు, సహజ మరణాల భీమా 2 లక్షలు ఇస్తామని పెంచారు. ఇపుడు ప్రమాద మరణాల భీమా బాధ్యత హెచ్.డి.ఎఫ్.సి కా అప్పగించి,క్రెడిట్ యాక్సెస్ లైఫ్ కంపెనీకి అప్పగించారు. క్రెడిట్ యాక్సెస్ లైఫ్ కంపెనీ 2023 లో స్థాయించారు. కంపెనీ టర్నోవర్ కేవలం 200 కోట్లు అయితే , ప్రభుత్వం ఆ కంపెనీకి 246 కోట్లు పంపారు. కార్మికులు కట్టే ప్రీమియం నుండి కూడా అధికంగా 1200 వసూలు చేస్తున్నారు. ఈ సొమ్ము ఎవరి ఖాతాలోకి పోతుంది. ట్రయల్ బ్లైజర్ అనే కంపెనీకి గతంలో బోనాంజ అనే పేరుండేది. గతంలో ఆ కంపెనీ ఏం చేసిందో తెలుసుకోకుండానే ఆ సంస్థకు భీమా చెల్లింపుల బాధ్యత అప్పగించింది. త్వరలో ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం కూడా ఈ కంపెనీల చేతికి అప్పగించి, పెద్ద కుంభకోణానికి ప్రణాళిక వేశారు. ఇది మరో 1000 కోటల కుంభకోణానికి పక్కా ప్లాన్. ఇందిరమ్మ కుటుంబ భీమా చెల్లింపుల బాధ్యత రేవంత్ రెడ్డి అల్లుడికి అప్పజెప్పుతారనే ప్రచారం కూడా జరుగుతుంది. కాబట్టి దీనిపై కూడా సమగ్ర విచారణ జరపాలి. పెద్దపల్లి లో ట్రయల్ బ్లైజర్ సంస్థకు సంబంధించిన వ్యక్తి 10 లక్షల భీమా చెల్లింపులు కావాలంటే లక్ష రూపాయలు ఇవ్వాలని లంచం అడుగుతున్నాడు. అతని పేరు రమేష్. ఇతని లాగే 33 జిల్లాల్లో 33 మంది బ్రోకర్లు ఉన్నారు. ప్రతి భీమా చెల్లింపుకు లక్షరూపాయల లంచం తీసుకుంటున్నారు. కార్మిక సంక్షేమ భవన్ ప్రధాన కార్యాలయంలో వెంకట్ రెడిఢ అనే అధికారి మితిమీరిన అక్రమ చెల్లింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకోవాలి, సంక్షేమ భవన్ లోని మొదటి అంతస్తులో మొత్తం ట్రయల్ బ్లైజర్ కంపెనీ బ్రోకర్లే ఉంటున్నారు. కార్మిక శాఖ ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారు. ఈ అక్రమ లావాదేవీల్లో ప్రభుత్వ అధికారులకు కూడా వాటా ఉంది. అందుకే దీనిపై పూర్తి స్థాయి విచారణ జరపాలి. రేవంత్ రెడ్డి కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ఈ అవినీతికి సుగమమైంది. రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి కుంభకోణానికి సూత్రధారుడు. ఆయన బోర్డు సభ్యుడు కాకపోయినా,ఎలాంటి అధికారి కాకపోయినా ఆయన చెప్పిన కంపెనీకే అవకాశం ఇచ్చారు. దీనిపై సమగ్ర విచారణ జరగాలి. కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ దీనికి పూర్తి బాధ్యత వహించాలి. మంత్రికి కూడా ఇందులో వాటా ఉన్నట్టే. కేవలం ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవడం కాదు, బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలి. పెద్దపల్లి లో ఉండే అధికారులకు మరియు సంక్షేమ భవన్ లో ఉండే వెంకట్ రెడ్డి అనే అధికారికి మధ్య సంబంధం ఏంటో తేల్చాలి. దేశంలో ఎక్కడా లేని విధంగా, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి తర్వాత తెలంగాణలో ఫేక్ ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ ల ఆధారంగా భీమా చెల్లింపులు చేశారు. ఫేక్ డెత్ సర్టిఫికెట్లు సృష్టించారు. బతికున్నవారిని చనిపోయినట్లుగా చూపి సొమ్మును కాజేశారు. పెద్దపల్లి జిల్లాలో ట్రయల్ బ్లైజర్ కంపెనీ ప్రతినిధి రమేష్ తన కుటుంబంలో ముగ్గురు చనిపోయారని ఫేక్ పత్రాలు సృష్టించి భీమా చెల్లింపులు జరిపారు. అసలు ట్రయల్ బ్లైజర్ కంపెనీకి చెల్లింపుల బాధ్యత ఎవరు ఇచ్చారు, దాని వెనుక ఎవరున్నారో తేల్చాలి. దానిపై సంతకం చేసిన నోట్ ఫైల్ బహిర్గత పరచాలి. కార్మికశాఖలో ఇంత భారీ కుంభకోణాలు జరుగుతున్నా పోలీసులు,ప్రభుత్వ అధికారులు ఒక్కరి మీద కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయలేదు. ఇప్పటికైనా పాత్ర దారులు,సూత్రధారులు అందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ముందుగా రేవంత్ రెడ్డి మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

## అంధభక్తులారా మేల్కొనండి! ప్రశ్నించడం నేర్చుకోండి...

# బూట్లు నాకే మనస్తత్వాన్ని విడిచిపెట్టండి!

**-రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:** గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు అమెరికా--పాకిస్తాన్ యుద్ధం వస్తే పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తామని చెప్పినట్లు వస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ తీవ్రంగా విమర్శించారు. దేశభక్తి గురించి గొప్పలు చెప్పుకుంటూ, ఉదయం లేవగానే "భారత్ మాతాకీ జై", "జై శ్రీరా మ్" అంటూ ప్రజలను భావోద్వేగాలకు గురిచేసి, అసలు సమస్యల నుంచి పక్కదారి పట్టించడం బీజేపీ నాయకులకు అలవాటుగా మారిందని ఆయన మండిపడ్డారు. సనాతన ధర్మం పేరుతో ప్రజల మనోభావాలను ఉపయోగించుకుంటూ, తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ధర్మానికి కొత్త నిర్వచనాలు చెబుతూ ఓట్ల కోసం ప్రజల ముందు చేతులు చాచడం ఎంతకాలం కొనసాగిస్తారని ఆయన ప్రశ్నించారు. దేశభక్తి అనేది నినాదాల్లో కాదు, దేశ ప్రయోజనాల పట్ల చూపే నిబద్ధతలో ఉంటుందని స్పష్టం చేశారు. అంధభక్తులారా, మేల్కొనండి! ప్రశ్నించడం నేర్చుకోండి! అధికారంలో ఉన్నవారు ఏం మాట్లాడినా గుడ్డిగా సమర్థించడం మానుకోండి! కాంగ్రెస్ పార్టీకి చెందినవారితో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు అనేకమంది బీజేపీలో చేరినంత మాత్రాన వారు పునీతులైపోయినట్లు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని ప్రసన్న కుమార్ శర్మ విమర్శించారు. పార్టీ మారగానే గతంలో చేసిన తప్పులు మాయమైపోతాయా? కండువా మార్చుకోగానే అవినీతి ఆరోపణలన్నీ తొలగిపోతాయా? ప్రజలు ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరాలని ఆయన పిలుపునిచ్చారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల కేసులను ఎదుర్కొంటున్న నాయకులు బీజేపీలో చేరిన తర్వాత వారిపై విచారణల విషయంలో అనుసరిస్తున్న వైఖరిని కూడా ప్రజలు నిశితంగా గమనించాలని ఆయన అన్నారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి తప్ప, అధికార పార్టీకి దగ్గరగా ఉన్నవారికి ఒక న్యాయం, ప్రతిపక్షంలో ఉన్నవారికి మరో న్యాయం ఉండకూడదని స్పష్టం చేశారు. మరోవైపు, ఉగ్రవాదం విషయంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలు అంటగడుతూ రాజకీయ విమర్శలు చేసే బీజేపీ నాయకులు, తమ పార్టీకి చెందిన నాయకులే పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తామని వ్యాఖ్యానించినట్లు వస్తున్న వార్తలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దేశభక్తి విషయంలో ద్వంద్వ ప్రమాణాలు ఎందుకని ప్రశ్నించారు. భారతదేశంలో నిజమైన ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు. దేశ ప్రజలు ఇకపై తప్పుడు ప్రచారాలను, రాజకీయ నాటకాలను, మతం పేరుతో జరిగే ఓట్ల రాజకీయాలను సహించడానికి సిద్ధంగా లేరని ఆయన హెచ్చరించారు. ప్రజలు ప్రశ్నించడం ప్రారంభించారు, వాస్తవాలను తెలుసుకుంటున్నారు, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజల ఆగ్రహం ఎన్నికల్లో ప్రతిఫలించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అంధభక్తులారా... అధికారంలో ఉన్నవారి ముందు బూట్లు నాకే మనస్తత్వాన్ని విడిచిపెట్టండి! దేశం కోసం ఆలోచించండి, రాజ్యాంగం కోసం నిలబడండి, నిజాన్ని ప్రశ్నించండి. వ్యక్తుల కంటే దేశం గొప్పది, పార్టీల కంటే ప్రజాస్వామ్యం గొప్పది! కాంగ్రెస్ పాలనలో దేశ నిర్మాణం.. బీజేపీ పాలనలో విధ్వంసం, అరాచకం -- రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ కాంగ్రెస్ పార్టీ పాలనతో పోలిస్తే బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా విధ్వంసం, అరాచకం, ప్రజాస్వామ్య విలువల పతనం ఎక్కువగా కనిపిస్తున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ తీవ్రంగా విమర్శించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో కాంగ్రెస్ పార్టీ అందించిన సేవలను ప్రజలు గుర్తించాలని ఆయన పిలుపుని చ్చారు.

**త్యాగాల చరిత్ర కాంగ్రెస్‌ది..**
**పదవుల కోసం పార్టీ మార్పులు దేనికి?**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ నిర్మాణంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ వంటి మహనీయ నాయకులు కీలక పాత్ర పోషించారని ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రజల హక్కుల కోసం అనేక మంది నాయకులు తమ ఆస్తులను, కుటుంబ సుఖాలను త్యజించి జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తుచేశారు. అయితే, నేడు కొందరు నాయకులు తమపై విచారణలు, చట్టపరమైన చర్యలు ఎదురవుతాయనే భయంతో బీజేపీలో చేరి తమను తాము పునీతులుగా చూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన వారు ప్రజల కోసం పోరాడాలని, స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారేవారి నిజస్వరూపాన్ని ప్రజలు గమనించి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు.

**అప్రకటిత ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్య హక్కులపై దాడి**

ఎమర్జెన్సీ విధించిందని ఇందిరాగాంధీని విమర్శించే బీజేపీ నాయకులు, నేడు దేశంలో ప్రజాస్వామ్య హక్కులకు ఎదురవుతున్న సవాళ్లపై సమాధానం చెప్పాలని ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. దేశం లో అప్రకటిత అత్యవసర పరిస్థితి కొనసాగుతున్న ట్లుగా ప్రభుత్వ వ్యవహారశైలి కనిపిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఢిల్లీ తో పాటు వివిధ రాష్ట్రాల్లో ప్రజలు నిర్వహిస్తున్న శాంతియుత నిరసనలు, ర్యాలీల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నా యని అన్నారు. నిరసనల్లో పాల్గొంటున్న మహిళలు, యువతపై దాడులు జరిగాయని వస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. పోలీసుల వేషధారణలో కొందరు ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఏబీవీపీ కార్యకర్తలు ఉన్నారంటూ వస్తున్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇవి సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాలు మాత్రమే కావని, ప్రజలకు అందుబాటులో ఉన్న దృశ్యాలు, వార్తా కథనాల ఆధారంగా తలెత్తుతున్న ప్రశ్నలని ఆయన అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినంత మాత్రాన ప్రజలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రజల గొంతు ను నొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించబో దని హెచ్చరించారు.

**కాంగ్రెస్ నిర్మించిన దేశాభివృద్ధి..**
**బీజేపీ పాలనలో నాణ్యతపై ప్రశ్నలు**

స్వాతంత్ర్యం అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశంలో భారీ ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పరిశ్రమలు, విద్యాసం స్థలు, పరిశోధనా సంస్థలు, రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించాయని ప్రసన్నకుమార్ వివరించారు. దేశ ఆర్థిక, పారిశ్రా మిక, సాంకేతిక అభివృద్ధికి పునాదులు వేసిన అనేక సంస్థలు కాంగ్రెస్ పాలనలోనే ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. మరోవైపు, బీజేపీ పాలనలో నిర్మిస్తున్న రహదారులు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల నాణ్యతపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతు న్నాయని విమర్శించారు. కోట్లాది రూపాయల ప్రజా ధనంతో నిర్మించిన రహదారులు కొద్ది కాలానికే దెబ్బ తినడం, గుంతలు ఏర్పడటం, మరమ్మతుల అవస రం రావడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రజాధనంతో చేపట్టే నిర్మాణాలు దీర్ఘకాలం మన్నికగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, నిర్మాణాల నాణ్యతలో లోపాలు తలెత్తితే సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత, నాణ్యతా ప్రమాణాల అమలు, ఖర్చులపై సమగ్ర ఆడిట్ తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు. అవినీతి లేదా అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్న సందర్భాల్లో నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో నిర్మించిన అనేక ప్రాజెక్టులు దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్నాయని, నేటి నిర్మాణాలు కూడా అదే స్థాయి నాణ్యతతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ నిర్మాణం అంటే కేవలం భారీ ప్రకటనలు, ప్రారంభోత్సవాలు కాదని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే మౌలిక సదుపాయాలను నిర్మించడమేనని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్, బీహార్ ఘటనలపై సమగ్ర పరిశీలన అవసరం ఉత్తరప్రదేశ్, బీహార్‌సహా వివిధ రాష్ట్రాల్లో రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ నాణ్యతపై వెలుగులోకి వస్తున్న ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ప్రసన్నకుమార్ కోరారు. నిర్మాణాలు దెబ్బతినడానికి గల కారణాలు, కాంట్రాక్టర్ల పనితీరు, నిధుల వినియోగం, ఇంజినీరింగ్ ప్రమాణాల అమలు వంటి అంశాలపై స్వతంత్ర నిపుణులతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని రాజకీయ అండతో కాపాడే ప్రయత్నాలు జరగకూడదని అన్నారు. దేశ అభివృద్ధి పేరుతో ప్రజల సొమ్మును ఖర్చు చేస్తున్నప్పుడు ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందిదేశంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణ, ప్రజల ప్రాథమిక హక్కుల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం, శాంతియుత నిరసనలను అడ్డుకోవడం, మౌలిక సదుపాయాల నాణ్యతపై ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా తప్పించుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. దేశ ప్రజలు వాస్తవాలను గమనించాలని, పాలకుల ప్రకటనలను మాత్రమే కాకుండా వారి పనితీరును కూడా పరిశీలించాలని ఆయన సూచించారు. దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల ఆశయాలను కాపాడుతూ, రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం, పారదర్శక పాలన కోసం, అవినీతి రహిత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు.

## ప్రజలే ప్రభువులన్నారు.. నాయకులే దేవుళ్లయ్యారా?

# ప్రజాస్వామ్యానికి పట్టిన వ్యక్తి పూజ జాడ్యం!

**ఒకప్పుడు తెలంగాణ గ్రామాల్లో దొరల గడీల ముందు సామాన్య ప్రజలు తలవంచేవారు. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించాలన్నా, తమ కష్టాన్ని చెప్పుకోవాలన్నా, తమ హక్కుల కోసం గొంతెత్తాలన్నా దొరల అనుమతి అవసరమయ్యేది. నాడు భూమి, భుక్తి, అధికారం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉండేది. ప్రజల శ్రమతో సంపదను కూడబెట్టుకున్న పెత్తందారులు ప్రజలనే తమ ముందు చేతులు కట్టుకొని నిలబడేలా చేసేవారు. కాలం మారింది. నిజాం నిరంకుశ పాలన అంతమైంది. ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించింది. ఓటు అనే ఆయుధాన్ని ప్రజల చేతుల్లో పెట్టింది. కానీ ప్రశ్న ఒక్కటే.. దొరతనం అంతమైందా? లేక తన రూపాన్ని మార్చుకొని కొత్త వస్త్రాలు ధరించి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి ప్రవేశించిందా?**

దాశరథి రంగాచార్య రాసిన చిల్లర దేవుళ్లు నవల ఈ ప్రశ్నకు చారిత్రక నేపథ్యాన్ని అందించే గొప్ప సామాజిక రచన. ఆనాటి తెలంగాణ గ్రామీణ జీవితంలో పెత్తందారులు, భూస్వాములు, స్థానిక అధికార యంత్రాంగం కలిసి సామాన్య ప్రజల జీవితాలను ఎలా శాసించాయో ఈ నవల సామాజిక వాస్తవికతతో ఆవిష్కరిస్తుంది. ప్రజల శ్రమను దోచుకుంటూ, వారి ఆత్మగౌరవాన్ని అణచివేస్తూ, తమ మాటే శాసనంగా చలామణి చేసుకున్న స్థానిక పెత్తందారుల వ్యవస్థను రచయిత అక్షరాల్లో నిలిపారు. గ్రామంలో కొందరు వ్యక్తులు తమను తాము దేవుళ్లుగా భావించుకునేంతగా అధికారం వారి చేతుల్లో కేంద్రీకృతమై ఉండేది. ప్రజలకు సేవ చేయాల్సిన వ్యవస్థలు సైతం వారి ముందు తలవంచే పరిస్థితులు ఉండేవి. అందుకే ఆ పెత్తందారుల ఆధిపత్యానికి ప్రతీకగా నిలిచిన చిల్లర దేవుళ్లు అనే శీర్షిక నేటికీ ఒక సామాజిక, రాజకీయ ప్రశ్నగా మన ముందుకొస్తోంది. నాడు దొర గడీ గ్రామానికి అధికార కేంద్రం. దొర మాటే తీర్పు, దొర నిర్ణయమే చట్టం, దొర అనుమతే ప్రజల జీవితాలకు కొలమానం. భూమి దొరది, పంట దొరది, అధికారం దొరది, చివరికి పేదవాడి శ్రమ మీద కూడా దొరదే పెత్తనం. కులం, ఆర్థిక స్థితి, సామాజిక హోదా ఆధారంగా మనుషుల మధ్య అంతరాలను సృష్టించి, ఆ అంతరాలనే తన అధికారానికి పునాదులుగా మార్చుకున్నాడు ఆనాటి పెత్తందారుడు. పేదవాడు తనకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే అది తిరుగుబాటుగా పరిగణించబడేది. న్యాయం కోసం అధికారుల గడప తొక్కితే అక్కడ కూడా ఆధిపత్య వర్గాల పలుకుబడే చెల్లుబాటయ్యేది. ప్రజలకు పాలనలో భాగస్వామ్యం లేదు. ప్రశ్నించే స్వేచ్ఛ లేదు. తమ జీవితాలను తామే నిర్ణయించుకునే హక్కు లేదు. ఇలాంటి సామాజిక పరిస్థితులే తెలంగాణలో భూస్వామ్య వ్యతిరేక చైతన్యానికి, ప్రజా ఉద్యమాలకు చారిత్రక నేపథ్యంగా నిలిచాయి. నేటి తెలంగాణలో పరిస్థితులు మారాయి. గడీల స్థానంలో ప్రభుత్వ కార్యాలయాలు వచ్చాయి. దొరల స్థానంలో ప్రజాప్రతినిధులు వచ్చారు. అధికారాన్ని వారసత్వంగా అనుభవించే పాత వ్యవస్థ స్థానంలో ప్రజలు ఎన్నుకునే ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. కానీ అధికారం చుట్టూ ఏర్పడుతున్న వ్యక్తిపూజ, అనుచరగణాల ఆధిపత్యం, ప్రజలకు అందుబాటులో ఉండని నాయకత్వం వంటి పరిణామాలను పరిశీలిస్తే, ఆనాటి దొరతనానికి నేటి రాజకీయ వ్యవస్థలో కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి. ఆనాడు దొరను కలవాలంటే గడీ ముందు నిరీక్షించాల్సి వచ్చేది. ఈనాడు కొందరు మంత్రులను, ఎమ్మెల్యేలను, ఎంపీలను కలవాలంటే వారి అనుచరుల అనుమతుల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆనాడు దొర చుట్టూ భటులు, జీతగాళ్లు ఉండేవారు. ఈనాడు కొందరు ప్రజాప్రతినిధుల చుట్టూ వ్యక్తిగత అనుచరులు, రాజకీయ మధ్యవర్తులు, భజనపరుల బృందాలు ఏర్పడుతున్నాయనే ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధి అంటే ప్రజలకు అందుబాటులో ఉండే సేవకుడు. కానీ కొందరు నాయకుల వ్యవహారశైలి చూస్తే ప్రజలే తమను కలవడానికి అర్హత నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందనే భావన కలుగుతోంది. ఒక సామాన్య పౌరుడు తన గ్రామంలో రోడ్డు వేయించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఆసుపత్రిలో వైద్యం అందించాలని, పింఛను ఇప్పించాలని లేదా తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేయాలని ప్రజాప్రతినిధిని కలవాలనుకుంటే, ముందుగా ఆయన అనుచరుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొన్నిసార్లు నాయకుడిని కలవడం కంటే ఆయన వ్యక్తిగత సిబ్బందిని, మధ్యవర్తులను కలవడమే కష్టంగా మారుతోందన్న అసంతృప్తి వినిపిస్తోంది. ప్రజల ఓట్లతో గెలిచిన నాయకుడిని ప్రజలే కలవలేని పరిస్థితి ఏర్పడితే, ఆ ప్రజాస్వామ్యానికి అర్థం ఏమిటి? ప్రజల అవసరాల కోసం పనిచేయాల్సిన కార్యాలయా లు, ప్రజలకు అందని అధికార కేంద్రాలుగా మారితే ప్రజలకు మిగిలేది నిరీక్షణ, నిరాశ మాత్రమే. ఎన్నికల సమయంలో మాత్రం ఈ నాయకుల రాజకీయ పరివర్తన మరో రూపంలో కనిపిస్తుంది. ఐదేళ్లపాటు ప్రజలకు అందుబాటులో లేని కొందరు నాయకులు ఎన్నికలు సమీపించగానే గ్రామాల్లో ప్రత్యక్షమవుతారు. ఇంటింటికీ తిరుగుతారు. వృద్ధుల కాళ్లు మొక్కుతారు. మహిళలను ఆప్యాయంగా పలకరిస్తారు. యువతతో కరచాలనం చేస్తారు. ప్రజల సమస్యలు తమకు తెలుసని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తామని హామీలు గుప్పిస్తారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి గ్రామానికి అభివృద్ధి, ప్రతి నిరుద్యోగికి ఉపాధి, ప్రతి పేదవాడికి న్యాయం అంటూ వాగ్దానాల వర్షం కురిపిస్తారు. కొందరు నాయకులు తమ గత పాలనను గొప్పగా చెప్పుకుంటూ, ప్రత్యర్థులపై విమర్శలు చేస్తూ, ప్రజల ఆశలను తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకునే ప్రయత్నం చేస్తారు. ఎన్నికల ప్రచారంలో కనిపించే ఈ వినయం, అధికారం చేపట్టిన తర్వాత కూడా కొనసాగితే ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం లభిస్తుంది. కానీ ఎన్నికల ముందు చేతులు జోడించిన నాయకుడే ఎన్నికల తర్వాత ప్రజలకు అందుబాటులో లేకపోతే, ఆ వినయం ప్రజాసేవలో భాగమా, లేక అధికారాన్ని సంపాదించడానికి ప్రదర్శించిన రాజకీయ వేషమా అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న అత్యంత విలువైన రాజకీయ హక్కు. కానీ ఆ హక్కును డబ్బు, మద్యం, బహుమతులు, ఇతర ప్రలోభాలతో ప్రభావితం చేయడానికి జరిగే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఎన్నికల సమయంలో ఓటుకు డబ్బు పంచడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందడం వంటి పరిణామాలు ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. డబ్బు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచిన నాయకుడు ఆ ఖర్చును తిరిగి సంపాదించుకోవాలనే ఆలోచనకు లోనైతే, ప్రజాసేవ వెనుకబడిపోయి వ్యక్తిగత ప్రయోజనాలు ముందుకొచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే ప్రతి నాయకుడినీ ఒకే గాటన కట్టడం సరైంది కాదు. ప్రజాసేవను నిబద్ధతతో నిర్వహించే నాయకులు కూడా ఉన్నారు. అయిన ప్పటికీ రాజకీయాల్లో డబ్బు




ప్రభావం, ఎన్నికల ఖర్చు, పారదర్శకత లోపం వంటి అంశాలు ప్రజాస్వామ్య వ్యవస్థ నిరంతరం ఎదుర్కొంటున్న సవాళ్లుగా మిగిలాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు నాయకుల చుట్టూ ఏర్పడే ఆర్భాటం మరో చర్చనీయాంశం. అధికార హోదా పెరిగేకొద్దీ ప్రజలకు దూరం కావడం, సాధారణ కార్యకర్తలను పట్టించుకోకపోవడం, అనుచరుల ద్వారా మాత్రమే ప్రజా సమస్యలను వినడం వంటి ధోరణులు రాజకీయ వ్యవస్థలో అసమానతలను పెంచుతున్నాయి. మంత్రి పర్యటన అంటే భారీ కాన్వాయ్‌లు, వాహనాల వరుసలు, స్వాగత తోరణాలు, పూలమాలలు, భారీ సభలు, ప్రచార ఆర్భాటాలు. ప్రజల సమస్యల పరిష్కారం కంటే నాయకుడి రాకపోకల హడావుడికే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తే, పాలనలో అసలు ప్రాధాన్యతలు పక్కదారి పడినట్లే. ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వ వ్యవస్థలో ప్రజాప్రతినిధుల హోదా ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగపడాలి తప్ప, వ్యక్తిగత వైభవాన్ని ప్రదర్శించడానికి కాదు. ప్రజల మధ్య తిరుగుతూ వారి కష్టాలను తెలుసుకోవాల్సిన నాయకులు అధికారిక కార్యక్రమాలకే పరిమితమైతే, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ సమస్యలు పాలకుల దృష్టికి చేరే అవకాశాలు తగ్గిపోతాయి. మంత్రులను కలవా లంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం అనుచరుల సహ కారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నా యనే విమర్శలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఒక ప్రజాప్రతినిధి మరో ప్రజాప్రతినిధిని కలవడానికి కూడా మధ్యవర్తుల అవసరం ఏర్పడితే, సామాన్య పౌరుడి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ప్రజాస్వామ్యంలో పదవులు ప్రజలకు సేవ చేయడానికి అప్పగించిన బాధ్యతలు మాత్రమే. అవి వ్యక్తిగత ఆధిపత్యానికి, ఇతరులను శాసించడానికి ఇచ్చిన అధికార పత్రాలు కావు. కానీ పదవుల చుట్టూ ప్రాధాన్యతలు, పలుకుబడులు, వ్యక్తిగత విధేయతలు ఏర్పడినప్పుడు ప్రజల సమస్యలు ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకుడు ప్రజల ముందు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఇక్కడే మరింత స్పష్టమవుతుంది. నాడు గ్రామాల్లో దొరల చుట్టూ తిరిగే జీతగాళ్లు, అనుచరులు దొర అధికారాన్ని బలోపేతం చేసేవారు. నేడు కొందరు రాజకీయ నాయకుల చుట్టూ ఏర్పడే అనుచరగణాలు కూడా నాయకుడి పలుకుబడిని విస్తరించే సాధనాలుగా మారుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. నాయకుడి నిర్ణయాలను ప్రశ్నించకుండా సమర్థించడం, ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడేవారిని రాజకీయ ప్రత్యర్థులుగా చూడడం, ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత విధేయతకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి ధోరణులు ప్రజాస్వామ్య చర్చకు ఆటంకంగా మారవచ్చు. నాయకుడి చుట్టూ ఉన్నవారు ప్రజలకు, నాయకుడికి మధ్య వారధిగా పనిచేయాలి. కానీ వారే ప్రజలకు అడ్డుగోడలుగా మారితే, ప్రజాప్రతినిధికి ప్రజల వాస్తవ పరిస్థితులు తెలియకుండా పోతాయి. చిల్లర దేవుళ్లలో కనిపించే స్థానిక ఆధిపత్య వ్యవస్థను నేటి రాజకీయ వ్యవస్థతో పోల్చినప్పుడు, అధికారం చుట్టూ ఏర్పడే ఇలాంటి అనుబంధాల స్వభావాన్ని పరిశీలించాల్సిన అవసరం కనిపిస్తుంది. తెలంగాణ రాజకీయాల్లో ఉద్యమ ఆకాంక్షలు కూడా ఒక ముఖ్యమైన అంశం. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం వెనుక ప్రాంతీయ అసమానతలు, నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం, స్వయం పాలన వంటి అనేక ఆకాంక్షలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత పాలకులపై పడింది. అయితే రాష్ట్ర సాధన అనేది ఒక చారిత్రక ఘట్టం మాత్రమే కాదు, ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు తీసుకురావాల్సిన నిరంతర ప్రక్రియ కూడా. ఉద్యమ కాలంలో ప్రజల మధ్య తిరిగిన నాయకత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే ప్రజలతో సంబంధాన్ని కొనసాగించగలిగిందా? గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు, అణగారిన వర్గాల ఆకాంక్షలు పాలనా నిర్ణయాల్లో ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాజకీయ ప్రసంగాల్లో కాకుండా ప్రజల రోజువారీ జీవితాల్లో కనిపించాలి. ప్రజాస్వామ్యంలో రాజకీయ పరివర్తన అంటే కేవలం ఒక పార్టీ స్థానంలో మరో పార్టీ అధికారంలోకి రావడం కాదు. పాలనా సంస్కృతిలో మార్పు రావడం, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యవస్థలు ఏర్పడడం, ప్రభుత్వ నిర్ణయాల్లో పారదర్శకత పెరగడం, ప్రజల సమస్యలకు సకాలంలో పరిష్కారాలు లభించడం నిజమైన రాజకీయ పరివర్తనకు కొలమానాలు. ఒక ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వాటి ఉద్దేశాలు, అమలు తీరు, లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాల ఆధారంగా పరిశీలించాలి. అదే సమయంలో ప్రభుత్వాన్ని విమర్శించడం, ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. ప్రశ్నించే పౌరుడిని ప్రత్యర్థిగా చూడడం, విమర్శలను వ్యక్తిగత అవమానంగా భావించడం, ప్రజా సమస్యలపై చర్చకు బదులుగా రాజకీయ ఆరోపణలకే ప్రాధాన్యం ఇవ్వడం ప్రజాస్వామ్య సంస్కృతిని బలహీనపరుస్తాయి. నేటి రాజకీయాల్లో వ్యక్తిగత ప్రచారం, సామాజిక మాధ్యమాల హడావుడి, భారీ సభలు, నాయకుల చిత్రాలతో నిండిపోయే ప్రచారాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ప్రజలకు అందాల్సిన సమాచారం కొన్నిసార్లు ప్రచార పోటీలో మరుగునపడుతోంది. ఒక నాయకుడి విజయాలను మాత్రమే ప్రదర్శించడం, వైఫల్యాలపై చర్చను నిరుత్సాహపరచడం, ప్రతి సమస్యను రాజకీయ ప్రత్యర్థులపై నెట్టివేయడం వంటి ధోరణులు ప్రజలకు సమగ్ర వాస్తవాలు తెలియకుండా చేసే ప్రమాదం కలిగిస్తాయి. ప్రజలకు అవసరమైనది వ్యక్తుల గొప్పతనాన్ని చాటే ప్రచారం మాత్రమే కాదు. ప్రభుత్వ పనితీరు, ఖర్చులు, పథకాల ఫలితాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై స్పష్టమైన సమాచారం. రాజకీయ నాయకుల మాటలకు, చేతలకు మధ్య ఉన్న అంతరాన్ని గుర్తించే సామాజిక చైతన్యం పెరిగినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనం బలపడుతుంది. అయితే నేటి రాజకీయ వ్యవస్థలో కనిపించే ప్రతి సమస్యను ఆనాటి భూస్వామ్య వ్యవస్థతో పూర్తిగా సమానంగా చూడలేం. నిజాం పాలనలోని నిరంకుశత్వం, వెట్టిచాకిరీ, భూస్వామ్య దోపిడీ, పౌర హక్కుల పరిమితులు ఒక నిర్దిష్ట చారిత్రక పరిస్థితికి సంబంధించినవి. నేటి తెలంగాణలో రాజ్యాంగం, ఎన్నికలు, న్యాయవ్యవస్థ, మీడియా, పౌర సమాజ సంస్థలు వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలు ఉన్నాయి. ప్రజలకు ప్రభుత్వాలను ఎన్నుకునే, ప్రశ్నించే, విమర్శించే హక్కులు ఉన్నాయి. అయినప్పటికీ ఈ హక్కులు కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి పౌరుడికి ఆచరణలో అందుతున్నాయా లేదా అన్నది కీలకమైన ప్రశ్న. గతంతో పోలిక చేయడం అంటే రెండు కాలాలను ఒకటిగా ప్రకటించడం కాదు. గతంలో ఉన్న అధికార దుర్వినియోగ ధోరణులు నేటి వ్యవస్థలో ఏ రూపాల్లో కనిపిస్తున్నాయో గుర్తించి, వాటిని ప్రజాస్వామ్య మార్గాల్లో సరిదిద్దుకునే అవకాశాలను పరిశీలించడం. ప్రజల చేతిలో ఉన్న ఓటు ఐదేళ్లకు ఒకసారి ఉపయోగించే రాజకీయ సాధనం మాత్రమే కాదు. ప్రజాప్రతినిధుల పనితీరును నిరంతరం పరిశీలించే పౌర బాధ్యతకు కూడా అది ప్రతీక. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రజలకు అందుబాటులో ఉండడం, ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి వంటి అంశాలను ప్రజలు ప్రశ్నించే అవకాశం ఉండాలి. గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాలు, సమాచార హక్కు చట్టం, స్థానిక సంస్థలు, స్వతంత్ర మీడియా వంటి వ్యవస్థలు ప్రజల గొంతును పాలనకు చేరవేసే మార్గాలుగా పనిచేయాలి. ఈ సంస్థలు సమర్థంగా పనిచేసినప్పుడే అధికారానికి ప్రజల పట్ల బాధ్యత ఉంటుందనే ప్రజాస్వామ్య భావన బలపడుతుంది. దాశరథి రంగాచార్య చిల్లర దేవుళ్లు రాసిన కాలంలో ప్రజలపై పెత్తనం చెలాయించిన స్థానిక ఆధిపత్యాన్ని ప్రశ్నించడం ఒక సామాజిక అవసరం. నేడు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల పేరుతో అధికారాన్ని చేపట్టినవారు ప్రజలకు ఎంతవరకు జవాబుదారీగా ఉన్నారో పరిశీలించడం అంతే ముఖ్యమైన పౌర అవసరం. నాటి దొరలు ప్రజల శ్రమను, స్వేచ్ఛను తమ ఆధీనంలో ఉంచుకోవాలని చూశారు. నేడు కొందరు నాయకుల వ్యవహారశైలిలో ప్రజల ఓటును అధికారానికి చేరుకునే మార్గంగా మాత్రమే చూసే ధోరణి కనిపిస్తే, అది ప్రజాస్వామ్య విలువలపై ఆత్మపరిశీలనకు దారితీయాలి. ఆనాడు గడీ ముందు నిలబడిన సామాన్యుడు తన బాధను చెప్పుకునేందుకు భయపడేవాడు. నేడు ప్రజాప్రతినిధుల కార్యాలయాల ముందు నిలబడిన పౌరుడు తన సమస్య పరిష్కారం కోసం అనవసరంగా తిరగాల్సిన పరిస్థితి ఎదురైతే, వ్యవస్థలోని లోపాలను గుర్తించి సరిదిద్దాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుంది. చిల్లర దేవుళ్లు మనకు గుర్తుచేసేది కేవలం గతకాలపు దొరల కథను కాదు. అధికారం మనిషిని ప్రజలకు దూరం చేసినప్పుడు, ప్రజల శ్రమకు విలువ తగ్గినప్పుడు, సామాజిక హోదా మానవ గౌరవం కంటే పెద్దదిగా మారినప్పుడు ఏర్పడే పరిణామాలను కూడా ఆలోచింపజేస్తుంది. నేటి తెలంగాణ రాజకీయ వ్యవస్థలో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, విమర్శలను స్వీకరించే ప్రజాస్వామ్య సంస్కృతి, పారదర్శకమైన పాలన, అధికార దుర్వినియోగంపై చర్యలు, ప్రజా సమస్యలకు ప్రాధాన్యత వంటి అంశాలు నిరంతరం చర్చించబడాలి. నాయకులు ప్రజల మధ్యకు రావడం ఎన్నికల అవసరంగా కాకుండా ప్రజాసేవలో భాగంగా మారాలి. ప్రజలను కలవడం ఒక ప్రత్యేక కార్యక్రమంగా కాకుండా ప్రజాప్రతినిధుల సాధారణ బాధ్యతగా ఉండాలి. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం రాజకీయ వ్యతిరేకతగా కాకుండా ప్రజాస్వామ్య హక్కుగా గుర్తించాలి. చివరికి కాలం మారిందా, నాయకులు మారారా, పాలనా వ్యవస్థ మారిందా అనే ప్రశ్నలకు సమాధానం వారి హోదాలు, ఆర్భాటాలు, ప్రసంగాల్లో దొరకదు. సామాన్యుడి జీవితంలో వచ్చిన మార్పుల్లోనే దొరుకుతుంది. ఒక పేదవాడు తన సమస్యను చెప్పుకోవడానికి నాయకుడి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పరిష్కారం పొందగలుగుతున్నాడా? ఒక రైతు తన హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా న్యాయం పొందగలుగుతున్నాడా? ఒక నిరుద్యోగి తన భవిష్యత్తుపై స్పష్టమైన అవకాశాలను చూడగలుగుతున్నాడా? ఒక మహిళ భద్రతతో, గౌరవంతో జీవించగలుగుతున్నదా? కులం, వర్గం, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి పౌరుడి గొంతుకకు విలువ లభిస్తున్నదా? ఈ ప్రశ్నలకు లభించే సమాధానాలే రాజకీయ పరివర్తనకు నిజమైన కొలమానాలు. నాడు ప్రజలపై పెత్తనం చెలాయించిన చిల్లర దేవుళ్లను సాహిత్యం ప్రశ్నించింది. నేడు ప్రజల పేరుతో అధికారాన్ని అనుభవించే నాయకత్వం కూడా ప్రజల ముందు జవాబుదారీగా ఉండాల్సిన అవసరాన్ని సమాజం గుర్తుచేయాలి. ప్రజాస్వామ్యంలో నాయకులు దేవుళ్లు కారు, ప్రజలు భక్తులు కారు. నాయకులు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధులు, ప్రజలు రాజ్యాంగబద్ధమైన హక్కులు కలిగిన పౌరులు. ప్రజల ఓటుతో అధికారంలోకి వచ్చినవారు ప్రజల సమస్యలను వినాలి, ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి, ప్రజల నిధుల వినియోగంపై లెక్కలు చెప్పాలి. వ్యక్తిపూజకు బదులుగా ప్రజాసేవకు, ఆర్భాటానికి బదులుగా జవాబుదారీతనానికి, వాగ్దానాలకు బదులుగా వాటి అమలుకు ప్రాధాన్యత లభించినప్పుడే ప్రజాస్వామ్యం తన అసలు అర్థాన్ని సంతరించుకుంటుంది. చిల్లర దేవుళ్లు ఆనాటి తెలంగాణ సమాజానికి అద్దం పట్టినట్లే, నేటి రాజకీయ వ్యవస్థను కూడా ఆత్మపరిశీలన చేసుకునేలా చేసే సాహిత్య ప్రేరణగా నిలుస్తుంది. దొరతనం రూపం మారవచ్చు, అధికారం చుట్టూ ఆర్భాటాలు మారవచ్చు, రాజకీయ నినాదాలు మారవచ్చు. కానీ ప్రజల ఆత్మగౌరవం, సమానత్వం, న్యాయం, జవాబుదారీతనం అనే ప్రజాస్వామ్య విలువలు మారకూడదు. చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠం ఇదే. ప్రజలే పాలనకు కేంద్రబిందువుగా ఉండాలి. ప్రజలే ప్రశ్నించే శక్తిగా ఎదగాలి. ప్రజల జీవితాల్లో గౌరవం, స్వేచ్ఛ, సమాన అవకాశాలు సాకారమైనప్పుడే తెలంగాణలో రాజకీయ పరివర్తన సంపూర్ణమైన అర్థాన్ని పొందుతుంది. లేకపోతే దొరల గడీలు కనుమరుగైనా, ప్రజలకు అందని అధికార గడపలు కొత్త రూపంలో కొనసాగుతూనే ఉంటాయి.



-మన్నారం
నాగరాజు
సామాజిక
రాజకీయ విశ్లేషకులు.

---

సాయం ఒక సేవా -

## మానవత్వం ఒక వరం



పొందిన సహాయం
మరవకుమా,
అది అప్పు కాదు, అది ఒక దీపం!
ఆ దీపం ఆరిపోనీకుమా,
నీ గుండెలో దాన్ని వెలిగించుమా!

అడగకముందే ఆదుకోమని
ఆ చేతులు మళ్ళీ అడగవు.
వాటి మౌనంలో ఆకలి ఉంటుంది,
వాటి కళ్ళలో వేదన ఉంటుంది.
గ్రహించే హృదయమే
మానవత్వం!

డబ్బుతో మానవత్వాన్ని కొనలేవు,
పలుకుబడితో ప్రేమను
పొందలేవు.
అలంకరణతో అందం
వస్తుందేమో,
ఆత్మసౌందర్యం మాత్రం సేవతోనే
వస్తుంది!

నోట్ల కట్టలు ఇచ్చినా రుణం తీరదు,
మాటల మూటలు చెప్పినా
ఋణం తీరదు.
తిరిగి ఒకరికి సాయం
చేసినప్పుడే,
నీవు పొందిన సాయానికి అర్థం
పరమార్థం!

సాయం అంటే డబ్బు కాదురా,
ఒక చేయూత, ఒక ఓదార్పు, ఒక
భరోసా.
మనిషిగా పుట్టినందుకు మనిషికి
చేయవలసినది,
అదేరా అసలైన మానవ సేవ!

-నాగేందర్ లావుడి
పబ్లిక్ అడ్మినిస్ట్రేటర్
9949469679

---

“పుడితే తల్లి సంతోషపడాలి... పెరిగితే తండ్రి ఆనందపడాలి

## బతికితే సమాజం సంతోషించాలి”

మాటల్లో మనిషి జీవితానికి ఒక గొప్ప సందేశం ఉంది. మనకు లభించిన జీవితాన్ని ప్రేమతో, బాధ్యతతో, మంచితనంతో గడిపి, మన చుట్టూ ఉన్నవారి జీవితాల్లో సంతోషాన్ని నింపాలనేది ఈ మాటల సారాంశం. “పుడితే తల్లి సంతోష పడాలి” అంటే--- తల్లి మనకు జన్మనిచ్చిన ఆనందాన్ని జీవితాంతం నిలబెట్టేలా నడుచుకో వాలి. మన చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలను భరిస్తూ, తన అవసరాలను పక్కనపెట్టి మనల్ని పెంచుతుంది. మనం పెద్దయ్యాక ఆమె మాటను ఓపికగా వినడం, ఆరోగ్యం గురించి పట్టించుకో వడం, అవసరమైనప్పుడు పక్కన ఉండడం ఆమెకు ఎంతో ధైర్యాన్నిస్తుంది. “నా బిడ్డ నన్ను ప్రేమగా చూసుకుంటున్నాడు” అనే సంతోషం తల్లికి గొప్ప సంపద. “పెరిగితే తండ్రి ఆనందప డాలి” అంటే---మన ఎదుగుదలలో బాధ్యత, నిజాయితీ, సంస్కారం కనిపించాలి. తండ్రి కష్టాన్ని గుర్తించి, మన జీవితాన్ని మనం చక్కదిద్దుకుంటూ, కుటుంబానికి తోడుగా నిలవాలి. మనం సంపాదించే డబ్బుతోపాటు మన ప్రవర్తన కూడా ఆయనకు గర్వకారణం కావాలి. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తిగా, ఇతరులను గౌరవించే మనిషిగా ఎదగడం తండ్రికి ఎంతో ఆనందాన్నిస్తుంది. “బతికితే సమాజం సంబరపడాలి” అంటే--- మన ఉనికి వల్ల ఎవరికైనా మేలు జరగాలి. మనకు చేతనైన సహాయం చేయడానికి ప్రతిసారీ పెద్ద సంపద అవసరం ఉండదు. ఆకలితో ఉన్నవారికి భోజ నం పెట్టడం, చదువుకునే పిల్లవాడికి తోడ్పడ టం, కష్టంలో ఉన్నవారికి సరైన దారి చూపడం, బాధలో ఉన్నవారి మాట వినడం కూడా విలువైన సేవలే. మన వృత్తిని నిజాయితీగా చేయడం, ఇతరుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వడం కూడా సమాజానికి చేసే మేలే. మన వల్ల ఒక కుటుంబానికి భరోసా కలిగినా, ఒక మనిషికి ధైర్యం వచ్చినా, ఒక చిన్నారి భవిష్యత్తుకు దారి ఏర్పడినా మన జీవితానికి అర్థం చేకూరుతుంది. “ఆయన ఉన్నారు కదా... మనకు అండగా ఉంటారు” అని ఎవరైనా నమ్మ గలిగితే, ఆ నమ్మకాన్ని సంపాదించడం గొప్ప విషయం. “చస్తే మన శవాన్ని మోసే చేతులు పోటీపడాలి” అన్నది మనం బతికుండగా పెంచుకున్న ఆత్మీయతకు ప్రతీక. మనతో గడిపిన సమయాన్ని, మనం చేసిన సహాయాన్ని, చూపిన ప్రేమను గుర్తుచేసుకుని మనుషులు కృతజ్ఞతతో ముందుకు రావాలనే భావన అందులో ఉంది. మనిషి విలువను అంత్యక్రియ లకు వచ్చిన జనసంఖ్యతో కొలవలేం. ఒక్కరి జీవితంలో మనం మిగిల్చిన మంచి ప్రభావం కూడా ఎంతో గొప్పది. “చివరికి శ్మశానం కూడా కన్నీరు కార్చాలి” అనేది హృదయాన్ని తాకే కవి తాత్మక భావన. ఒక మంచి మనిషి వెళ్లిపోయినప్పుడు ఆయన లేని లోటు ఎంతో మందికి అనిపిస్తుంది. ఆయన పలకరింపు, సహాయం చేసే తీరు, ఇచ్చిన ధైర్యం పదేపదే గుర్తుకొస్తాయి. ఆ లోటు ఎంత లోతుగా ఉంటుందో చెప్పడానికి శ్మశానం కూడా కన్నీరు కార్చాలనే ఉపమానాన్ని ఉపయోగించారు. అలాంటి జీవితం ప్రతిరోజూ చేసే చిన్నచిన్న పనులతో రూపుదిద్దుకుంటుంది. ఇంట్లో ప్రేమ గా మాట్లాడటం, తప్పు చేస్తే ఒప్పుకోవడం, ఇతరుల గౌరవాన్ని కాపాడటం, అవసరంలో ఉన్నవారికి సమయం కేటాయించడం–ఇవన్నీ మన వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. మన కుటుంబాన్ని, మన ఆరోగ్యాన్ని, మన ప్రశాంతతను కాపాడు కుంటూ ఇతరులకు తోడుగా నిలవాలి. జీవితం విలువ మనం గడిపిన సంవత్సరాల్లోనూ, ఆ సంవత్సరాల్లో పంచిన ప్రేమలోనూ ఉంటుంది. మన పేరు వినగానే ఎవరి ముఖంలోనైనా చిరునవ్వు మెదిలితే... మన జ్ఞాపకం ఎవరికైనా ధైర్యాన్నిస్తే... మనం నాటిన మంచితనం మన తరువాత కూడా కొనసాగితే... అదే అర్థవంత మైన జీవితం.

తల్లి ప్రేమకు గౌరవం ఇవ్వాలి
తండ్రి శ్రమకు విలువ ఇవ్వాలి
కుటుంబానికి భరోసాగా నిలవాలి
సమాజానికి చేతనైన మేలు చేయాలి

మనతో పరిచయమైన వారి మనసుల్లో మంచి జ్ఞాపకంగా నిలవాలి. మనకు లభించిన జీవితాన్ని ఇలా ప్రేమతో నింపుకుంటే- మనం ఉన్న పుడు ఆనందాన్ని, మన తరువాత ఆత్మీయమైన జ్ఞాపకాలను అందించగలం.



-మీ నక్క యాదగిరి

---

రాజకీయంలో సిద్ధాంత పరమైన చర్చల స్థానాన్ని

## ఆక్రమిస్తున్న వ్యక్తిగత దూషణలు

రాజకీయాలలో ఒక నాయకుడి విధానాలను వారి పరిపాలనా సామర్థ్యాన్ని లేదా ప్రజా సమస్యలపై వారాకున్న అవగాహన లోపాలను తప్పుపట్టడం ప్రజాస్వామ్య లక్షణం . కానీ , ప్రత్యర్థి ని రాజకీయంగా లేదా సమర్ధతతో ఎదుర్కొనే సత్తా లేనప్పుడు , వారి వ్యక్తిగత జీవితాన్ని గత వృత్తిని హేళన చేస్తూ దూషణలకు దిగడం కేవలం మానసిక బలహీనతను నైతిక ఓటమిని సూచిస్తుంది . చేతగాని తనంతో కూడిన ఇటువంటి చర్యలు రాజకీయ వాతావరణాన్ని పూర్తిగా కలుషితం చేస్తాయి . దీనిగి తోడు వాక్ స్వాతంత్ర్యం అంటే , ఎదుటి నాయకులను ఇష్టమొచ్చినట్లు దూషించడమనే ఒక వింతైన ప్రమాదకరమైన ధోరణి పెరుగుతోంది . ప్రజాస్వామ్యం మనకు ఇచ్చిన స్వేచ్ఛను బాధ్యతరాహిత్యంగా వాడుకుంటూ విమర్శల పేరిట బూతులు తిట్టడం , వ్యక్తిగత ప్రతిష్ట ను దిగజార్చడం హక్కు అని కొందరు భావిస్తున్నారు . విమర్శల్లో సంస్కారాన్ని విస్మరించి వ్యక్తిగత కక్షలకు వేదికగా మార్చుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు . ఈ దిగజారుడు సంస్కృతి ప్రస్తుతం నాయకులతోనే ఆగకుండా దేశంకోసం సర్వస్వం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను సైతం దూషించే స్థాయికి చేరడం అత్యంత విచారకరం . తమ రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వికృతీకరిస్తూ మహానుభావుల త్యాగాలను కించపరచడం నేడు ఒక అలవాటుగా మారింది . ఈ ద్వేష ప్రచారానికి సోషల్ మీడియా ఒక ప్రధాన వేదికగా మారింది . సామాజిక మాధ్యమాలలో కనీస విచక్షణ లేకుండా ప్రత్యర్థులపై అసభ్యకరమైన పోస్టులతో , మార్ఫింగ్ చిత్రాలతో విరుచుకుపడడం నాగరిక సమాజం తలదించుకునేలా చేస్తోంది . తెరవెనుక దాక్కుని చేసే ఈ డిజిటల్ దాడులు సమాజంలో నైతిక విలువలను పూర్తిగా తుడిచిపెట్టేస్తున్నాయి . రాజకీయ ప్రత్యర్థిని ఓడించాలంటే తమవద్ద ఉన్న ‘ నిజం’ సరిపోదని భావించి , అబద్దాన్ని మరియూ ‘ వ్యకిత్వ హననాన్ని ‘ఆశ్రయించడం అత్యంత ప్రమాదకరం . తాత్కాలిక రాజకీయ లాభాల కోసం అబద్దాల పునాదులపై విమర్శలు చేయడం వలన సమాజంలో ద్వేషం పెరుగుతుందే తప్పా ఎలాంటి ఉపయోగం ఉండదు . సమర్ధత గల ఏ నాయకుడు తన సొంత సిద్దాంత బలాన్ని వదిలి , ప్రత్యర్థి వ్యక్తిగత జీవితాన్ని దెబ్బతీసే చౌకబారు వ్యూహాలను నమ్ముకోడు . ఇలాంటి సంస్కృతి పట్ల నష్టపోయేది కేవలం ఆయా నాయకులు మాత్రమే కాదు ,, అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థే దెబ్బతింటుంది . నాయకులపై రాజకీయాలపై ప్రజలకు ఉండాల్సిన గౌరవం నమ్మకం పూర్తిగా సన్నగిల్లుతాయి . నిజమైన ప్రజా సమస్యలు అభివృద్ధి , సంక్షేమం వంటి అంశాలు పక్కదారిపట్టి చర్చలన్నీ పరస్పర దూషణల చుట్టూనే తిరుగుతాయి . ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం వికసించాలంటే వ్యక్తిగత హేళన స్థానంలో , విధానపరమైన విమర్శలు ప్రజా ఉపయోగకరమైన చర్యలు జరగాల్సిన అవసరం ఉన్నది .



-మండాది
గోపీనాథ్
ముక్కుడు
దేవులపల్లి
సెల్;
9885045344

# సింగాపురం వార్డులో భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రుల వేడుకలు

- వైభవంగా సామూహిక కుంకుమార్చనలు

అమ్మవారి కృప కోసం పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు..

- ఆధ్యాత్మిక శోభతో పులకించిన సింగపురం



**శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 16 :** దేవి శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా సింగపురం వార్డులో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వార్డు పరిధిలోని స్థానిక మండపంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ, కుటుంబాల్లో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని కోరుకుంటూ సాంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన మహిళలు ఈ విశేష పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేక పూల మాలలతో, విశేష అలంకారాలతో నయనమనోహరంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, చండీ పారాయణాలు, మంగళ హారతుల మధ్య కుంకుమార్చన కార్యక్రమం శాస్త్రోక్తంగా సాగింది. పూజలో పాల్గొన్న మహిళలకు వార్డు నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. నవరాత్రుల్లో అమ్మవారిని పూజించడం, ముఖ్యంగా కుంకుమార్చనల్లో పాల్గొనడం వల్ల స్త్రీలకు సౌభాగ్యం, గ్రామానికి శుభం చేకూరుతుందని పేర్కొన్నారు. సింగపురం వార్డు ప్రజలంతా ఎంతో ఐకమత్యంతో ఈ వేడుకలను ఒకే చోట నిర్వహించుకోవడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఉత్సవ కమిటీ సభ్యులు మరియు కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసేనలోకి గాయత్రి నగర్ డివిజన్ నాయకుల చేరిక

**పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కళ్యాణ్**



**కూకట్ పల్లి అక్టోబర్ 16 వెలుతురు:** జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై కూకట్ పల్లి నియోజకవర్గంలోని గాయత్రి నగర్ డివిజన్ కు చెందిన నాయకులు తుంగం శ్రీనివాస రావు, పొట్నూరు శ్రీనివాసరావు జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, జాయినింగ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. హైదరాబాద్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ, జనసేన పార్టీ విధివిధానాలపై విశ్వాసంతో పార్టీలో చేరిన నూతన సభ్యులు కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. జనసేన సైనికులుగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజాసేవలో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, జాయినింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా చిన్నారి అన్విక ప్రథమ జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి అక్టోబర్ 16 వెలుతురు:** తెలంగాణ రాష్ట్ర ఆదాయపు పన్నుశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రాకేష్ దంపతుల కుమార్తె అన్విక జన్మదిన వేడుకలు హైదరాబాద్ లోని హోటల్ దస్పల్లాలో కేపీహెచ్‌బీ కాలనీవాసులు, మిత్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో చిన్నారి అన్విక ప్రథమ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విశాఖపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరై చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి దంపతులు వేడుకల్లో పాల్గొని చిన్నారి అన్వికను ఆశీర్వదించారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, విద్యాబుద్ధులు నేర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో బి. తాండవ కృష్ణ, జి. నర్సింగ్ రావు, శ్రీధర్, సాంబశివరావు, సూర్యనారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై పోలీసుల దాడి

**ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన న్యాయవాది నక్క ప్రమోద్**



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 16:** కరీంనగర్‌లో జర్నలిస్టులు పోతూరి శేఖర్ , సంపత్‌లపై పోలీసుల వేధింపులు, దాడి, కులం పేరుతో అవమానించారనే ఆరోపణలపై జాతీయ షెడ్యూల్డ్ కాస్ట్స్ కమిషన్ కు ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది నక్క ప్రమోద్ తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరినట్లు పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన వైద్య నివేదికలు, ఇతర ఆధారాలను పరిశీలించి నిజానిజాలు వెలికితీయాలని కమిషన్‌ను విజ్ఞప్తి చేసినట్లు న్యాయవాది నక్క ప్రమోద్ తెలిపారు.

## 19వ వార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు

- మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం వార్డు ఇన్‌చార్జి అరవింద్ ఆహ్వానం మేరకు వార్డులోని పలు బస్తీల్లో ఆయన పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. సమస్యలను గుర్తించి రాబోయే రోజుల్లో ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు అరవింద్ మాట్లాడుతూ వార్డులోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ సహకారంతో వార్డు అభివృద్ధికి అవసరమైన పనులను చేపడతామని పేర్కొన్నారు.

## మొగులమ్మ కాలనీలో దుర్గామాతను దర్శించుకున్న జిల్లా గణేష్ నేత

**దేవీ నవరాత్రుల్లో భక్తి, సంస్కృతిని చాటుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు**



**కూకట్ పల్లి అక్టోబర్ 16 వెలుతురు:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గామాత మండపాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్ నేత సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ, దుర్గామాతను భక్తితో ఆరాధించే ప్రతి ఒక్కరిపై అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని అన్నారు. మొగులమ్మ కాలనీలో దేవీ నవరాత్రుల సందర్భంగా భరతనాట్యం, కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు భారతీయ సంప్రదాయాలు, కళలను భావితరాలకు పరిచయం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి తనను విశిష్ట అతిథిగా ఆహ్వానించిన దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ వేడుకల్లో భవాని మాతలు, మహిళలు, యువకులు, కాలనీ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## కేపీహెచ్‌బీ 9వ ఫేజ్ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా

**నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి వడ్డేపల్లి రాజేశ్వరరావు హామీ..**



**కూకట్ పల్లి అక్టోబర్ 16 వెలుతురు:** కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్ అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని తెలిపారు. కేపీహెచ్‌బీ 9వ ఫేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా, అధ్యక్షుడు జి. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాలనీ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడిన రాజేశ్వరరావు, కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాలనీ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాలనీవాసుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డితో పాటు కమిటీ సభ్యులు కే. రాహుల్, కే. చంద్రమోహన్ రెడ్డి, ఎం. వీర గోవిందరావు, ఎన్. తిలక్ కుమార్, కృష్ణార్జున రెడ్డి, ఆర్. ఈశ్వర్ రెడ్డి, పీవీ సత్యనారాయణ, యాదిరెడ్డి, వై. వెంకటరత్నం, విజయ్ కుమార్, నాగేశ్వరరావు, రామకృష్ణరాజు, మధుసూదన్ రెడ్డి, చారి, నందయ్య, బాబురావు, బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**ఐడీఎల్ చెరువు (రంగధాముని చెరువు) వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్ పల్లి అక్టోబర్ 16 వెలుతురు:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాలతో జరుపుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బతుకమ్మ వేడుకలకు హాజరయ్యే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం ఐడీఎల్ చెరువు (రంగధాముని చెరువు) వద్ద బతుకమ్మ వేడుకల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. పండుగకు పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. వేడుకలకు వచ్చే ప్రజలకు తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలందరూ భక్తిశ్రద్ధలతో, సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ వేడుకలు విజయవంతంగా నిర్వహించుకోవాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, వెంకటేష్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆరుట్లలో ఎస్‌బిఐ వినియోగదారుల సేవా కేంద్రం ప్రారంభం






**మంచాల వెలుతురు అక్టోబర్ 16:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో స్వయం ఉపాధి వ్యాపారంలో భాగంగా నిర్వాహకుడు వెదిరె పురుషోత్తం రెడ్డి ఏర్పాటు చేసుకున్న ఎస్‌బిఐ వినియోగదారుల సేవా కేంద్రాన్నిప్రారం భించిన ఎస్ బిహెచ్ బ్యాంక్ మేనేజర్ అప్పల నాయుడు ప్రారంభోత్సవంలో పాల్గొన్న వెదిరె వెం కటర మణరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ అనంతరం సేవాకేంద్రం నిర్వాహకుడు వెదిరె పురుషోత్తం రెడ్డి బ్యాంక్ మేనేజర్ అప్పలనాయుడు వెదిరె వెంకటరమణ రెడ్డిని నూకం బాలరాజు ముదిరాజ్ వై యస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగాఎస్ బి ఐ బ్యాంక్ మేనేజర్ అప్పల నాయుడు మాట్లాడుతూ ఆరుట్ల ఎస్ బి ఐ బ్యాంక్ లో లావాదే వీలు జరుపుకునే ఖాతాదారులు అత్యవసర సమయంలో ఎస్ బిఐ వినియోగదారుల సేవా కేం ద్రాలలో లావాదేవీలు జరుపు కోవడానికి వీలుంటుంది అన్నారు ఏటీఎం సెంటర్ ఎలాగో ఎస్‌బిఐ సేవా కేంద్రాలు అలా ఖాతాదారులకు అత్యవసర సమయానికి అవసరం వస్తాయి అని అ న్నారు ఎస్‌బిఐ బ్యాంక్ ఖాతాదారులు సేవా కేంద్రాలను వినియోగించు కోవాలి అని అన్నారు ఈకార్యక్రమంలో ఎస్ బి ఐ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ యాదగిరి రెడ్డి బ్యాంక్ సిబ్బంది గ్రామ పెద్దలు పురుషోత్తం రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సాయి మేస్త్రి అసోసియేషన్ దుర్గామాత మడపంలో దుర్గామాతకు ప్రత్యేకపూజలు

**పాల్గొన్న గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకం రాజు ముదిరాజ్**





**మంచాల వెలుతురు అక్టోబర్ 16:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయి మేస్త్రి అ సోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత మడపంలో దుర్గామాతకు ప్రత్యేకపూజ లు చేసిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మాడుగుల బాలమణి కృష్ణగౌడ్ మొర్రిపద్మ ఐలయ్య అనంతరం కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామసర్పంచ్ వార్డు సభ్యులు కుంకుమార్చన కార్యక్ర మంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో సాయి మేస్త్రి అసోసియేషన్ దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామపెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పార్కులు, ప్రజా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**కూకట్‌పల్లిలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎంసీ కమిషనర్ జి. సృజన**



**కూకట్ పల్లి అక్టోబర్ 16 వెలుతురు:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి. సృజన ఐఏఎస్, కూకట్ పల్లి జోన్ జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ ఐఏఎస్ తో పాటు కూకట్‌పల్లి ప్రాంతంలో పలు పార్కులు, ప్రజా సౌకర్యాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పనుల పురోగతిని సమీక్షించి, పార్కుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**డ్రీమ్ వ్యూ కాలనీ పార్కుల పరిశీలన**

డ్రీమ్ వ్యూ కాలనీలో సుమారు రూ. 40 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కులను కమిషనర్ పరిశీలించారు. పార్కుల నిర్వహణకు సంబంధించిన తాత్కాలిక ఫ్లెక్సీ బ్యానర్ల స్థానంలో దీర్ఘకాలం మన్నికగా ఉండే శాశ్వత సమాచార, మార్గదర్శక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తద్వారా పార్కులకు వచ్చే ప్రజలకు అవసరమైన సమాచారం సులభంగా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

**విశ్వంభర పార్కుల్లో మెరుగైన వసతులు**

విశ్వంభర పార్క్--1ను సుమారు రూ. 10 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన నేపథ్యంలో అక్కడి సౌకర్యాలను కమిషనర్ పరిశీలించారు. వాచ్‌మన్ గదిని అనువైన ప్రదేశానికి మార్చడంతోపాటు, పార్కు ప్రవేశ ద్వారం వద్ద ఆకర్షణీయమైన బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం విశ్వంభర పార్క్--2ను సందర్శించి, ప్రజల వినియోగం కోసం ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను పరిశీలించారు. పార్కు ప్రవేశ ద్వారం వద్ద సరైన బోర్డును ఏర్పాటు చేయాలని, జిమ్ పరికరాలు సహా అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ మంచి స్థితిలో నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**వివేక్‌నగర్ శ్మశానవాటిక అభివృద్ధికి ప్రాధాన్యం**

వివేక్‌నగర్ శ్మశానవాటికలో సుమారు రూ. 40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన గ్రిల్స్, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శ్మశానవాటిక అభివృద్ధి, మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రత, భద్రత, అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్‌లో సెంట్రల్ మీడియన్ పనుల సమీక్ష**

కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్‌లో సుమారు రూ. 70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సెంట్రల్ మీడియన్ అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, అభివృద్ధి చేసిన మీడియన్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన నిర్వహణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. ఆంజనేయులు, ఏసీపీ వెంకటరమణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు డి. రమేష్, ఎస్. శ్రావంతి, ఎస్‌డబ్ల్యూఎం విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్ గణేష్, యూబీడీ మేనేజర్ శివజ్యోతి, ఏఈ ఎస్. శ్రీనివాస్‌తో పాటు సీఎంసీ అధికారులు పాల్గొన్నారు.



## చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన కార్యవర్గంకి ఎమ్మెల్యే అభినందనలు

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 16:**
చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన కార్యవర్గం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసింది. మున్సిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన మున్సిపాలిటీ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు మొగుదాల రమేష్ గౌడ్, జనరల్ సెక్రెటరీలు, ఇప్ప వెంకటేష్, ఎర్రగుని లింగస్వామి, ఉపాధ్యక్షులు అంతటి విజయలక్ష్మి బాలరాజు, బండమీది మల్లేష్, సయ్యద్ వాయుద్దీన్, వర్కాల వెంకట్ కుమార్, సెక్రెటరీలు గుండెబోయిన మనిత ఐలయ్య యాదవ్, ఓసు శ్రీజా రాజు, మమ్మద్ ఫిరోజ్, మట్టుపల్లి యాదగిరి, మాదాని గోపాల్, బత్తుల రాజు, జక్కర్తి సుధా, పేరుపల్లి సుమతి, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, చౌటుప్పల్ పట్టణ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం, మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 16:**
చౌటుప్పల్ లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో జ్ఞాన సరస్వతి అవతారంలో దుర్గాదేవి పూజలు అందుకున్నారు. భావన ఋషి కళానికేతన్ మరియు మాతృమండలి సభ్యులు సంయుక్తంగా శ్రీ లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం మరియు భజన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈరోజు దుర్గాదేవి పూజా కార్యక్రమం నిర్వహించిన భక్తులు శ్రీ చింతల తిరుమలరెడ్డి కరుణ దంపతులు ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, వర్కాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గుగులోతు అరుణ శంకర్ నాయక్, దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షులు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, మరియు భజన కార్యక్రమం నిర్వహించిన శ్రీ భావన ఋషి కళానికేతన్ భజన మండలి సభ్యులు బడుగు బాలరాజు, పోలోజు రాజు చారి, గోశిక బాలకృష్ణ, పోలోజు వెంకటాచారి, సీత తిరుమలేష్ బడుగు సావిత్రమ్మ, తడకసురేఖ, కోణం వినోద, సూరపల్లి లలిత, కొసనం రామిరెడ్డి అనురాధ దంపతులు, ఉప్పల దీపిక, నిమ్మల అండాలు, మామిడి వెంకటమ్మ, బొబ్బిళ్ళ సామ్రాట్, మార సంగమేశ్వర్, కందగట్ల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# కొరటికల్ కేవైసీఎస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**మునుగోడు, అక్టోబర్ 16 (వెలుతురు ):**
మునుగోడు మండలం కొరటికల్ గ్రామ కురుమ యువ చైతన్య సమితి (కేవైసీఎస్) నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేవైసీఎస్ జిల్లా అధ్యక్షుడు బండారు శంకర్ కురుమ, ఉపాధ్యక్షులు దెందె మల్లేష్ కురుమ, మందుల అంజయ్య కురుమ, మండల అధ్యక్షుడు బొడిష మల్లేష్ కురుమ, జిల్లా గౌరవ సలహాదారు మందుల పాండు కురుమ, ప్రధాన కార్యదర్శి అన్నం శ్రీకాంత్ కురుమ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు మహేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి బిజిని పరమేష్ కురుమ తదితరుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా పాలంచి సైదులు కురుమ, అధ్యక్షుడిగా మందుల శేఖర్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోడిష మహేందర్ కురుమ, ప్రధాన కార్యదర్శిగా మాలిగా శివకుమార్ కురుమ, ఉపాధ్యక్షులుగా మందుల



(సుక్క) మహేష్ కురుమ, మాలిగా నరసింహ కురుమ, కోశాధికారిగా అన్నం శ్రీశైల్ కురుమ, కార్యదర్శిగా బోడిష సాయి కురుమ, ప్రచార కార్యదర్శిగా బోడిష మధు కురుమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కురుమ యువతను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడంతోపాటు కుల బాంధవుల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. యువతలో ఐక్యత, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు, కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సమితి బలోపేతానికి అందరి సహకారంతో పనిచేస్తామని వెల్లడించారు. జిల్లా, మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కొరటికల్ గ్రామ నూతన కమిటీ కురుమ యువ చైతన్య సమితి అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కురుమ కులస్తుల ఐక్యతకు, యువత అభ్యున్నతికి కృషి చేస్తూ సమితికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

# గ్రామ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలి

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.**

**మునుగోడు, అక్టోబర్ 16 ( వెలుతురు):**
గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు పార్టీని చేరువ చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. పార్టీ కమిటీల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు సమన్వయంతో పనిచేస్తూ, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఆమోదంతో మునుగోడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులకు పార్టీ కమిటీల్లో బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు ఆధ్వర్యంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణతో కలిసి నూతన కమిటీ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామాల్లో పార్టీని



విస్తరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యకర్తల మధ్య ఐక్యత, సమన్వయం పెంపొందించుకుంటూ పార్టీ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు తాటికొండ సైదులు, మందుల బీరప్ప, కార్యదర్శులు సంకు శంకర్, పందుల సంపత్, జక్కల శీను, నన్నూరి శేఖర్‌రెడ్డి, ఆరెళ్ల సైదులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పంతంగి స్వామి, ఆనగంటి కృష్ణ, పాలకూరి మహేశ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**బీజేపీ లేబర్ సెల్ మండల కన్వీనర్ పోలే వెంకటేశ్వర్లు.**

**మునుగోడు,అక్టోబర్ 16 (వెలుతురు):**



కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని బీజేపీ లేబర్ సెల్ మునుగోడు మండల నూతన కన్వీనర్ పోలే వెంకటేశ్వర్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకుల సహకారంతో లేబర్ సెల్‌ను బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, లేబర్ సెల్ జిల్లా కన్వీనర్ ఐతరాజు సిద్ధు, జిల్లా కో-కన్వీనర్ మాదగోని నరేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

## పారిశుధ్య కార్మికుల భద్రతకు భరోసా..

**దుస్తులు,రక్షణ పరికరాల పంపిణీ**



**మునుగోడు, అక్టోబర్ 16 (వెలుతురు )**
:గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ మునుగోడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు,రక్షణ పరికరాలను పంపిణీ చేశారు. సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహగౌడ్, ఉపసర్పంచ్ ఉప్పునూతల సుగుణమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి,వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులకు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుధ్య నిర్వహణలో వారు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో కార్మికుల భద్రతకు రక్షణ పరికరాలు ఎంతో అవసరమని తెలిపారు. వారి సేవలను గుర్తించి, ప్రోత్సహించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు యాసరాని దినేష్, దొమ్మాటి రాజు, పందుల స్వామి, పందుల రంజిత్, పందుల గంగాధర్, ఎరసాని రాములు, పందుల ప్రియాంక లింగస్వామి, పందుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గౌడ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

గౌడ జాతి విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆకాంక్షించారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూనే, పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. శుక్రవారం నందిగామలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆయన గౌడ హాస్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ హాస్టళ్లు విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడంతోపాటు, ఉన్నత విద్యను అభ్యసించేందుకు దోహదపడతాయని అన్నారు. గౌడ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ హాస్టల్ నుంచి భవిష్యత్తులో సివిల్ సర్వెంట్లు తయారు కావాలని ఆకాంక్షించారు. గౌడ హాస్టల్ నిర్మాణానికి భూమిని దానం చేసిన దొంతి లక్ష్మీనారాయణ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం భూమిని దానం చేయడం గొప్ప విషయమని, ఆయన సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. గౌడ కులస్తుల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గౌడ సంఘాలను బలోపేతం చేస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలని సూచించారు. కోకాపేటలోని భూముల నిర్వహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, హాస్టల్ భవన నిర్మాణానికి తాను ముందుండి సహకరిస్తానని, అవసరమైన ప్రభుత్వ అనుమతుల కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గౌడ భవనాలు, హాస్టళ్ల నిర్మాణానికి గౌడ పెద్దలు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన మార్గంలో నడుస్తూ విద్య, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనివ్వాలని, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ ప్రజా ప్రతినిధులు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.

# గుండాలలో ఏడో రోజే సద్దుల బతుకమ్మ సంబరాలు!

- పురాతన ఆచారాన్ని కొనసాగిస్తూ పండుగ నిర్వహణ
- గ్రామ మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బీర్ల అనిత

**గుండాల, అక్టోబర్ 16 (వెలుతురు):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఇతర గ్రామాలతో పోలిస్తే గుండాల గ్రామంలో ప్రత్యేక ఆచారం ప్రకారం ఏడో రోజే సద్దుల బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం విశేషంగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని గ్రామ ప్రజలు నేటికీ కొనసాగిస్తున్నారు.

**అగ్ని ప్రమాదం నేపథ్యంలో ప్రత్యేక ఆచారం!**
గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పూర్వకాలంలో గుండాల గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పలు ఇళ్లు మంటలకు ఆహుతయ్యాయని, ఆ తర్వాత ఏర్పడిన ఆచారం ప్రకారం గ్రామంలో ఏడో రోజే బతుకమ్మ పండుగను నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఏడో రోజునే బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం గ్రామానికి ప్రత్యేక గుర్తింపుగా



మారింది. మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో బీర్ల అనిత తో పాటు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నీలం పద్మ పాల్గొన్నారు. గుండాల గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బీర్ల అనిత పాల్గొని గ్రామ మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాలను పంచుకున్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ



పండుగను గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందించాలనే సంకల్పంతో గ్రామస్థులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గుండాల గ్రామ సర్పంచ్ దేవరబోయిన ఐలయ్య, గంగాపురం సర్పంచ్ కాశీ మంజుల ఆంజనేయులు, జిల్లా నాయకులు పొడిచెట్టి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడపర్తి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిందం ప్రకాష్, మాజీ సర్పంచ్ దారా సైదులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేశారు

## నేడు టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష దీక్ష

**రంగారెడ్డి జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్**

**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్16:**



ఇబ్రహీంపట్నం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యారంగ విధానాలను వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణరాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్ అన్నారుఈ దీక్ష 2026 అక్టోబర్ 17వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించబడుతుందని అన్నారు ఉపాధ్యాయు ల స మస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈకార్యక్రమనికి ఉపాధ్యాయులు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు ఉపాధ్యాయుల ఐక్యతే సమస్యల ప రిష్కారానికి మార్గం అని ఆయన అన్నారు



## జూన్ వరకు పొదుపే మేలు!

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో వచ్చే జూన్ వరకు నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రజలకు సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. రైతులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించాలని రైతులకు సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం నగరం శివారులోని శ్రీ రామలింగేశ్వర ఫంక్షన్ హాల్లో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి, రాయపోల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన 2111 లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు, 179 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జిల్లా కలెక్టర్ హైమావతి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తో కలిసి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది అక్టోబరులో 15 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్తు వినియోగం ప్రస్తుతం 20 వేల మెగావాట్లకు చేరిందన్నారు. రాష్ట్రంలో 35 లక్షల బోరుబావుల వినియోగంతో విద్యుత్తు అవసరాలు పెరిగాయని తెలిపారు. రైతులకు రోజుకు 9 గంటల 30 నిమిషాల విద్యుత్తు సరఫరా చేస్తామన్న ప్రభుత్వ హామీని ప్రస్తావించారు.

# చిన్నారులకు అక్షరాభ్యాసం, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

- కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- అమ్మవారి కృపతో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును సాధించాలి
- ఉత్సవ నిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్



**చండూరు, వెలుతురు అక్టోబర్ 16:**
చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు జగజ్జనని అయిన చదువుల తల్లి సరస్వతి మాత అలంకారంలో అమ్మవారు భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. విద్యాదాయిని అయిన సరస్వతి దేవిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

**చిన్నారులకు అక్షరాభ్యాసం.. పుస్తకాల పంపిణీ**
ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని కనకదుర్గ యూత్ అసోసియేషన్ మరియు ఉత్సవ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు వేద పండితుల సమక్షంలో అక్షరాభ్యాస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. "ఆ చల్లని తల్లి సరస్వతి మాత కృప వల్ల విద్యార్థులందరూ చదువులో రాణించి మంచి భవిష్యత్తును సాధించాలి, ఉన్నత శిఖరాలను అధిరోహించి మంచి స్థానాల్లో నిలదొక్కుకోవాలని ఆ అమ్మవారి యొక్క ఆశీస్సులు ఎల్లప్పుడూ విద్యార్థులపై ఉంటాయని ఆకాంక్షించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం పూజానంతరం కుమార్చన కార్యక్రమం , సాయంత్రం 7గంటలకు అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు కనకదుర్గ యూత్ అసోసియేషన్ శరన్నవరాత్రి ఉత్సవ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో చండూర్ పరిసర ప్రాంతాల మహిళలు భక్తులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు..

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసిన ఆనగంటి కృష్ణ

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**



హైదరాబాద్‌లో మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని తన నివాసంలో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆనగంటి కృష్ణ నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

- కరెంట్ కోతలతో ఎండిపోతున్న పంటలు.. రైతులను ఆదుకోవాలి
- ఎమ్మెల్యే మాణిక్ రావు డిమాండ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:** వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జహీరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విద్యుత్ సరఫరా తీరుపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశారని మాణిక్ రావు పేర్కొన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు విద్యుత్ కోసం రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో నీరు అందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. గత కొన్ని రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో బోర్లు, బావుల కింద సాగు చేస్తున్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కలిపి ఆరు నుంచి ఏడు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని, దీనికితోడు అప్రకటిత విద్యుత్ కోతలు రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. లో-వోల్టేజీ సమస్యతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, రైతులకు అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు.

**సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రశ్నలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు జిల్లాలో ఒక్క ఎకరానికైనా కొత్తగా సాగునీరు అందించారా? ఒక్క చెక్‌డ్యామ్ నిర్మించారా? ఒక్క చెరువునైనా అభివృద్ధి చేశారా? అని ఎమ్మెల్యే మాణిక్ రావు ప్రశ్నించారు. నెట్టెంపాడు ప్రాజెక్టు మోటార్లను 24 గంటలు నడపాల్సి ఉండగా, కేవలం ఏడు నుంచి ఎనిమిది గంటలే నడుపుతున్నారని ఆరోపించారు. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు వలసబాట పట్టే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల మోటార్లను సైతం సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

**రైతులకు తక్షణ సహాయం అందించాలి**

విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్న రైతులకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని మాణిక్ రావు డిమాండ్ చేశారు. కాలిపోయిన వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు నిల్వలు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవడంతోనే సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వ స్థాయిలో జరిగిన ప్రణాళికా లోపాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని సూచించారు.

రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలుకు గడువు ప్రకటించాలని కోరారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ తరఫున రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ నాయకుల హాజరు**

ఈ మీడియా సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఝరాసంగం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల అధ్యక్షుడు నర్సింలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, కౌన్సిలర్లు దీపక్, జాకీర్, మహిపాల్ యాదవ్, విశ్వేశ్వర్‌తో పాటు నాయకులు చంద్రు, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు అండగా నిలిచాం.. పదవుల్లోనూ ప్రాధాన్యత కల్పించండి!

- వైస్ చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వాలి...
- కాంగ్రెస్ అధిష్ఠానానికి సీనియర్ నాయకుడు మహమ్మద్ అయూబ్ విజ్ఞప్తి...



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ముస్లిం మైనార్టీలకు, వైస్ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అయూబ్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. సామాజిక న్యాయం, సమాన రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యతనిస్తూ పదవుల కేటాయింపులో మైనార్టీలు, బీసీలకు తగిన అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్‌లో ముస్లిం జనాభా గణనీయంగా ఉన్న నేపథ్యంలో, పార్టీ కోసం అండగా నిలుస్తున్న మైనార్టీలకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించడం సముచితమని అయూబ్ అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు వివిధ వర్గాలకు ఈ పదవి దక్కిందని, ఈసారి ముస్లిం మైనార్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. జహీరాబాద్ నియోజకవర్గంలో మైనార్టీలు కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో మద్దతుగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైనప్పటికీ, పార్లమెంట్ ఎన్నికల్లో మైనార్టీలు పార్టీకి అండగా నిలిచి ఎంపీ అభ్యర్థి విజయానికి సహకరించారని గుర్తుచేశారు. పార్టీ విజయానికి సహకరిస్తున్న మైనార్టీలు, బీసీలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని అయూబ్ కోరారు. చైర్మన్ పదవిని ముస్లిం మైనార్టీలకు, వైస్ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించి సామాజిక న్యాయాన్ని చాటాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.

## దసరా సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

- దొంగతనాల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలి
- జహీరాబాద్ టౌన్ ఎస్ఐ ఎన్. లవ కుమార్ సూచనలు



జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 16: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు ఊళ్లకు వెళ్లేటప్పుడు ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్ టౌన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎన్. లవ కుమార్ సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో నిర్లక్ష్యం వహిస్తే దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన పోలీసు ప్రెస్‌నోట్‌లో ప్రజలకు పలు సూచనలు చేశారు. పండుగ సెలవుల్లో చాలామంది తమ ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు వెళుతుంటారని, ఇలాంటి సమయంలో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రయాణానికి ముందు ఇంటి తలుపులు, కిటికీలు సరిగ్గా మూసి ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు. నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా వీలైనంత వరకు బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు.

ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నవారు అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే పరిశీలించుకోవాలని, వీలైతే ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**పోలీసుల సూచనలు ఇవే..**

- ఇంటికి సెంట్రల్ లాకింగ్ వ్యవస్థతో కూడిన నాణ్యమైన తాళాలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను వదిలి వెళ్లకూడదు. వీలైతే బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.
- ఊరికి వెళ్లే విషయాన్ని నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి తెలియజేసి, ఇంటిని గమనిస్తూ ఉండాలని కోరాలి.
- అవసరమైతే ప్రయాణానికి ముందు జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారాలు, మోషన్ సెన్సార్లు ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాల డీవీఆర్‌ను ఇతరులకు సులభంగా కనిపించని సురక్షిత ప్రదేశంలో ఉంచాలి.
- ఇంటి ముందు వార్తాపత్రికలు, పాల ప్యాకెట్లు, చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలి. వీటిని గమనించి ఇల్లు ఖాళీగా ఉందని దొంగలు గుర్తించే అవకాశం ఉంటుంది.
- ఇంటి ముందు, లోపల అవసరమైన లైట్లు వెలిగేలా ఏర్పాట్లు చేసుకోవాలి. తలుపులకు వేసిన తాళాలు బయటివారికి స్పష్టంగా కనిపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ద్విచక్ర వాహనాలను ఇంటి ఆవరణలో పార్క్ చేసి తప్పనిసరిగా తాళాలు వేయాలి. వీలైతే చైన్ లాక్ కూడా ఉపయోగించాలి.
- నమ్మకమైన వాచ్‌మెన్ లేదా సెక్యూరిటీ సిబ్బందిని మాత్రమే నియమించుకోవాలి.
- అల్మారాలు, కప్‌బోర్డుల తాళాలను చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్లు, డ్రెస్సింగ్ టేబుల్ వంటి సాధారణ ప్రదేశాల్లో ఉంచకూడదు.
- బంగారు ఆభరణాలు ధరించి శుభకార్యాలకు, దేవాలయాలకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్తున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా షేర్ చేయకూడదు.

**పోలీసుల ప్రత్యేక నిఘా**

చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల చోరీలు, ఇళ్లలో చొరబడి దొంగతనాలకు పాల్పడే ప్రయత్నాలను అడ్డుకునేందుకు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని ఎస్ఐ తెలిపారు. రాత్రి వేళల్లో మొబైల్ పెట్రోలింగ్‌తో పాటు బీట్ పోలీసుల ద్వారా ప్రాంతాల వారీగా నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపించినా, కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించినా వెంటనే డయల్ 100 లేదా జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ వాట్సాప్ నంబర్ 8712656763కు సమాచారం అందించాలని ఎస్ఐ ఎన్. లవ కుమార్ కోరారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం..

తెలంగాణను మత్తు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బలగాలు 'ఈగల్ ఫోర్స్' మరోసారి పంజా విసిరింది. హైదరాబాద్ నగర శివార్లలో మత్తు పదార్థాల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించిన ఈగల్ ఫోర్స్ అధికారులు, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించి భారీగా డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసిన అధికారులు 6.2 గ్రాముల ఎండీఎంఏ 5.83 గ్రాముల ఎండు గంజాయి, 2 ఐఫోన్లు, డిజిటల్ వెయింగ్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఈ ఎండీఎంఏ మరియు గంజాయిని ఎక్కడి నుండి కొనుగోలు చేశారు? హైదరాబాద్‌లో వీరు ఎవరికి సరఫరా చేస్తున్నారు? విద్యార్థులు లేదా ఐటీ ఉద్యోగులు వీరి కస్టమర్లుగా ఉన్నారా? అనే కోణంలో అధికారులు ముమ్మర విచారణ చేశారు.

## మేడ్చల్ కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

**మేడ్చల్, వెలుతురు, అక్టోబర్ 16** బతుకమ్మ ప్రకృతిని ఆరాధించే పండుగ అని, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక అన్నారు. గునుగు, తంగేడు, రుద్రాక్ష, బంతి, చామంతి తదితర రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, అనంతరం ఆ పూలను నీటిలో నిమజ్జనం చేయడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. శుక్రవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా చీఫ్ ప్లానింగ్ కార్యాలయం, జిల్లా విద్యాశాఖ, జిల్లా సహకార శాఖ, ఐసీడీఎస్, డీఐఈఓ, ఆర్ అండ్ బీ, జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.



# యాదగిరి నరసన్న సేవలో.. తూళ్ల విజయేందర్ గౌడ్

- ప్రత్యేక విజన్‌తో ముందుకు దూసుకెళ్తున్న వైటిడి బోర్డు మెంబర్ విజయేందర్ గౌడ్
- యాదగిరిగుట్టకు మరింత వన్నె తెచ్చేలా తూళ్ళ కృషి
- స్పష్టమైన అవగాహన సాంకేతిక నైపుణ్యంతో యాదగిరిగుట్ట అభివృద్ధికి ప్రణాళికలు వేస్తున్న విజయేందర్ గౌడ్
- యాదగిరి నర్సన్న సేవలో తరిస్తున్న బోర్డు మెంబర్ తూళ్ల విజయేందర్
- యంగ్ డైనమిక్ లీడర్‌గా ఆధ్యాత్మిక , దైవభక్తి మార్గంలో తనదైన శైలిలో దూసుకెళ్తున్న తూళ్ల
- వ్యాపారవేత్తగా, విద్యావంతుడుగా, సామాజిక సేవకుడిగా, యాదగిరి నరసన్న భక్తుడిగా , యాదగిరిగుట్ట అభివృద్ధికి బహుముఖ ప్రజ్ఞతో ప్రణాళికలు రూపొందిస్తూ అందరి మన్ననలు పొందుతున్న వైటిడి బోర్డు మెంబర్ తూళ్ల విజయేందర్ గౌడ్

**యాదగిరిగుట్ట , అక్టోబర్ 16 వెలుతురు** స్వయం ప్రతిపత్తి కలిగిన యాదగిరిగుట్ట దేవస్థానం ( వై టి డి ) పాలకమండలి సభ్యులుగా తూళ్ల విజయేందర్ గౌడ్ తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. యాదగిరిగుట్ట నరసన్న సేవలో దేవస్థానం అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ తనదైన శైలిలో ముందుకు దూసుకెళ్తున్నారు. వ్యాపారవేత్తగా, విద్యావంతుడిగా సామాజికవేత్తగా, సమాజ సేవకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు ఉన్న తూళ్ల విజయేందర్ గౌడ్ ఇటు ఆధ్యాత్మిక దైవభక్తి మార్గంలో కూడా తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఉన్నత విద్యావంతుడుగా వ్యాపారవేత్తగా రాణిస్తూ ఆయా రంగాలలో తనదైన ప్రత్యేక ముద్రను వేసిన విజయేందర్ గౌడ్ కు యాదగిరిగుట్ట దేవస్థానం స్వయం ప్రతిపత్తి గల పాలక మండలి లో చోటు లభించింది. ఆయనలోని దీక్షా దక్షతలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానంగా, తెలంగాణ తిరుపతిగా దేశంలో ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన యాదగిరిగుట్ట పాలక మండలికి బోర్డు సభ్యుడుగా ఎంపిక చేసింది. ఇలాంటి దీక్షా దక్షత లు కార్యనిర్వహణ సామర్థ్యం గల ఆధ్యాత్మిక చింతన దైవభక్తి గల వారిని ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించి, అందుకు అనుగుణంగా తూళ్ల విజయేందర్ గౌడ్ ను వైటిడి బోర్డు మెంబర్గా ఎంపిక చేశారు. ఆయన స్వామివారి సేవలో తరించేందుకు తనకున్న శక్తి సామర్థ్యాలను వినియోగిస్తూ వై టి డి బోర్డు మెంబర్గా పదవీ బాధ్యతలను చేపట్టి , మూడు సార్లు పాలకమండలి సమావేశాలు నిర్వహించిన సమయంలోనే తూళ్ళ విజయేందర్ గౌడ్ తనదైన ప్రత్యేకతను నిరూపించుకుంటున్నారు.

**యాదగిరిగుట్టకు ప్రత్యేకతను తీసుకువచ్చేలా :**

యాదగిరిగుట్ట దేవస్థానం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి ఇటు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో ప్రపంచంలో ఒక ప్రత్యేకతను తీసుకువచ్చేందుకు వై.టి.డి బోర్డు మెంబర్ తూళ్ళ విజయేందర్ గౌడ్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. తాను వ్యాపారవేత్తగా ఉన్నత విద్యావంతుడిగా అనేక సేవా కార్యక్రమాలు వివిధ రంగాలలో నిర్వహించినటువంటి విశేషమైన ప్రత్యేక కార్యక్రమాల అనుభవంతో యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిని మరింత పెద్ద ఎత్తున పరుగులు పెట్టించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకోసం ఆయన తన అనుభవంతో తనకున్న ప్రత్యేక విజన్ తో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ప్రణాళికలను బోర్డు సమావేశంలో ప్రస్తావించి ఆలయ అభివృద్ధికి ఆలయానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చేలా ఏ విధంగా ముందుకు వెళ్తే బాగుంటుంది అనే అంశాలను బోర్డు సభ్యుల ముందు ఉంచి అందరిచే ప్రశంసలు అందుకుంటున్నారు.

**స్వామివారికి విస్తృత ప్రచారం లభించేలా ...**

యాదగిరిగుట్ట దేవస్థానం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి మరింత విస్తృత



ప్రచారం లభించేలా డిజిటల్ రంగంలో తనకున్న అనుభవంతో విజయేందర్ గౌడ్ కృషి చేస్తున్నారు . ప్రపంచమంతా డిజిటల్ మయం అయినటువంటి ప్రస్తుత తరుణంలో యాదగిరిగుట్ట దేవస్థానంలో కూడా డిజిటల్ సేవలను మరింత విస్తృతపరిచి ఇటు భక్తులకు యాత్రికులకు డిజిటల్ మార్గంలో సేవలు అందించడంతోపాటు యాదగిరిగుట్ట అభివృద్ధికి, దేవస్థానానికి విస్తృత ప్రచారాన్ని తీసుకువచ్చేలా ఆయన కృషి చేస్తున్నారు. ఇందుకోసం ఆయన ఎప్పటికప్పుడు ఇటు బోర్డు సభ్యులతో పాలక మండలి చైర్మన్ తో మాట్లాడుతూ అధికారులతో సమన్వయం చేస్తూ యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి , ఆలయానికి విశ్వఖ్యాతి లభించేలా కృషి చేస్తున్నారు.

**పాలకమండలిలో ఆయన ప్రత్యేకతే వేరు :**

తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదగిరిగుట్టకు స్వయం ప్రతిపత్తి గల పాలక మండలిని ప్రభుత్వం ఉన్నత స్థాయిలో నియమించింది. ఈ పాలకమండలిలో విద్యావేత్తగా వ్యాపారవేత్తగా సామాజిక సేవకుడిగా ప్రత్యేక గుర్తింపు ఉన్న విజయేందర్ గౌడ్ తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఆయన ఇప్పటివరకు జరిగిన మూడు పాలకమండలి సమావేశాలలో తనదైన శైలిలో తనకు ఉన్నటువంటి అనుభవంతో కార్యనిర్వహణ శక్తితో విలువైన సూచనలు సలహాలు అందిస్తున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి మరింత పేరు ప్రఖ్యాతులు లభించడంతోపాటు ఇక్కడికి వచ్చే భక్తులకు ఎటువంటి సౌకర్యాలు అందించాలనే విషయంలో ఆయన విజన్ చాలా చాలా ప్రత్యేకమైనది. ఆయన అందిస్తున్న సలహాలు సూచనలను బోర్డు సభ్యులు సైతం ప్రశంసించడం విశేషం.

**తూళ్ల దేవేందర్ గౌడ్ వారసుడిగా విజయపథంలో విజయేందర్ గౌడ్...**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోం మంత్రి సీనియర్ నేత తూళ్ల దేవేందర్ గౌడ్ వారసుడిగా విజయేందర్ గౌడ్ ఇటు వ్యాపార రంగంలో సామాజిక సేవలో వివిధ రంగాలలో తనదైన సత్తాను చాటుతూ ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనలోని దైవభక్తిని సేవా గుణాన్ని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి సభ్యుడుగా అవకాశం కల్పించింది . దీంతో ఆయన యాదగిరి నరసన్న సేవలో ఆలయ అభివృద్ధి కోసం భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు తన శక్తి యుక్తులను ప్రదర్శిస్తూ ముందుకు వెళ్తున్నారు యాదగిరి నరసన్నకు విశ్వఖ్యాతి లభించేలా కృషి చేస్తున్నారు.

**యాత్రికులు, భక్తులకు సౌకర్యాల కల్పనకై విజయేందర్ గౌడ్ కీలక సూచనలు**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి విచ్చేసే భక్తులు యాత్రికులకు కనీస సౌకర్యాలతో పాటు అన్ని రకాల వసతులు కల్పించేందుకు వై టి డి బోర్డు మెంబర్ విజయేందర్ గౌడ్ ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించారు . తూళ్ల విజయేందర్ గౌడ్ ఇక్కడికి వచ్చే భక్తులు యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వారికి ఎటువంటి సౌకర్యాలు కల్పించాలనే అంశంపై ఆయన ప్రత్యేక దృష్టిని సారించారు . ఇందుకోసం ఆయన తనకున్న అనుభవంతో తనకున్న పరిజ్ఞానంతో భక్తులకు ఎలాంటి సౌకర్యాలు అవసరం, గతంలో ఇక్కడ ఎటువంటి అవసరాలు ఉండేవి. ఇంకా ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది అనే అంశంపై ఒక ప్రత్యేక ప్రణాళికను రచించి బోర్డు ముందు ఉంచారు. ఆయన ఎప్పటికప్పుడు బోర్డు చైర్మన్ సభ్యులతో సమన్వయం చేస్తూ గుట్ట అభివృద్ధికి ముందుకు సాగుతున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి వచ్చే భక్తులకు యాత్రికులకు కనీస వసతులు సౌకర్యాలు కల్పించి వారిని పూర్తిస్థాయిలో సంతృప్తి పరచడమే తమ లక్ష్యం అని వై టి డి బోర్డు మెంబర్ తూళ్ళ విజయేందర్ గౌడ్ స్పష్టం చేస్తున్నారు.

**సమర్థవంతంగా చిన్న వయసులో పెద్ద బాధ్యత:**

వై టి డి బోర్డు మెంబర్ అనే పదవి విజయేందర్ గౌడ్ కు చిన్న వయసులో పెద్ద బాధ్యతగా చెప్పవచ్చు. ఇంత బరువైన , బాధ్యతాయుతమైన వైటిడి బోర్డు మెంబర్ పదవిని విజయేందర్ గౌడ్ పదవిలా కాకుండా ఒక బాధ్యతగా స్వామివారి సేవగా భావిస్తూ ఆయన తన బాధ్యతను నిర్వహిస్తున్నారు . యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు మెంబర్గా దేవస్థానం అభివృద్ధితోపాటు ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా యాదగిరిగుట్టను ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ఇందుకోసం ఆయన ఈ దేవస్థానానికి మరింత పేరు ప్రఖ్యాతులు వచ్చేలా కృషి చేయడంతో పాటు ఆలయానికి ఆదాయం సమకూరి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలనే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సాధించారు. వైటిడి బోర్డు మెంబర్ పదవిని ఒక పదవిలా కాకుండా గురుతరమైన బాధ్యతగా నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ముమ్మందు యాదగిరిగుట్ట అభివృద్ధికి తనకున్న అనుభవం పరిజ్ఞానంతో సరికొత్త ప్రణాళికలు రూపొందించి గుట్టను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఆయన కృషి చేస్తున్నారు.

**ప్రణాళిక, స్పష్టత , విజన్ ఆయన ప్రత్యేకత :**

వైటిడి బోర్డు మెంబర్ గా యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధికి ఏం చేస్తే బాగుంటుంది. ఇందుకోసం స్పష్టమైన ప్రణాళిక ఎలా చేయాలి ఏ విధంగా చేస్తే ఇటు దేవస్థానం అభివృద్ధి అటు భక్తులకు సౌకర్యాలు మెరుగుపడతాయి అనేటటువంటి స్పష్టమైన అవగాహన ముందుచూపు కలిగి ఉండటం వైటిడి బోర్డు మెంబర్ తూళ్ళ విజయేందర్ గౌడ్ ప్రత్యేకత అని చెప్పవచ్చు. ఆయన వైటిడి బోర్డు మెంబర్గా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుండే ఈ విషయాలు స్పష్టంగా అవగతం అవుతున్నాయి. ఆయన మొదటి సమావేశంలోనే తన అంతరంగాన్ని ఆవిష్కరించి యాదగిరిగుట్ట అభివృద్ధికి ఏ విధంగా ముందుకు వెళ్తే బాగుంటుంది అని విషయంలో బోర్డు కు చాలా విలువైన సూచనలు అందించారు. ఇప్పటివరకు జరిగిన మూడు బోర్డు సమావేశాలలో ఆయన అందించిన సలహాలు సూచనలు ఎంతో విలువైనవి అని చెప్పవచ్చు.

**యాదగిరి నర్సన్న సేవలో. తూళ్ల కుటుంబం :**

ఆంధ్రప్రదేశ్ మాజీ హోం మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ కుటుంబం మొదటి నుండి యాదగిరిగుట్ట నరసింహస్వామి వారి సేవలో తరిస్తూ వస్తున్నారు. తూళ్ల దేవేందర్ గౌడ్ కుటుంబం మొదటి నుండి ఇక్కడికి అనేక సందర్భాలలో వచ్చి స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇదే క్రమంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం యాదగిరిగుట్ట దేవస్థానం కు స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రత్యేక పాలక మండలి ఏర్పాటు చేయాలనే ఆలోచన చేసింది. ఈ క్రమంలో యువకుడు విద్యావంతుడు సమర్థుడు ఆధ్యాత్మిక దైవభక్తి భావాలు కలిగిన సభ్యుడు కోసం ప్రభుత్వం అన్వేషించిన సమయంలో తూళ్ల దేవేందర్ గౌడ్ కుటుంబం నుండి తూళ్ళ విజయేందర్ గౌడ్ ను ఎంపిక చేయాలని నిర్ణయించారు. విద్యావంతుడిగా వ్యాపారవేత్తగా రాణిస్తూ సౌమ్యుడిగా , వివాద రహితుడిగా , అందరివాడుగా ప్రతి ఒక్కరి ప్రశంసలు అందుకుంటున్న తూళ్ల విజయేందర్ గౌడ్ వైటిడి బోర్డు మెంబర్ పదవికి అన్ని విధాలుగా అర్హులని భావించి ప్రభుత్వం ఆయనను బోర్డు మెంబర్గా ఎంపిక చేసింది. యువకుడు విద్యావంతుడు వ్యాపారవేత్తగా రాణిస్తున్న ఆయనలోని ఆధ్యాత్మిక దైవభక్తి కోణం కూడా ప్రభుత్వాన్ని ఆకర్షించింది. దీంతో ఆయనకు వైటిడి బోర్డు మెంబర్గా అవకాశం కల్పించడంతో ఆయన తూళ్ళ దేవేందర్ గౌడ్ కుటుంబం నుండి యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు మెంబర్గా విశేషమైన సేవలు అందిస్తున్నారు.

**యాదగిరిగుట్ట దేవస్థానం సమగ్ర అభివృద్దే ధ్యేయం : తూళ్ల విజయేందర్ గౌడ్**

యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తానని దేవస్థానం అభివృద్ధితో పాటు ఇక్కడికి వచ్చే భక్తులు యాత్రికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే తన లక్ష్యమని వైటిడి బోర్డు మెంబర్ తూళ్ళ విజయేందర్ గౌడ్ స్పష్టం చేశారు. ఇక్కడికి ప్రతినిత్యం వచ్చే సామాన్య భక్తుల నుండి ఉన్నత వర్గాలకు చెందిన భక్తులకు , అన్ని వర్గాల భక్తులకు సంతృప్తి కలిగించేలా వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యం అని అన్నారు. తనకున్న అనుభవం పరిజ్ఞానంతో ఇటు డిజిటల్ మార్గంలో యాదగిరిగుట్ట దేవస్థానానికి వచ్చే భక్తులకు విశేషమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఇందుకోసం పకడ్బందీ ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. దేవస్థానాన్ని మరింత పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడంతో పాటు కొండపైన కొండ కింద అన్ని రకాల వసతి సౌకర్యాలను కల్పించడమే తమ లక్ష్యం అని చెప్పారు. ఇందుకోసం వివిధ రకాల ప్రణాళికలు రూపొందిస్తున్నామని మరికొన్ని రోజుల్లో యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి పనులను మరింత వేగంగా పరుగులు పెట్టిస్తామని చెప్పారు. దీంతోపాటుగా యాదగిరిగుట్ట దేవస్థానానికి విశ్వవ్యాప్తంగా ప్రచారం లభించేలా స్వామివారి వైభవం విశ్వవ్యాప్తం చేయడమే తమ ధ్యేయమని వైటిడి బోర్డు మెంబర్ తూళ్ళ విజయేందర్ గౌడ్ స్పష్టం చేశారు.



పుట్ట హనుమంత్
( సీనియర్ జర్నలిస్ట్ )

# ఆల్టిమెట్రిక్ 'హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభం

**వారం రోజుల్లోనే ఏఐ వర్క్‌ఫ్లో అందించే**

**'ఫార్మాఓఎస్' ఆవిష్కరణ**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16**
ప్రముఖ కృత్రిమ మేధ (ఏఐ) ఇంజనీరింగ్ సంస్థ ఆల్టిమెట్రిక్ హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఏఐ ఆధారిత ఆవిష్కరణలు వేగవంతం చేసేందుకు గచ్చిబౌలిలోని తన ప్రాంగణంలో 'హెల్త్‌కేర్ ఽ లైఫ్ సైన్సెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభించింది. ఈ కేంద్రం ద్వారా తన మొట్టమొదటి 'ఫార్మాఓఎస్' అనే ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను విడుదల చేసింది. ఆల్టిమెట్రిక్ ఏఎల్టీఐ ఏఐఓఎస్ ఫ్రేమ్‌వర్క్‌పై రూపొందించిన ఈ 'ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్'తో పాటు పరిశ్రమలోని క్లయింట్‌లతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను అభివృద్ధి చేయనుంది. ఫార్మాఓఎస్ సహాయంతో క్లయింట్‌లు ఒక నిర్దిష్ట ఆలోచన నుంచి ధ్రువీకరించబడిన, నియంత్రిత ఏఐ ఏజెంటిక్ వర్క్‌ఫ్లో స్థాయికి కేవలం ఒకే వారంలో చేరుకోవచ్చని, తద్వారా సంస్థలు ప్రాథమిక ఆలోచనను వేగంగా ఉపయోగపడే విధంగా మార్చుకోవచ్చని కేంద్రం తెలిపింది. రెగ్యులేటరీ నిబంధనలకు అనుగుణంగా ఉంటూ ప్రతి ఫలితాన్ని నమ్మకమైన మూలాలతో సరి చూస్తూ, తీసుకునే నిర్ణయాలకు మానవ జవాబుదారీతనాన్ని నిర్ధారించే విధంగా కృత్రిమ మేధ ఏజెంట్లను రూపొందించేందుకు ఏఐ ఇంజనీర్లు, లైఫ్ సైన్సెస్ నిపుణులను ఇది ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. హైటెక్ సిటీ సమీపంలోని గచ్చిబౌలి, ఫీనిక్స్ ఈక్వినాక్స్‌లో 300 మందికి పైగా ఉద్యోగులతో ఉన్న ఆల్టిమెట్రిక్ 22,000 చదరపు అడుగుల కార్యాలయంలో ఈ కేంద్రం ఏర్పాటైంది. ఔషధాల ఆవిష్కరణ, క్లినికల్ డెవలప్‌మెంట్, వాణిజ్య కార్యకలాపాలు, తయారీ రంగం, రోగుల అనుసంధానం, ఆరోగ్య సంరక్షణ విభాగాలలో ఈ కేంద్రం సేవలు అందించనుంది.
ఈ సందర్భంగా ఆల్టిమెట్రిక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజ్ సుందరేశన్ మాట్లాడుతూ సంస్థలు అర్థవంతమైన ఫలితాలను అందించే కృత్రిమ మేధను కోరుకుంటున్నాయన్నారు. హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలలో పరిశ్రమల నేపథ్యం, రెగ్యులేటరీ నిబంధనలు, విశ్వసనీయ డేటా ఆధారంగా పరిష్కారాలు రూపొందించడమేనన్నారు. మా హెల్త్‌కేర్ ఽ లైఫ్ సైన్సెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి వస్తున్న మొట్టమొదటి ఉత్పత్తి 'ఫార్మాఓఎస్' అన్నారు. కీలకమైన పని విధానాలలో నియంత్రిత ఏఐ ఏజెంట్లను నిర్మించడానికి, విస్తరించడానికి గ్లోబల్ కస్టమర్లకు సహాయపడేలా దీనిని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌లోని అపారమైన ఫార్మా నైపుణ్యం, సాంకేతిక ప్రతిభ ఈ కేంద్రానికి సరైన వేదికగా నిలవనుందన్నారు. ఆచరణాత్మక, పరిశ్రమ నిర్దిష్ట ఆవిష్కరణలను అందించడానికి అవసరమైన సామర్థ్యాలను ఇది ఏకతాటిపైకి తెస్తుందన్నారు.
లైఫ్ సైన్సెస్ వర్క్‌ఫ్లోలను ఏఐ ఏజెంట్లతో అనుసంధానించే ఫార్మాఓఎస్ ఆల్టిమెట్రిక్ ఏఎల్టీఐ ఏఐఓఎస్ ఫ్రేమ్‌వర్క్‌పై నిర్మితమైన ఫార్మాఓఎస్, వాణిజ్య కార్యకలాపాలు, క్లినికల్, రెగ్యులేటరీ ఆధారాల సమీక్ష, తయారీ, నాణ్యత, బాధ్యతాయుతమైన ఏఐ, డేటా ఆధునికీకరణ వంటి విభాగాలలో ప్రత్యేకంగా రూపొందించిన 35కు పైగా ఏజెంట్లు, యాక్సిలరేటర్లను ఒకచోట చేరుస్తుందన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ వాటిని సంస్థాగత ప్రక్రియలతో పాటు విశ్వసనీయ డేటాతో అనుసంధానిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఫలితాన్ని మూల ఆధారాలతో సరిచూస్తూ నిర్ణయాలకు మానవ జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తుందన్నారు.
ఈ విధానం ద్వారా సంస్థలు క్లినికల్ అధ్యయన నివేదికల సమీక్ష, +ఇగా నిబంధనల తనిఖీలు, బ్యాచ్ విడుదల సంసిద్ధత వంటి పనులకు ఏఐని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చన్నారు. అదే సమయంలో వివిధ బృందాలు, విభాగాలలో పునర్వినియోగించగల నియంత్రిత సామర్థ్యాలను కూడా పెంపొందించుకోవచ్చని తెలిపారు.
గూగుల్, ఆంత్రోపిక్, ఓపెన్‌ఏఐ వంటి ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ ఏఐ వ్యవస్థలతో కలిసి పని చేసేలా ఫార్మాఓఎస్ రూపొందించబడిందన్నారు. దీనికి సంబంధించిన అంతర్లీన ఆర్కిటెక్చర్ అవసరమైన మోడల్ సౌలభ్యాన్ని అందిస్తుందన్నారు. కాన్సెప్ట్ నుంచి ప్రొడక్షన్ గ్రేడ్ అమలు వరకు వారం రోజుల ప్రయాణం ఫార్మాఓఎస్ తో పాటు ఒక ఏఐ వినియోగ సందర్భాన్ని గుర్తించడం, దాని అమలు సామర్థ్యాన్ని అంచనా వేయడం మధ్య సమయాన్ని తగ్గించడానికి ఆల్టిమెట్రిక్ వారం రోజుల డెలివరీ విధానాన్ని పరిచయం చేస్తోందన్నారు. నిర్దిష్ట వ్యాపార సవాలు, అంగీకరించిన డేటా యాక్సెస్, పరిమిత పని విధానం ఆధారంగా లైఫ్ సైన్సెస్ నిపుణులు, ఏఐ ఇంజనీర్లు పునర్వినియోగించగల ఏజెంట్లు, పరిశ్రమ నిర్దిష్ట యాక్సిలరేటర్లను ఉపయోగించి వారం రోజుల్లోనే అమలు చేయగల వర్క్‌ఫ్లోను సిద్ధం చేస్తారన్నారు. ఈ భాగస్వామ్యం ప్రారంభం నుంచే భద్రత, పరిశీలనా సామర్థ్యం, మూల ఆధారాల ట్రాకింగ్, నాణ్యతా తనిఖీలు, మానవ నిర్ణయాధికారాలు, కొలవదగిన వ్యాపార కేపీఐలను కలిగి ఉంటుందన్నారు. తద్వారా క్లయింట్‌లు తమ సంస్థాగత నేపథ్యంలోనే ఏజెంటిక్ వర్క్‌ఫ్లోను అంచనా వేయగలరన్నారు. తదుపరి పెట్టుబడిపై స్పష్టమైన, సరైన నిర్ణయం తీసుకోగలరని తెలిపారు.

# జూనియర్ సివిల్ జడ్జిగా గంట మనీష్

**హర్షం వ్యక్తంచేసిన సబ్జీమండి**

**గంగపుత్ర సంఘం నాయకులు**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16**
సబ్జీమండి గంగపుత్ర సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, కీర్తిశేషులు గంట నరేష్ -- రుక్మిణి దంపతుల రెండో కుమారుడు గంట మనీష్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులు కావడం పట్ల సబ్జీమండి గంగపుత్ర సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టుదల, కృషి, తండ్రి ఆశయాల సాధనకు అంకితభావంతో ముందుకు సాగిన మనీష్ న్యాయమూర్తిగా ఎంపిక కావడం గంగపుత్ర సమాజానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. సామాజికంగా, విద్యాపరంగా ఉన్నత స్థానాలను అధిరోహించాలనే యువతకు గంట మనీష్ విజయం స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు. ఆయన సాధించిన ఈ ఘనత తమ సంఘానికి ఎంతో ఆనందాన్ని, గర్వాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా మనీష్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో న్యాయరంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు న్యాయసేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు హర్షం వ్యక్తం చేసిన వారిలో సబ్జీమండి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దోర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనందేసి వేణుబాబు, ఉపాధ్యక్షులు నాస నర్సింగ్ రావు, గుడిమణి కేశవులు, ఆర్.కె. భగవాన్, ఆర్.కె. మైసయ్య, కె. అంజయ్య, జి. హరిచరణ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా నవదుర్గ అమ్మవారి పూజ, ఆయుధ పూజ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16:**
నవరాత్రుల సందర్భంగా మల్లేపల్లిలోని గవర్నమెంట్ ఐటిఐ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ –ాుజ) ప్రాంగణంలో నవదుర్గ అమ్మవారి పూజ ఆయుధ పూజను అధికారులు, ఉద్యోగులు విద్యార్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో, బ్రహ్మాండంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో అందరూ కలిసి భక్తిభావంతో అమ్మవారిని పూజించారు. ఈ వేడుకకు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రిన్సిపాల్ రాధాకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ మరియు టీజీవో (౧+ూ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మన్యబోయిన కృష్ణ యాదవ్, ఆర్.డి.డి.ఏ.ఓ. గోవర్ధన్ రెడ్డి, ఆర్.డి.డి. ట్రైనింగ్ ఆఫీసర్ సాయిబాబా తదితరులు ప్రత్యేక అతిథులుగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ ప్రోగ్రాం లో, ట్రైనింగ్ ఆఫీసర్లు బి. శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, జె. సుధాకర్, లక్ష్మీనారాయణ, అసిజుల, రాజశేఖర్ రెడ్డి, బలమని, శివ నాయక్, సందీప్ కుమార్, శ్రీరామ్ రెడ్డి తదితర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేశారు.




# కనీస వేతనాలు రూ.42 వేలకు పెంచాలి

- **లేబర్ కోడ్స్ రద్దు చేయాలి**
  **కార్మికుల శ్రమదోపిడీని అరికట్టాలి**
- **సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ డిమాండ్**

**జహీరాబాద్ వెలుతురు, అక్టోబర్ 16:**
పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారిశ్రామిక కార్మికుల కనీస వేతనాలను నెలకు రూ. 42 వేలకు పెంచాలని సీఐటీయూ జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్. మహిపాల్ డిమాండ్ చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరారు. శుక్రవారం బూచినెల్లి పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 6 ద్వారా ప్రకటించిన కనీస వేతనాలను 2026 జూన్ 1 నుంచి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, పలు పరిశ్రమల్లో అమలు చేయడం లేదని మహిపాల్ ఆరోపించారు. దీంతో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల అమలును పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస వేతనాల నిర్ణయంలో కుటుంబ అవసరాలు, జీవన వ్యయం, వినియోగదారుల ధరల సూచీని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అర్హులైన కార్మికులకు బోనస్ చెల్లించడంతోపాటు నిబంధనల ప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్, ఓవర్‌టైమ్‌కు రెట్టింపు వేతనం, వారాంతపు సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమంలో పారిశ్రామిక కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న ఆక్యుపై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సందీప్ రెడ్డి, నరేష్, మధుకర్, శ్రీకాంత్, సాయి గౌడ్, ఎం. మహేష్, రామ్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి నగరంలో ఆపరేషన్ కవచ్..

ఇయర్ ఫోన్ లను పెట్టుకుని వాహనాలను నడిపించొద్దని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. మోటర్ వెహికిల్ యాక్ట్ ప్రకారం ఇది ఉల్లంఘన కిందికి వస్తుందన్నారు. అదే విధంగా వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట పెట్టుకోవాలని కోరారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట దాటిన తర్వాత హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో దాదాపు 3 వేల మంది పోలీసులు ఆపరేషన్ కవచ్ లో భాగంగా నాకాబందీని నిర్వహించారు. ముఖ్యంగా కొంత మంది పోలీసుల నుంచి తప్పించుకునేందుకు వాహనాల నెంబర్ ప్లేట్లను దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇలా చేయడం తీవ్రమైన నేరమన్నారు. నగరంలో శాంతి భద్రతలను పటిష్ఠంగా నిర్వహించే క్రమంలో పోలీసుల తనిఖీలు ఉంటాయన్నారు. ప్రజలు పోలీసుల తనిఖీలకు సహకరించాలన్నారు. ఈ ఆపరేషన్ కవచ్ లో దాదాపు 725 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సజ్జనార్ తెలిపారు. 48 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. అనుమానితుల్లో కొంత మంది దగ్గర మారణాయుధాలు, గంజాయి, డ్రంకన్ డ్రైవింగ్ చేసిన ఆధారాలు దొరికాయన్నారు. చంద్రాయణ గుట్ట, రాజేంద్రనగర్, ఆరాంఘర్, శంషాబాద్ శాతంరాయ్ ప్రాంతాల్లో సీపీ స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. డ్రోన్ ల ద్వారా కూడా ఈ ఆపరేషన్ కవచ్ ను పర్యవేక్షించారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనపడినప్పుడు వెంటనే డయల్ 112 కు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో అదనపు సీపీలు, డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్ పెక్టర్ లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ఆత్మహత్య

పాతబస్తీలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నగరంలోని హుస్సేనీ ఆలం పోలీసు స్టేషన్ పరిధిలో ఓ రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ బలవన్మరణానికి పాల్పడ్డారు. అలీముద్దీన్ అనే రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ వ్యక్తిగత కారణాల వల్ల తన వద్ద ఉన్న గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తుపాకీ పేలుడు శబ్దం గమనించిన చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే హుస్సేనీ ఆలం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన అలీముద్దీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రంగంలోకి హైడ్రా పోలీస్ స్టేషన్!

- **కబ్జాదారుల గుండెల్లో గుబులు..**
  **అక్రమార్కులపై క్రిమినల్ కొరడా?**
- **కూల్చివేతలతోనే సరి కాదు..**
  **నేరాల మూలాలపై దర్యాప్తు ఎప్పటి నుంచి?**
- **అధికారాలు, చట్టబద్ధత,**
  **పాత కేసుల బదిలీపై వీడని సందిగ్ధత**

**వెలుతురు హైదరాబాద్, అక్టోబర్ 16 (సిటీ బ్యూరో):**
చెరువును మింగినా.. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినా.. నాలాను పూడ్చి నిర్మాణాలు చేపట్టినా ఇప్పటివరకు కూల్చివేతలే ప్రధాన చర్యగా కనిపించాయి. కానీ ఆక్రమణలకు పాల్పడిన అసలు వ్యక్తులెవరు? అక్రమ నిర్మాణాలకు తెరవెనుక సహకరించిన వారెవరు? నకిలీ పత్రాలతో ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నించిన వారి సంగతేంటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు రాబట్టే దిశగా హైడ్రా పోలీస్ స్టేషన్ కీలకంగా మారుతుందన్న చర్చ నగరంలో సాగుతోంది. అయితే స్టేషన్ ప్రారంభం, పూర్తిస్థాయి కార్యకలాపాలు, కేసుల నమోదు, దర్యాప్తు అధికారాలపై స్పష్టత రావాల్సి ఉండటంతో అసలు కార్యాచరణపై ఉత్కంఠ నెలకొంది.
హైదరాబాద్ నగర విస్తరణతోపాటు ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, పార్కులు, నాలాలపై ఆక్రమణల సమస్య కూడా తీవ్రమవుతోంది. విలువైన భూములను కబ్జా చేయడం, జలవనరుల పరిధిని కుదించడం, వరద నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకోవడం వంటి పరిణామాలు నగర భవిష్యత్తుకు ముప్పుగా మారుతున్నాయి. కొన్నిచోట్ల అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఎలా వచ్చాయి? భూముల స్వరూపం ఎలా మారింది? సంబంధిత శాఖల రికార్డుల్లో ఏం నమోదైంది? అన్న అంశాలు సైతం పరిశీలనకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా చర్యలు కేవలం ఆక్రమణల తొలగింపునకే పరిమితం కాకుండా, చట్ట ఉల్లంఘనలకు బాధ్యులైన వారిపై ఆధారాలతో చర్యలు తీసుకునే స్థాయికి చేరాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కూల్చివేత ఒక ఎత్తు.. నేర నిర్ధారణ మరో ఎత్తు!

ఆక్రమణను గుర్తించి తొలగించడం ఒక ప్రక్రియ అయితే, దాని వెనుక జరిగిన నేరాన్ని నిర్ధారించి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం మరో ప్రక్రియ. ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారా? నకిలీ పత్రాలు సృష్టించారా? ప్రజా ఆస్తులకు ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించారా? అధికారిక రికార్డుల్లో అక్రమ మార్పులు జరిగాయా? వంటి అంశాలను ఆధారాలతో నిరూపించాల్సి ఉంటుంది.
ప్రత్యేక పోలీస్ స్టేషన్ సమర్థంగా పనిచేస్తే ఫిర్యాదుల పరిశీలన, నేరాలకు సంబంధించిన ఆధారాల సేకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది. అయితే హైడ్రా గుర్తించిన ప్రతి




ఆక్రమణపైనా తప్పనిసరిగా క్రిమినల్ కేసు నమోదు చేయాలనే నిబంధన ఉన్నట్లు భావించరాదు. నేర స్వభావం, సంబంధిత చట్టాలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగానే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

## చట్టబద్ధ అధికారాలే అసలు కీలకం!

హైడ్రా పోలీస్ స్టేషన్ పరిధి ఎంత? ఏ రకమైన ఫిర్యాదులను స్వీకరిస్తుంది? కేసులు నమోదు చేసే అధికారం ఎవరికి ఉంటుంది? దర్యాప్తు బాధ్యతలు ఏ అధికారుల పరిధిలో ఉంటాయి? ఇతర పోలీసు విభాగాలతో సమన్వయం ఎలా సాగుతుంది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం.
కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో అమలయ్యే చట్టాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, హైడ్రాకు కల్పించిన అధికారాల ఆధారంగానే ఈ అంశాలు నిర్ణయించాల్సి ఉంటుంది. భారతీయ న్యాయ సంహితతోపాటు వర్తించే ఇతర చట్టాల కింద చర్యలు తీసుకునే సందర్భంలోనూ ప్రతి కేసు వాస్తవాలను విడివిడిగా పరిశీలించాలి. అధికారిక మార్గదర్శకాలు స్పష్టంగా ఉంటేనే వివిధ శాఖల మధ్య సమన్వయం, దర్యాప్తు ప్రక్రియలు సమర్థంగా సాగేందుకు అవకాశం ఉంటుంది.

## పాత కేసులపై కొత్త దర్యాప్తు ఉంటుందా?

ప్రభుత్వ భూముల ఆక్రమణలు, చెరువుల కబ్జాలు, నకిలీ పత్రాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉంటే వాటి పరిస్థితి ఏమిటన్నది మరో కీలక ప్రశ్న. సంబంధిత కేసులను హైడ్రా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తారా? ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్న విభాగాలే విచారణ కొనసాగిస్తాయా? కొత్తగా వెలుగులోకి వచ్చే ఆధారాలపై తదుపరి చర్యలు ఎలా ఉంటాయి? అనే అంశాలపై అధికారిక స్పష్టత అవసరం.

భూముల హక్కుల పత్రాలు, రెవెన్యూ రికార్డులు, సర్వే పటాలు, నిర్మాణ అనుమతులు, రిజిస్ట్రేషన్ వివరాలు, క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలు దర్యాప్తులో కీలకం కానున్నాయి. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులతోపాటు, వారికి సహకరించినట్లు ఆరోపణలు ఉన్న అధికారుల పాత్రను కూడా ఆధారాల మేరకు పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్నంత మాత్రాన ఎవరినీ దోషిగా పరిగణించలేరు. చట్టబద్ధ విచారణ ద్వారానే బాధ్యతను నిర్ధారించాలి.

## రంగనాథ్ నేతృత్వంలో పరీక్ష!

హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ నేతృత్వంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల గుర్తింపు, చెరువులు, నాలాల పునరుద్ధరణ వంటి అంశాలపై సంస్థ పనిచేస్తోంది. ఈ క్రమంలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ సమర్థంగా పనిచేయడం సంస్థకు కీలక పరీక్షగా మారనుంది. క్షేత్రస్థాయిలో గుర్తించిన అక్రమాలను చట్టపరమైన చర్యలతో అనుసంధానించడం, వివిధ శాఖల నుంచి ఆధారాలు సేకరించడం, కేసుల పురోగతిని పర్యవేక్షించడం వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.
ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ పేరుతో చర్యలు తీసుకునే క్రమంలో పారదర్శకత, నిష్పాక్షికత, చట్టబద్ధ ప్రక్రియలకు పెద్దపీట వేయాలి. నిజమైన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంతోపాటు, తప్పుగా గుర్తించిన ఆస్తుల విషయంలో బాధితులకు తమ వాదన వినిపించే అవకాశం కల్పించడం కూడా అవసరం. అప్పుడే హైడ్రా చర్యలకు చట్టపరమైన బలం, ప్రజల నుంచి విశ్వసనీయత లభిస్తాయి.

## ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుందా?

చెరువుల ఆక్రమణలు, నాలాల పూడ్చివేతలు, పార్కుల స్థలాల కబ్జాలు, ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలకు సంబంధించి ప్రజలు వివిధ వేదికల ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదులను ఎలా స్వీకరిస్తారు? ఫిర్యాదుదారులకు రసీదు ఇస్తారా? విచారణ పురోగతిని తెలుసుకునే అవకాశం ఉంటుందా? అత్యవసర ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్న అంశాలు స్పష్టమైతే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది.
అదే సమయంలో వ్యక్తిగత భూవివాదాలను ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలుగా చిత్రీకరించడం, కక్షసాధింపుతో తప్పుడు ఫిర్యాదులు చేయడం వంటి అవకాశాలనూ నిరోధించాలి. రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి తనిఖీలు, సంబంధిత శాఖల నివేదికల ఆధారంగా ఫిర్యాదులను వర్గీకరించి చర్యలు తీసుకోవడం అవసరం.

## ప్రారంభోత్సవం నుంచి కార్యాచరణ వరకు!

హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభమైనట్లు పేర్కొంటున్నప్పటికీ, ప్రారంభోత్సవం జరగడం, పూర్తిస్థాయి పోలీసు కార్యకలాపాలు నిర్వహించడం రెండూ వేర్వేరు అంశాలు. స్టేషన్ నిర్వహణకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు, సిబ్బంది నియామకాలు, కేసుల నమోదు విధానం, దర్యాప్తు అధికారాలు, ఇతర పోలీసు విభాగాలతో సమన్వయంపై తాజా సమాచారం ఆధారంగానే ప్రస్తుత స్థితిని నిర్ధారించాల్సి ఉంటుంది.
ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో హైడ్రా పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ పనితీరుపై నగరవాసులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆక్రమణలను తొలగించడం మాత్రమే కాకుండా, అక్రమాలకు కారణమైన వ్యవస్థను ఆధారాలతో వెలికితీసి చట్టప్రకారం చర్యలు తీసుకునే విధానం అమల్లోకి వస్తే ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు మరింత బలం చేకూరుతుంది. అయితే చట్టబద్ధ అధికారాలపై స్పష్టత, నిష్పాక్షిక దర్యాప్తు, పారదర్శకమైన కార్యాచరణే ఈ వ్యవస్థ విజయానికి కీలకం కానున్నాయి. ఇప్పుడు అందరి చూపు ఒక్కటే.. హైడ్రా పోలీస్ స్టేషన్ పూర్తిస్థాయిలో ఎప్పుడు పనిచేస్తుంది? ఆక్రమణల వెనుక ఉన్న అసలు బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఏ విధంగా ముందుకు సాగుతాయి? ఈ ప్రశ్నలకు అధికారిక మార్గదర్శకాలు, తాజా ఉత్తర్వులు వెలువడినప్పుడే స్పష్టమైన సమాధానం లభించనుంది.

# 2బి బార్ల కేటాయింపు లాటరీలో ఐదుగురు అభ్యర్థుల ఎంపిక




**మేడ్చల్, వెలుతురు అక్టోబర్ 16:**
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ యూనిట్‌కు సంబంధించి, అలియాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో 2దీ బార్ల కేటాయింపు కోసం శుక్రవారం (16-10-2026) ఉదయం 11 గంటలకు జిల్లా కార్యాలయ సముదాయంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ శ్రీ మను చౌదరి, IAS గారి సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఈ లాటరీలో అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఒక బార్‌కు టోకెన్ నంబర్ 175 కలిగిన శైలజ కాసులవధ ఎంపికయ్యారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెండు బార్లకు టోకెన్ నంబర్ 106 కలిగిన కురా జ్యోతి, టోకెన్ నంబర్ 87 కలిగిన సుంకరి సృజన్ కుమార్ ఎంపికయ్యారు. అదేవిధంగా, ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రెండు బార్లకు టోకెన్ నంబర్ 180 కలిగిన ముద్దన రాహుల్ గౌడ్, టోకెన్ నంబర్ 207 కలిగిన రూపాని శివ కుమార్ ఎంపికయ్యారు. మొత్తం ఐదు 2బి బార్ల కేటాయింపునకు సంబంధించి లాటరీ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ తెలిపారు.



# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**అధికారులను ఆదేశించిన స్పెషల్ చీఫ్**

**సెక్రటరీ వికాస్ రాజ్**

**వెలుతురు మేడ్చల్ మల్కాజిగిరి,అక్టోబర్ 16:**
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయం, ఉద్యానవన, తాగునీటి సరఫరా, విద్యుత్తు, నీటి పారుదల తదితర అంశాలపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎల్‌నినో ప్రత్యేక అధికారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మేడ్చల్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ లు మను చౌదరి, దీపక్ తివారీ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, టీజీపీసీడీఎల్ చైర్మన్ జితేష్ వి. పాటిల్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ...ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేస్తూ రైతులకు అవసరమైన సూచనలు అందించాలని, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నీటి వనరులతో కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వేసవిలో పశువులకు పశుగ్రాసం, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. భూగర్భ జలాలు తగ్గుముఖం పడడంతో నీటి సంరక్షణకు చేపట్టాల్సిన పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు తెలిపారు. జిల్లాలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు సమాచారాన్నిఅందించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజల్ అహ్మద్, ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డీఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





### జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై మంత్రివర్గ ఉపసంఘం

# వెంటనే నిర్ణయం తీసుకోవాలి



## టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16 :** జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) యాక్టింగ్ ప్రెసిడెంట్ పిల్లి రాంచందర్, ప్రధానకార్యదర్శి బి బసవపున్నయ్య డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలోని మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై ఇండ్ల స్థలాల విషయాన్ని తేల్చాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టులు ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనేక జిల్లాల్లో కొత్త అక్రిటిడేషన్ కార్డులు ఇచ్చినప్పటికీ చాలా మంది అర్హులైన జర్నలిస్టులకు నిరాకరిస్తున్నారని చెప్పారు. కొత్త అక్రిడిడేషన్లతోపాటు జర్నలిస్టులకు హెల్త్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై కేసులు ఉన్నాయని చెప్పి కొంత మంది జిల్లా కలెక్టర్లు సీనియర్ జర్నలిస్టులకు కూడా అక్రిడిడేషన్లు ఆపుతున్నారనీ, ఇలాంటి చర్యలను ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. రోజు రోజుకు జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని చెప్పారు. వీటి నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 'జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్టుల సమస్యలపై ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, గుడిగ రఘు, బి రాజశేఖర్, కార్యదర్శులు బి దయాసాగర్, ఈ చంద్రశేఖర్, బి జగదీష్, కొప్పు నిరంజన్, సలీమ, గంద్ర నవీన్, వెంకటేష్,బి దామోదర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మోసపోయినం.. ఘోష పడుతున్నం

- ఆనాడు కేసిఆర్ చెప్పిందే నిజమైంది..
- ఎల్ నినో ప్రభావంతో పంటలు ఎండిపోతుంటే తమాషాలు చూస్తున్నారా..
- పంటలు ఎండిన రైతులు పండుగ ఎలా చేసుకోవాలి..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచించాల్సిన తరుణం..
- ప్రతి రైతుకు ఎకరాకు 50 వేలు పరిహారం ఇవ్వాలి..
- లేదంటే సర్కారుతో ఇక యుద్ధమే..
- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం..



**షాద్ నగర్, వెలుతురు, అక్టోబర్ 16 :** ఎల్ నీ నో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయి.. సకాలంలో విద్యుత్ అందించాల్సిన ప్రభుత్వం వేడుక చూస్తుంది.. పంటలు ఎండిపోయి అవస్థలు పడుతున్న రైతులు పండగ ఎలా చేసుకోవాలి.. కనీస ప్రణాళిక లేకుండా ప్రభుత్వం ఎలా నడిపిస్తున్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇకనైనా స్పందించాలి.. నష్టపోతున్న అన్నదాతలకు పరిహారం అందించాలి.. లేదంటే సర్కారుపై ఇక యుద్ధమే.. అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై .అంజయ్య యాదవ్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం అన్నదాతలు మాత్రమే కాదు.. సామాన్యులు జీవించాలన్నా వ్యవసాయం బాగుండాలి. వ్యవసాయం బాగుండాలంటే నీరు, విద్యుత్ సమృద్ధిగా ఉండాలి. అందుకే గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం, సకాలంలో ఎరువుల పంపిణీ, వ్యవసాయ సమయంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమీక్షల నిర్వహణ ద్వారా వ్యవసాయాన్ని విజయవంతంగా ముందుకు నడిపించారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎల్ నినో ప్రభావం వల్ల పంటలు ఎండిపోతుంటే విద్యుత్ ఇవ్వకుండా రైతుల సహనాన్ని పరీక్షిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పంటలకు 25 రోజులు పూర్తిస్థాయిలో కరెంటు ఇచ్చినా వ్యవసాయం బాగుపడుతుందని, అలాంటి సహకారం ప్రభుత్వం నుంచి లేకపోవడం వల్ల మొక్కజొన్న పూర్తిగా ఎండిపోయిందని, వరి చేలు కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందే కేసీఆర్ మోసపోతే ఘోషపడతామని చెప్పారని, ప్రస్తుతం అదే జరుగుతుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే కరెంటు సమస్యలు, ఎరువుల కోసం కొట్టుకోవడం వంటిది జరిగాయని, ఇప్పుడు మళ్లీ అదే పునరావృతం అవుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వడంలో ఎప్పుడు కూడా రాజీ పడలేదని, కాంగ్రెస్ వచ్చాక ఆ తేడా స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. ఎల్ నీ నో కారణంగా సమస్య ఉత్పన్నం అవుతుందని ముందే తెలిసినప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు ఎందుకు చేసుకోలేదని ప్రశ్నించారు. శ్రీశైలం, కాళేశ్వరం ద్వారా నీటిని నిలువ చేసుకొని రైతులకు అందించాల్సిన బాధ్యతను కూడా మర్చిపోయారని అన్నారు. సమీక్షల ద్వారా కనీసం అధికారులను అప్రమత్తం కూడా చేయని దుస్థితి నెలకొందన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేసి అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. హైడ్రో పవర్ లేకపోతే థర్మల్ పవర్ ద్వారా ఎందుకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే చాలా వరకు నష్టం జరిగిందని కానీ ఎక్కడ ఎంత నష్టం జరిగిందో ఈరోజుకు తెలుసుకోలేకపోయారని వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి జరిగిన నష్టానికి రైతులకు ఎకరాకు 50 వేలు చొప్పున పరిహారం అందించాలని సూచించారు. కనీసం ఇంకో 20 రోజులైనా 24 గంటలు విద్యుత్ ఇచ్చి అన్నదాతలకు సహకరించాలన్నారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర సహకార యూనియన్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్, మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలత సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్లు శారద శేఖర్, వసంత శ్రీనివాస్, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), గోపాల్, మాజీ కౌన్సిలర్ జూపల్లి శంకర్, మాజీ సర్పంచులు రాజరామేశ్వర్ రెడ్డి, గోవిందు అశోక్, మాజీ ఎంపీటీసీ బిశ్వ రామకృష్ణ, నాయకులు రెడ్డి నర్సింలు, రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, ప్రేమ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

- మహిళా జర్నలిస్టులతో కలిసి బతుకమ్మ ఆడి పాడిన మంత్రి సీతక్క
- బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక : మంత్రి సీతక్క






**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16 :** సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మహిళా జర్నలిస్టులతో కలిసి బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా బతుకమ్మ ప్రాధాన్యతను, తెలంగాణ సంస్కృతి--సంప్రదాయాల్లో దాని విశిష్టతను వివరించారు. బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. ప్రకృతిని పూజిస్తూ, పూలను కొలుస్తూ జీవన సౌందర్యాన్ని చాటే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. బతుకమ్మ మన సంస్కృతి, మన సంప్రదాయం, మన తెలంగాణ అస్తిత్వానికి ప్రతిబింబమని అన్నారు. ఆడబిడ్డల ఆనందం, మహిళల ఐక్యత, తెలంగాణ ఆత్మీయత కలగలిసిన పండుగగా బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తంగేడు, గునుగు తదితర పూలతో పేర్చే బతుకమ్మలో తెలంగాణ మట్టి పరిమళం కనిపిస్తుందని చెప్పారు. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం అనే గొప్ప సందేశాన్ని బతుకమ్మ మనకు అందిస్తుందని వివరించారు. కులమతాలకు అతీతంగా మహిళలంతా ఒకే చోట చేరి ఆనందంగా సంబరాలు చేసుకోవడం బతుకమ్మ ప్రత్యేకత అని మంత్రి సీతక్క అన్నారు. బతుకమ్మ పాటల్లో తెలంగాణ పల్లె జీవితం, మహిళల కష్టసుఖాలు, మన నేల సంస్కృతి ప్రతి ధ్వనిస్తాయని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగు తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళల గౌరవం, ఆడబిడ్డల సంతోషం, ప్రకృతి పరిరక్షణకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పూల పండుగ బతుకమ్మ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మన పండుగలను కాపాడుకోవడం అంటే మన మూలాలను, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమేనని అన్నారు. బతుకమ్మ బతుకు సందేశాన్ని అందిస్తూ, ఐక్యతను చాటుతూ తెలంగాణ గర్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో మహిళా జర్నలిస్టులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.

## ఘనంగా ఆత్మీయ అలైబలై కార్యక్రమం



రామాయంపేట, మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని మెహర్ సాయి ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ అలై బలై కార్యక్రమం తెలంగాణ ఉద్యమకారుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు గుండా ఎల్లం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉద్యమ నాయకులు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏళ్లతరబడి కలిసి పోరాడిన సహచరులు ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర కల నెరవేరేందుకు ప్రతి ఒక్కరూ చేసిన త్యాగా ?ఆనాడు సంగారెడ్డి హైదరాబాద్ సికింద్రాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతాలకు బస్సులు మారుతూ పడిన ప్రయాణ ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా కంటిమీద కునుకు లేకుండా ఉద్యమ బాటలో నడిచిన రోజులను భావోద్వేగంతో నెమరువేసుకున్నారు. సకల జనుల సమ్మె ద్వారా రవాణా ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ నిలిపివేసి కేంద్రం మెడలు వంచిన తీరును కొనియాడారు. ?ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలు ఏకమై పోరాడడం వల్లే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందని స్పష్టం చేశారు. ఈ ?ఉద్యమంలో వంద మంది పోరాడితే అందులో 90 మంది నష్టపోయారని కేవలం 10 మందికి మాత్రమే ఫలాలు దక్కాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాలను గుర్తించాలని ఉద్యమంలో భాగస్వాములైన ప్రతి ఉద్యోగికి ఉద్యమకారునికి సముచిత న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఆనాడు అన్ని పార్టీలు కలిసి పోరాడినట్లే నేడు కూడా అభివృద్ధి కోసం కలసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రమాశర్మ నర్సింహా రెడ్డి రామచంద్రన్ వేదికపై తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రముఖ నాయకులు వసంత రెడ్డి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొని ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. ??ఉద్యమంలో ప్రాణాలు సైతం లెక్కచేయక పోరాడిన వీరులను పొగడ్తలు శాలువాలతో సన్మానించారు. ?ఇటువంటి ఆత్మీయ కలయికలు ఉద్యమకారులలో నూతన ఉత్సాహాన్ని, ఐక్యతను నింపుతాయని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఉద్యమకారుల సంక్షేమం కోసం ఉమ్మడిగా పోరాడాలని నాయకులు నిశ్చయించుకున్నారు. సమయాభావం ఉన్నప్పటికీ వేడుకలో పాల్గొని పాత జ్ఞాపకాలను పంచుకోవడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు.

### ఎన్నికల నియమావళిని

# పకడ్బందీగా అమలు చేయాలి

## కలెక్టర్ నిశాంత్‌కుమార్



**రాయచోటి, వెలుతురు అక్టోబర్ 16:** అన్నమయ్య జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మదనపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధత, నామినేషన్లు, పోలింగ్ కేంద్రాలు, భద్రత, ఎన్నికల సామగ్రి నిర్వహణ తదితర అంశాలపై జిల్లా ఎన్నికలనోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాల యాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, రాజకీయ ఫ్లెక్సీలు, గోడలపై రాతలు (వాల్ రైటింగ్స్), క్యాలెండర్లు తదితర రాజకీయ ప్రచార సామగ్రిని తక్షణమే తొల గించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిష్పక్షపాత ధోరణి. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు రాజకీయ పక్షపాతానికి తావులేకుండా తటస్థంగా వ్యవహరించాలన్నారు. సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల కోసం పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ. మూడు మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటనను ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. నామినేషన్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, ఏర్పాట్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేయాలని ఆదేశించారు. పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లు. పోలింగ్, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రదేశాలను ముందుగానే గుర్తించి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, రవాణా, భద్రపరిచే ప్రక్రియకు పోలీసు భద్రత కల్పించాలని, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్‌కు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. శాఖల సమన్వయం, నియమావళి అమలు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి తరలింపు, స్ట్రాంగ్ రూముల భద్రత, పోలింగ్ కేంద్రాల బందోబస్తు, సున్నిత ప్రాంతాల్లో నిఘాపై పోలీసు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా రాజకీయ ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి అధికారి రోజువారీ సమీక్షల ద్వారా సమస్యలను వెంటనే పరిష్కరించి, నిర్ణీత కాలపరిమితిలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్ఓ ఏ. వెంకటేష్, ఆర్డీవో విజయలక్ష్మి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీపతి, జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎంపీటీసీ

# రాజులపాటి లచ్చమ్మకు నివాళి

- కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్
- కాంగ్రెస్ పార్టీ నీకాసైనా నాయకురాలు ను కోల్పోయింది
- మండల అధ్యక్షులు సమ్మిగౌడ్
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మాజీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు



**కేసముద్రం వెలుతురు అక్టోబర్ 16:** కేసముద్రం మండలం లోని ఇంటికన్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ, సీనియర్ నాయకురాలు రాజులపాటి లచ్చమ్మ మృతి చెందిన విషయం స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షులు రాజులపాటి మల్లయ్య,వార్డ్ సభ్యులు బొల్లం రమేష్ ద్వారా విషయం తెలుసుకున్న కేసముద్రం మండలపార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మిగౌడ్ ఇంటికన్నె గ్రామానికి వెళ్లి రాజులపాటి లచ్చమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఆమె పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని, ఇలాంటి క్లిష్ట పరిస్థితి లో వారి కుటుంబం మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండేలా భగవంతుడు తోడుగా ఉండాలని కోరారు..రాజులపాటి లచ్చక్క, వారి కుటుంబం దశబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కుటుంబం అనీ, వారికుటుంబానికి మండల, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. లచ్చమ్మ మృతిపట్ల పట్ల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు,ూజూ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్ రావు సంతాపం తెలియజేసి నివాళి అర్పించారు.. ఆమె భౌతికకాయంపై కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ కండువతో దహన సంస్కారాలు చెయ్యాలని కోరారు.. లచ్చమ్మ భర్త రాజులపాటి కట్టయ్య కాగా, కుమారులు రాజులపాటి అశోక్, వెంకన్న, దేవేందర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో లచ్చక్క కుటుంబ సభ్యులు అల్లం వెంకన్న,ఇంటికన్నె గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజులపాటి మల్లయ్య, మిట్ట గడుపుల యాకయ్య, ఎండీ నిజాముద్దీన్, బోళ్ల రమేష్ యాదవ్, గాదె శీను, మల్లెల లక్ష్మీనారాయణ, రాజులపాటి ఉప్పలయ్య, బోళ్ల హరీష్, వర్ధెల్లి రంజిత్ గౌడ్, కొల్లూరి వెంకన్న, బెజ్జం శివ, చంద్రు తండా సర్పంచ్ బానోత్ శీను నాయక్, నల్లమాస ఉప్పలయ్య తదితరులు పాల్గొని నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కేటిఆర్ నువ్వు పశువా, గాడిదా?

- కేటిఆర్ 12వేల అమరవీరుల ఉసురు కుటుంబాల ఉసురు తగులతది
- కేటిఆర్ పై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం కీలక వ్యాఖ్యలు

**హైద్రాబాద్, వెలుతురు అక్టోబర్ 16:** 12వేల అమరవీరుల ఉసురు కుటుంబాల ఉసురు తగులతది అంటూ కేటిఆర్ పై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ దుర్మార్గుడా కేటిఆర్ అమర వీరుల ఉసురు తగిలి నువ్వు సర్వ నాశనం అవ్వడం ఖాయ మన్నారు. కేటిఆర్ ముబాయ్ కట్టిన హోటల్స్ పర్సెంటేజ్ ఎంత? సర్వే నంబర్ ,5వేల గజాలలో ఎట్ల కట్టినవో దాట నా దగ్గర ఉంది. మొత్తం నీపని మీద నే తిరుగుతున్న కేటిఆర్ నువ్వు పరేషాన్ కాకుఅని అన్నారు. 2018 డిసెంబర్ 5న ఢిల్లీలో 2వేల కోట్ల 25 ఎకరాలు కొన్నాడుఢిల్లీలో ఉన్న 25ఎకరాల భూమి డాటా కూడా నా దగ్గర ఉంది2014 లో పెట్టిన మెడికవర్ ముఖ్యమంత్రి కూతురు ది అంటుందునీకు నీతి నిజాయితీ ఉంటే అపద్దాలుమాట్లాడకుఎిఅ కోహినూర్ లో 25% కేటిఆర్ కు షేర్ ఉందని ఆరోపించారు. ఎఐ మాల్ లో నీకు 25% షేర్ ఉందా, లేదా? ఎి కంపెనీలకు ఇచ్చిన ప్రభుత్వ భూములలో కేటిఆర్ కు 25% షేర్ ఉంది500 కోట్ల వాల్యూ చేసే పినిక్స్ జూబ్లీహిల్స్ లో, హైటెక్ సిటీలో నీ బామ్మర్ది బినామీ కదా? అని ప్రశ్నించారు. 140 ఏండ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి ఉండటానికి ఇల్లు లేదుపది ఏండ్లు తెలంగాణ ను దోచుకొని వేల కోట్లు సంపాదించారు కేటిఆర్ కొత్త బిచ్చగాడిలాగా బయలుదేరాడు. గడ్డం పెంచుకొని రాజుకు పుట్టినట్లు అనుకుంటుండు అని ఎద్దేవా చేశారు. 2014 నుండి 2023 వరకు కేటిఆర్ సింగరేణి కార్మికుల సమస్యల మీద మాట్లాడినవా? హరీష్ మట్లాడిండా? సింగరేణి కార్మికులతో మాట్లాడుతా అంటే పోలీసుల తో హుక్కు పాదం మోపింది వాస్తవం కాదా? మీరు నిర్బంధం పెట్టిన మాట వాస్తవం కాదా? పది సవత్సరాలు సింగరేణి లో పది వేల కోట్లు దోచుకుంది వాస్తవం కాదా? కేటిఆర్ నీ డాటా మొత్తం నా దగ్గర ఉంది, మీదొర కుటుంబ చరిత్ర మొత్తం తెలుసుసీఎం రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టి నిన్న కేటిఆర్ మీటింగ్ పెట్టాడు, లేకుంటే నీకు ఆ పరిస్థితి ఉండేది కాదన్నారు. కేటిఆర్ పాలేరు క్రిశాంక్ మెడికవర్ ఆసుపత్రి గురించి మాట్లాడుతుండు2014 మెడికవర్ ఇనాగురేషన్ కేసీఆర్ చేశారు2023లో హరీష్ రావు, కిషన్ రెడ్డి కూడా ప్రారంభించాడుకేటిఆర్ ఎన్ని చెప్పినా తెలంగాణ ప్రజలు నమ్మరు నిన్ను తన్ని తరిమి మేయడం ఖాయం కేటిఆర్ అని గజ్జెలు కాంతం హెచ్చరించారు కేటిఆర్, హరీష్ రావు మీద తమ ప్రభుత్వం ఖచ్చితంగా చర్యలు తీసుకుంతుందన్నారు.

### పదేళ్లలో అధికారంలో ఉండి

## ఒక రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్

**-అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తున్నాం**

**-దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.**



**దేవరకద్ర, వెలుతురు అక్టోబర్ 17 :** అడ్డాకుల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అడ్డాకుల మండలం కు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ,సీ.ఎం. రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేసి అనంతరం రేషన్ కార్డ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసినప్పులకు నెలకు 6500 కోట్ల రూపాయలు వడ్డీ కట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 2 లక్షల రుణమాఫీ, 500 కి గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లు ఫ్రీ కరెంటు, 10 లక్షల ఆరోగ్య శ్రీ, సన్న బియ్యం ఇందిరమ్మ ఇండ్లతో పాటు రేషన్ కార్డులు ఇచ్చామని తెలియజేశారు. పేద ప్రజల సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పైరవీకి తాగు లేకుండా లబ్ధిదారులకు ప్రతి పథకం చేరే విధంగా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలియజేశారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటుందని తెలియజేశారు. టిఆర్ఎస్ నాయకులు రేపు వస్తా ఎల్లుండి వస్తామని కలలు కంటున్నారని భవిష్యత్తు లేని పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ అని ఈ విషయాన్ని స్వయంగా కే.సీ.ఆర్ కుమార్తె కవిత తెలియజేసిందని చెప్పారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, మండల మరియు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రుద్రవరంలో తొలిసారిగా అమ్మవారి బిందె సేవ

**-సరస్వతీ దేవి అలంకారంలో వాసవి మాత**

**రుద్రవరం,వెలుతురు అక్టోబర్ 17 :** మండల కేంద్రం రుద్రవరంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో అత్యంత పవిత్రమైన మూల నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని వాసవి మాత చదువుల తల్లి, జ్ఞానప్రదాయిని అయిన 'సరస్వతీ దేవి' అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. ఈ ఏడాది ఉత్సవాల్లో తొలిసారిగా అమ్మవారి 'బిందె సేవ'ను అత్యంత ఘనంగా ప్రారంభించడం విశేషం. ఉదయం ఆలయంలో భక్తిశ్రద్ధలతో వెండి బిందెకు కలశ పూజ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఉపవాస దీక్షతో ఉన్న యువకులు అమ్మవారి బిందెను తలపై ఎత్తుకుని పురవీధుల్లో అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపులో ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన కోలాట ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు, సభ్యులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని చదువుల తల్లి ఆశీస్సులు పొందారు

### 24గంటలు కరెంట్ ఇస్తామని

# 6గంటలే కరెంట్ ఇస్తున్న కాంగ్రెస్

- రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ కోతలు.. ఎండిపోతున్న పంటలు..
- సింగరేణిని సంక్షోభంలోకి నెట్టి తెలంగాణను చీకట్లోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజం



**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 17 :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించలేని పరిస్థితి నెలకొనడం, పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలకు నిదర్శనమని ఆయన అన్నారు. హుజురాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభం, రైతుల సమస్యలు, సింగరేణి సంస్థ పరిస్థితి, ప్రభుత్వ విధానాలపై పలు ప్రశ్నలు సంధించారు.

**రైతులకు కరెంట్ కోతలు.. ఎండిపోతున్న పంటలు**

తెలంగాణ రాష్ట్రంలో ఒకప్పుడు రైతులకు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని కౌశిక్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సరైన సమయంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తుంటే, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా? రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని నిలదీశారు.

**ఎల్‌నినో కాదు.. ప్రకృతి వైపరీత్యం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం**

విద్యుత్ సమస్యలకు ప్రకృతి వైపరీత్యాలను సాకుగా చూపిస్తూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకూడదని కౌశిక్ రెడ్డి అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు. నేడు విద్యుత్ సరఫరాపై ప్రజల్లో ఆందోళన నెలకొనడానికి కారణాలేంటి? ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సింగరేణి భవిష్యత్తును సంక్షోభంలోకి నెడుతున్నారా?**

తెలంగాణకు ఆర్థికంగా కీలకమైన సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. సింగరేణి సంస్థ బలోపేతం కావడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఆదాయం, కార్మికుల సంక్షేమం, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. సింగరేణి విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు సంస్థ భవిష్యత్తుకు, కార్మికుల ప్రయోజనాలకు అనుకూలంగా ఉండాలని అన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ అవసరాలు, సంస్థ నిర్వహణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, కార్మికుల హక్కులను కాపాడాలని కౌశిక్ రెడ్డి కోరారు. విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలితెలంగాణ విద్యుత్ రంగం ప్రస్తుత పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర నివేదిక విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి ఎంత ఉంది? రాష్ట్ర అవసరాలు ఎంత? విద్యుత్ కొనుగోళ్లకు ఎంత ఖర్చు చేస్తున్నారు? విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణాలేమిటి? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ సరఫరా వ్యవస్థ, వ్యవసాయానికి అందించిన విద్యుత్‌పై వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాకుండా, ప్రస్తుత ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించాలని అన్నారు. విద్యుత్ అధికారులను బలిచేసి బాధ్యతల నుంచి తప్పించుకోలేరువిద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు అధికారులపై నెపం నెట్టి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవడం సరికాదని కౌశిక్ రెడ్డి అన్నారు. విద్యుత్ సరఫరా సజావుగా జరిగేలా చూడటం, అవసరమైన వనరులను సమకూర్చడం, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

# స్థానిక పోరుకు సిద్ధమవుతున్న నాయకులు

- ఈ నెల 19న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ.
- నవంబర్ 26 నుంచి తొలి దశ పంచాయతీ ఎన్నికలు





**హోళగుంద, వెలుతురు అక్టోబర్ 17 :**స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం నగర మోగింది మండలంలో 14 ఎంపీటీసీ,ఒక జడ్పిటిసి,17 గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది.దీంతో స్థానిక పోరుకు ఆశావహులు సిద్ధపడుతున్నారు. మండల మొత్తంగా 44134 ఓటర్లు ఉండగా,ఇందులో పురుషులు 22059,మహిళలు 22059,ఇతరులు 16 మంది ఉన్నారు.కుల ప్రతిపాదికన ఎస్టీ 1425,ఎస్సీ 7146,బిసి 32461,ఇతరులు 3102 మంది చొప్పున ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీఓ సయ్యద్ ఉమర్ తెలిపారు.ముఖ్యంగా మండల వ్యాప్తంగా 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇందులో గేజ్జహల్లి బిసి మహిళ,వందవాగలి బిసి,ఇంగల్దహాల్ అన్రిజర్వుడ్ మహిళ,హెబ్బటం అన్రిజర్వుడ్, మార్లమడికి అన్రిజ ర్వుడ్, హోళగుంద 1 అన్రిజర్వుడ్ మహిళ, హోళగుంద 2 బిసి,హోళగుంద 3 ఎస్టీ,హోళగుంద 4 అన్రిజర్వుడ్ మహిళ,చిన్నహ్యేట ఎస్సీ మహిళ,ఎల్లార్తి ఎస్సీ,లింగంపల్లి అన్రిజర్వుడ్,నేరనికి అన్రిజర్వుడ్ మహిళ,సులువాయి బిసి మహిళగా రిజర్వేషన్ అయ్యింది.మరియు జడ్పిటిసి,ఎంపీపీ స్థానాలకు జనరల్ కు కేటాయించారు.అదేవిధంగా 14 ఎంపీటీసీ స్థానాల పరిధిలో 49 పోలింగ్ కేంద్రాల్లో నవంబర్ 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 5న ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది.ఇదిలా ఉండగా మండలంలో 17 గ్రామ పంచాయతీలకు కూడా రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి.ఇందులో హోళగుంద ఎస్టీ,చిన్నహ్యేట అన్రిజర్వుడ్ మహిళ,గజ్జేహళ్లి అన్రిజర్వుడ్,హెబ్బటం అన్రిజర్వుడ్ మహిళ, హోన్నూరు ఎస్సీ మహిళ, ఇంగల్దహాల్ ఎస్టీ,కొగిలతోట బిసి మహిళ,లింగంపల్లి అన్రిజర్వుడ్,ఎండి హల్లి ఎస్సీ మహిళ,మార్లమడికి అన్రిజర్వుడ్,నేరణికి బిసి,నేరణికి తండా అన్రిజర్వుడ్, పెద్దగోనేహాళ్ అన్రిజర్వుడ్ మహిళ, సమ్మతగేరీ బిసి,సులువాయి అన్రిజర్వుడ్ మహిళ,వందవాగలి అన్రిజర్వుడ్,ఎల్లార్తి బిసి మహిళకు కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. నవంబర్ 26 నుంచి గ్రామ పంచాయతీ తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి. మండలంలోని 17 పంచాయతీలకు 174 వార్డులకు 190పోలింగ్ కేంద్రాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించనుంది.స్థానిక పోరుకు పచ్చ జెండా ఊపడంతో ఎన్నికల్లో పోటీ చేయదలచుకున్న ఆశావాహులు గ్రామాల్లో ఇప్పటికే తమ ప్రయత్నాలు ప్రారంభించారు.

## రావిలంక నుండి విజయవాడ భవానీలు పాదయాత్ర



**దేవీ పట్నం, వెలుతురు అక్టోబర్ 17 :** భక్తి శ్రద్ధలతో, అమ్మవారి నామస్మరణతో రావిలంక గ్రామం నుండి విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ దర్శనానికి భక్తుల బృందం పాదయాత్రగా బయలుదేరింది. ఎరుపు వస్త్రాలు ధరించి, మెడలో పూలమాలలు, చేతిలో భవానీ జెండాలతో "జై భవానీ" అంటూ భక్తులు చేస్తున్న పాదయాత్ర గ్రామంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అమ్మవారి దర్శనమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ పాదయాత్రకు గురు భవానీ కుప్పాల దుర్గారావు ఆధ్వర్యంలో 8 మంది భవానీలు భక్తులు పాదయాత్రకు బయలుదేరారు. వారికి గ్రామస్తులు, మహిళా భక్తులు హారతులు ఇచ్చి, తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తుల యాత్ర విజయవంతంగా సాగి, అమ్మవారి దర్శనం చేసుకుని క్షేమంగా తిరిగి రావాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## కరెంటు సమస్యలతో రైతులకు ఇబ్బందులు

**వికారాబాద్,వెలుతురు అక్టోబర్ 17 :** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులకు కరెంటు ఇబ్బందులు లేవని, కాంగ్రెస్ పాలనలో రైతులు విద్యుత్ కష్టాలను ఎదుర్కొంటున్నారని మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ మరియు వికారాబాద్ మాజీ పట్టణ అధ్యక్షులు గోపాల్ విమర్శించారు. వికారాబాద్ పట్టణంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు కరెంటు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలగకుండా రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ సంస్థలపై రాజకీయ విమర్శలు తగవు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 17 :** రాజ్యాంగబద్ధ సంస్థలు, న్యాయవ్యవస్థపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ నాయకులు ఖండించారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగబద్ధ సంస్థలు, స్వతంత్ర న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక వంటివని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వాటిపై నిరాధార ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడటంతోపాటు వ్యవస్థలపై విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉందన్నారు. ఓటర్ల జాబితాల పారదర్శకత, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేందుకు వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలు ఉంటే రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు, భిన్నాభిప్రాయాలకు స్థానం ఉందని, అయితే రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజల్లో అపనమ్మకం కలిగించేలా వ్యవహరించడం బాధ్యతాయుత రాజకీయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు వాస్తవాలను పరిశీలించి, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని పిలుపునిచ్చారు.

## గాంధీ ఆసుపత్రిలో ఘనంగా విజయ దశమి వేడుకలు




**సికింద్రాబాద్, వెలుతురు అక్టోబర్ 17 :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయ దశమి పండుగ అని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఉషారాణి తెలిపారు. విజయదశమి వేడుకల్ని పురస్కరించుకుని నేడు ?గాంధీ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో ఘనంగా జరిగిన వేడుకలు ఉ పూజా కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ డా. ఉషారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులందరూ త్వరగా కోలుకుని పరిపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, సమాజంలో ప్రతీ ఒక్కరికీ సకల సంపదలు, సౌభాగ్యం చేకూరాలని ఆ భగవంతుడిని వేడుకున్నట్లు చెప్పారు. ఆసుపత్రి వైద్యులకు, నర్సింగ్ వర్గానికి, పారామెడికల్ సిబ్బందికి, రోగులకు, వారి బంధువులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాంధీ ఆవరణలో ఘనంగా జరిగిన బతుకమ్మ సంబరాలలో వైద్యులు, నర్సులు, పరిపాలనా విభాగం సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

### విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి

# ప్రతి ఒక్కరూ సహకరించాలి

**గౌడ్ సంఘం ప్రతినిధులు**




**పటాన్ చెరు, వెలుతురు అక్టోబర్ 17 :** తెలంగాణ రాష్ట్రంలోని గౌడ కులస్తుల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌడ హాస్టల్ భవనాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, హాస్టల్ ఫౌండర్ చక్రవర్తి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్. గౌడ సంఘం రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిదులు లాంఛనంగా ప్రారంభించారు. గౌడ హాస్టల్ భవన నిర్మాణానికి భూమి దానం చేసిన దొంతి లక్ష్మీనారాయణ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడు ఘనంగా సన్మానించి అభినందించారు. సమాజ అభివృద్ధి కోసం విలువైన భూమిని దానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ఉదారత, సామాజిక బాధ్యత ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌గౌడ విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా హాస్టల్ భవనాన్ని నిర్మించాలని మంత్రి సూచించారు. ఈ భవనంలో చదువుకున్న విద్యార్థులు భవిష్యత్తులో సివిల్ సర్వెంట్లుగా ఎదిగి సమాజానికి సేవలందించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడంతోపాటు, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో గౌడ పెద్దలు, సంఘాల ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కోరారు. కోకాపేటలో హాస్టల్ భవన నిర్మాణానికి సంబంధించి భూముల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. భవన నిర్మాణానికి తాను ముందుండి సహకరిస్తానని, అవసరమైన ప్రభుత్వ అనుమతులు పొందేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హాస్టల్ నిర్మాణం త్వరితగతిన ముందుకు సాగేందుకు గౌడ సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాయకులు, గౌడ ప్రతినిధులు పాల్గొన్నారు

# కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు నిలిపివేయాలి

- 94 న్యాయమైన రోస్టర్ పాయింట్ల కేటాయింపు జరిగే వరకు
- 'నో రోస్టర్ ? నో ఓటు' నినాదంతో మాల సామాజిక వర్గం పోరాట కార్యాచరణ

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 17 :**ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద సంఘాల జేఏసీ, మాల స్టూడెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రోస్టర్ పాయింట్లలో న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల ఎస్సీ గ్రూప్? 3 పరిధిలోని మాల సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతోందని, మొదటి 20 రోస్టర్ పాయింట్లలో కనీసం 2 పాయింట్లు కేటాయించేలా ప్రభుత్వం తక్షణమే సవరణలు చేయాలని కోరారు. గత నియామకాలు, విద్యా ప్రవేశాల్లో జరిగిన ప్రాతినిధ్య లోటును సమీక్షించాలని, సవరణలు పూర్తయ్యే వరకు కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల వద్ద శాంతియుత ధర్నాలు, గ్రామస్థాయి అవగాహన కార్యక్రమాలు, జిల్లా సదస్సులు నిర్వహిస్తామని ప్రకటించారు. "నో రోస్టర్ ? నో ఓటు" నినాదంతో ఉద్యమాన్ని గ్రామస్థాయి వరకు విస్తరిస్తామని, రోస్టర్ సవరణలు చేపట్టకపోతే రాబోయే ఎన్నికల్లో తమ నిరసనను ప్రజాస్వామ్యబద్ధంగా తెలియజేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, మాల స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు, ప్రొ. సవీన్ సౌడా, బేరే బాలకిషన్, నామ సైదులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు బీఆర్ఎస్ సంఘీభావం

**వికారాబాద్, వెలుతురు అక్టోబర్ 17 :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎన్ హెచ్ ఎం నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రత్ పటేల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని వారు కోరారు కరోనా లాంటి కష్ట సమయాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ప్రాణాలను పననీగా పెట్టి వారు ఉద్యోగం చేశారని వారితో పాటు ఉద్యోగం చేస్తున్న ఇతర ఉద్యోగులకు లక్షల రూపాయల జీతం ఇచ్చి అదే పని చేస్తున్న ఉద్యోగులకు అందులో పదో వంతు కూడా వీరికి ఇవ్వకపోవడం చాలా బాధాకరమని ప్రభుత్వం వారిని వెంటనే గుర్తించి వారికి సరైన పనికి సరైన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగి మాట్లాడుతూ తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన టిఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



**ఆళ్లగడ్డ వెలుతురు అక్టోబర్ 17 :**ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారిశాలలో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ మూర్తిని శ్రీ సరస్వతీదేవిగా అలంకరించి అలంకార మండపంలో కొలువు తీర్చి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉభయ దారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అలంకారాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, సభ్యులు పాల్గొన్నారు. ఆళ్లగడ్డలో వైభవంగా బిందెసేవ ఉత్సవం... ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారి శాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి బిందెసేవ ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మూలా నక్షత్రం సందర్భంగా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని కలశం లోకి ఆవాహన చేసి వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య బ్రహ్మచారులు అమ్మవారి కలశాన్ని నెత్తిపై పెట్టుకుని పట్టణంలోని ప్రతి ఆర్యవైశ్యుల ఇళ్ల వద్దకు ఊరేగింపుగా తీసుకొని వెళ్లి ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, బైసాని రవి తదితర కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కరీంనగర్ మహాశక్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు



## మూలా నక్షత్రం.. చదువుల తల్లి సరస్వతీదేవి దివ్యదర్శనం!

### భారీగా తరలివచ్చిన విద్యార్థులు, భవానీ భక్తులు

### సాయంత్రం అంగరంగ వైభవంగా అమ్మవారి పల్లకీ సేవ

### సరస్వతి దేవీని కీర్తిస్తూ నాట్యంతో ఆకట్టుకున్న మహిళలు

### ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో అద్భుతంగా కొనసాగుతున్న 'దాండియా'



**కరీంనగర్, వెలుతురు:**

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో 6వ రోజైన శుక్రవారం రోజు మూలా నక్షత్రం సరస్వతి దేవీ (కాత్యాయనీ) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు శ్రీ మహాశక్తి ఆలయానికి క్యూ కట్టారు. భవానీ భక్తులు ఒకవైపు, విద్యార్థుల అక్షరాభ్యాసం, పుస్తకాల పూజ మరోవైపు... వెరసి మహాశక్తి ఆలయం జాతున సరస్వతి నిలయంగా మారిపోయింది. చదువుల తల్లి జాతున సరస్వతి దివ్య దర్శనం తో భక్తుల మనసులు పులకించిపోయాయి. భవానీ దీక్షలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చదువుల తల్లి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుల్లారావు యాదవ్ తోపాటు పలువురు ప్రముఖులు బండి సంజయ్ తోపాటు మహాశక్తి అలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



### జ్ఞానజ్యోతులు వెలిగించే జగన్మాత.. విద్యార్థుల పాలిట వరప్రదాయిని

అజ్ఞానమనే చీకటిని తొల గించి జ్ఞానమనే వెలుగు ను ప్రసాదించే చదువుల తల్లి సరస్వతీదేవి ఆరాధ నకు మూలా నక్షత్రం అత్యంత విశిష్టమైనది. దేవీ శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా మహాశక్తి ఆలయంలో కొలువైన అమ్మవారిని సరస్వతీదేవి రూపంలో దర్శించుకుని భక్తులు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతికి లోన య్యారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయు లు, కళాకారులు, సాహితీవేత్తలు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి జ్ఞానం, వివేకం, ఏకాగ్రత ప్రసాదించాలని ప్రార్థించడం విశేషం.

### అంగరంగ వైభవంగా అమ్మవారి పల్లకీ సేవ

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మహాశక్తి ఆలయంలో ఈరోజు సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ అంగరంగ వైభవంగా కొనసాగింది. అధ్యాత్మిక ప్రవచనాలు ఒకవైపు... సరస్వతి దేవీని కీర్తిస్తూ చిన్నారులు, మహిళలు నృత్యాలు మరోవైపు వెరసి భక్తులను కనువిందు చేశాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఆద్యంతం పల్లకీ సేవలో తరించారు.

### ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో 'దాండియా' అదరహో...

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో ఈరోజు రాత్రి 9 గంటల తరువాత నిర్వహించే దాండియా కార్యక్రమానికి వేలాది మంది భక్తులు, ముఖ్యంగా యువతీ యువకులు హాజరై ఆధ్యాత్మిక ఆటపాటలతో చిందులేస్తూ అందరినీ ఆకట్టుకొనున్నారు. నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ధరించి 'దాండియా'కు హాజరై నృత్యాలు చేయబోతుండటం విశేషం.



## కరువు ముప్పు నుంచి కాపాడు తల్లి..

- ప్రభుత్వం తరపున జోగులాంబ అమ్మవారికి మంత్రి వాకిటి శ్రీహరి దంపతుల పట్టు వస్త్రాల సమర్పణ
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం నా పూర్వజన్మ సుకృతం : మంత్రి



**అలంపూర్, వెలుతురు:**

దసరా శరన్నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శక్తిపీఠం అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రిదంపతులకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో మంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.... జగన్మాత జోగులాంబ అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం తనకు లభించిన గొప్ప ఆధ్యాత్మిక భాగ్యమని అన్నారు. ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రాన్ని, దేశాన్ని కరువు ముప్పు నుంచి కాపాడాలని జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయం సజావుగా సాగాలని, రైతుల కష్టాలు తొలగి ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ప్రకృతి అనుకూలించి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలియజేశారు.



## అందరం కలిసి ప్రకృతి విపత్తును ఎదుర్కొందాం

- ప్రజా ప్రభుత్వం సలహాలు సూచనలు రైతులు పాటించాలి
- ప్రజలకు స్పీకర్, వికారాబాద్ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్ పిలుపు
- 97 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





**వికారాబాద్, వెలుతురు:**

భారత్‌తో పాటు ప్రపంచ దేశాలను వణికిస్తున్న ప్రకృతి విపత్తు ఎల్‌నినో ను ప్రజలందరం కలిసి ఎదుర్కోవాలని తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. వికారాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రోజు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కు లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్ నినో విపత్తు, దాని ప్రభావంపై స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం దాదాపు 100 దేశాల్లో ఉందని, ఇదోక ప్రకృతి విపత్తు అని చెప్పారు. ప్రజలు, రైతులు ప్రజా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకెళ్లాలని కోరారు. రైతులకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సాగుకు నీటిని పొదుపుగా వినియోగించు కుందామన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ప్రకృతి విపత్తును కలిసికట్టుగా నిలబడి ఎదుర్కోవాలని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా ప్రజా ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు, అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. వికారాబాద్ నియోజకవర్గంతో పాటు వికారాబాద్ పట్టణం తమ హయంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ తరహాలో వికారాబాద్ టౌన్‌లో శివసాగర్ చెరువును సుందరీకరణ చేస్తామని హామీ ఇచ్చారు.

## చెరువుల పరిరక్షణలో.. స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలి

### రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ స్పీకర్ మీట్‌లో హైడ్రా కమిషనర్ పిలుపు




**హైదరాబాద్, వెలుతురు:**

సమాజ శ్రేయస్సుతో పాటు పర్యావరణ పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. చెరువుల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతను కాపాడడం, విపత్తుల నివారణలో ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలతో పాటు కార్పొరేట్ సంస్థలు కూడా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఐటీసీ కోహినూర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్-3150 ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్పీకర్ మీట్ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడారు. అధ్యక్షులు రొటేరియన్ రమేష్ పటేల్, కార్యదర్శి రొటేరియన్ శాంతి పాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ చెరువులు, నాళాల పరిరక్షణ, పునరుద్ధరణతో పాటు ప్రభుత్వ భూములు పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలను వివరించారు.

చెరువులను పునరుద్ధరించడం, వర్షపు నీరు చెరువుల్లోకి చేరేలా ఇన్‌లెట్ నాలాలను అభివృద్ధి చేయడం, నీటి ప్రవాహానికి కాలువల్లో ఉన్న అడ్డంకు లను తొలగించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెరువుల పునరుద్ధరణ వల్ల వరద ముప్పు తగ్గడంతో పాటు భూగర్భ జలాల నిల్వలు పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు.

### ప్రజాసమస్యల పరిష్కార వేదిక హైడ్రా ప్రజావాణి...

హైడ్రా ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి విజయవంతమైన వేదికగా నిలుస్తోంది. ప్రతి సోమవారం ప్రజల ఫిర్యాదుల స్వీకరణతోనే మా పనులు ప్రారంభమవుతాయి. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనే ప్రజావాణి విజయానికి నిదర్శనం అన్నారు. ఆక్రమణలను తొలగించడంతో కబ్జాదారుల చెరలో ఉన్న సుమారు 3వేల ఎకరాలను ఈ రెండేళ్ల లో కాపాడమని కమిషనర్ చెప్పారు. చెరువులు, నాలాలు, పార్కులు, రహదారులు, ప్రభుత్వ బహిరంగ స్థలాల పరిరక్షణకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత రికార్డుల తనిఖీ, చట్టపర మైన ప్రక్రియ అనంతరం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

### విపత్తు వచ్చిన తర్వాత కాదు ముందే నివారణ

హైడ్రా కేవలం ఆక్రమణలను తొలగించే సంస్థ మాత్రమే కాదని, విపత్తులను ముందుగానే గుర్తించి నివారించడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తోందని రంగనాథ్ తెలిపారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

## గజ్వేల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**తూప్రాన్, వెలుతురు:**

గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. పార్టీలో వ్యక్తిగత విభేదాలు ఉన్నా వాటిని పక్కనపెట్టి గజ్వేల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అన్నారు.

గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా ఎన్నికైన ఉమన్నగారి భాస్కర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ చైర్మన్ నరసింహతో పాటు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించేలా పార్టీ నాయకత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా పార్టీ ముందుకు సాగుతోందని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి పార్టీ శ్రేణులకు సూచించారు. ఆరు గ్యారంటీల అమలుతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం వంటి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు ద్వారా విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ పథకాల గురించి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలని సూచించారు. గత పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో బీఆర్ఎస్ విఫలమైందని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలను నెరవేర్చలేదని అన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన పాలకులు వ్యక్తిగతంగా ఆస్తులు పెంచుకోవడంపై దృష్టి పెట్టారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు, విభేదాలు కుటుంబాల్లో ఉన్నట్లుగానే పార్టీలోనూ ఉంటాయని, అయితే పార్టీ ప్రయోజనాల విషయంలో అందరూ ఒక్కటిగా నిలవాలని అన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ గజ్వేల్‌లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

## విజయ పాల ధరల పెంపు...

### నేటి నుంచి కొత్త ధరలు అమల్లోకి




**హైదరాబాద్, వెలుతురు:**

తెలంగాణలోని ప్రముఖ ప్రభుత్వ రంగానికి చెందిన విజయ డెయిరీ తమ పాల ధరలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెరిగిన లీజింగ్, రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులతో ఈ ధరల సవరణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ కొత్త పాల ధరలు అక్టోబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. అంటే అక్టోబర్ 16 రాత్రి నుంచి సప్లైలకు కొత్త ధరలు వర్తించనున్నాయని ఆ ప్రకటనలో తెలిపింది. ఈ విడతలో విజయ డెయిరీ ముఖ్యంగా స్టాండర్డైజ్డ్ మిల్క్, హోల్ మిల్క్ రకాలపై ధరలను సవరించింది. లీటరు చొప్పున కాకుండా ప్రతీ 500 ఎంఎల్ (అర లీటరు) ప్యాకెట్‌పై రూ. 1 చొప్పున పెంచారు. దీని ప్రకారం, ఇప్పటివరకు రూ.34కి లభించే 500 ఎంఎల్ స్టాండర్డైజ్డ్ మిల్క్ ప్యాకెట్ ధర ఇకపై రూ.35 అవుతుంది. రూ.39గా ఉన్న 500 ఎంఎల్ హోల్ మిల్క్ ప్యాకెట్ ధర రూ.40 అయింది. దాంతో వినియోగదారులు అక్టోబర్ 17 నుంచి ఈ కొత్త సవరించిన ధరల ప్రకారమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 040 27019851, 27019854 లలో సంప్రదించాలని సూచించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com